


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా..

## ఏపీలో విప్లవాత్మక సంస్కరణలు

- విద్యార్థులను భవిష్యత్ నైపుణ్యాలకు సిద్ధం చేసేందుకు లీప్ విధానం
- మెల్‌బోర్న్ ఎడ్యుకేషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

4

# పర్యటన దిగ్విజయం!



- ❑ ముగిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటన
- ❑ మూడోవరోజూ క్షణం తీరికలేకుండా భేటీలు, సమావేశాలు
- ❑ త్వరలో యూఏఈ -ఏపీ మధ్య సరికొత్త వాణిజ్య బంధం
- ❑ పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు వ్యూహాత్మక అడుగు
- ❑ సమర్థ వాగ్దాటితో ఏపీపై ఆశలు చిగురింపచేసిన ముఖ్యమంత్రి
- ❑ రాష్ట్రంలో అవకాశాలు పరిశీలించాలంటూ యూఏఈ మంత్రులకు ఆహ్వానం
- ❑ చివరిరోజూ పలు సంస్థల ప్రతినిధులను ఉత్సాహంగా కలిసిన సీఎం

- వివరాలు 2లో...



రహదారిపై..

## మహా విషాదం!

- బైక్ ఢీకొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం
- కర్నూలు సమీపంలో దుర్ఘటన
- 19 మంది ప్రయాణికుల సజీవ దహనం
- బైకర్‌తో కలిసి మొత్తం 20 మంది దుర్మరణం
- మృతుల్లో ఏపీకి చెందిన ఆరుగురు, తెలంగాణ వాసులు ఆరుగురు
- తమిళనాడు వాసులు ఇద్దరు, కర్ణాటకకు చెందిన మరో ఇద్దరు.. ఒడిశా, బీహార్ నుంచి ఒక్కొక్కరు

7

నిర్లక్ష్యమే కారణమైతే..

## కఠిన చర్యలు తప్పవు!

- ❑ టేకూరు వద్ద ట్రావెల్ బస్సు దగ్ధంపై సీఎం చంద్రబాబు
- ❑ ప్రమాద ఘటన వివరాలు తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతి
- ❑ దుబాయ్‌నుంచి మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ❑ తక్షణ సహాయక చర్యలకు హోంమంత్రి, డీజీపీలకు ఆదేశం
- ❑ సంఘటనా ప్రాంతంనుంచే నివేదిక ఇచ్చిన మంత్రి మండిపల్లి
- ❑ ఘోర దుర్ఘటనపై మంత్రులు.. తీవ్ర విచారం

8

బస్సు ప్రమాదంపై

## మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన మంత్రి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

5

## యువనేత లోకేష్ చొరవ

- కేవలం 6గంటల్లో బీమా సొమ్ము మంజూరు
- కర్నూలు బస్సు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త గొల్ల రమేష్ కుటుంబం దుర్మరణం
- ఆస్ట్రేలియా నుండి స్పందించిన మంత్రి లోకేష్

5

మృతుల కుటుంబాలకు

## రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం

- క్షతగాత్రులకు రూ.2 లక్షలు
- మంత్రి మండిపల్లి ప్రకటన


7

ప్రవాసాంధ్రులూ..

# పెట్టుబడులతో రండి

- ఏపీని అగ్రస్థానంలో నిలపడంలో బాధ్యత నిర్వర్తించండి
- జన్మభూమి-కర్మభూమి సిద్ధాంతాన్ని వదిలిపెట్టొద్దు..
- 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్'కు సహకరించాలి
- ఏపీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నాం..
- ప్రవాసాంధ్రులకూ బీమా పథకం వర్తింపు చేస్తున్నాం..
- దుబాయ్‌లో తెలుగు డయాస్పోరాలో సీఎం చంద్రబాబు పిలుపు
- ఉత్సాహభరితంగా సాగిన తెలుగు డయాస్పోరా
- పది గల్ఫ్ దేశాల నుంచి భారీగా హాజరైన ప్రవాసాంధ్రులు

3







2047 నాటికి

## గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఏపీ

- ❑ 16 నెలల్లోనే 117 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- ❑ భారీ పెట్టుబడులకు గేట్ వేగా విశాఖ
- ❑ 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు
- ❑ జనవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు
- ❑ అస్టెడ్ ఎగ్జిక్యూటివ్‌ల రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

4

## 13 నెలల నిరంతర శ్రమతో ఏపీకి గూగుల్



- 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే
- మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్
- వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ
- ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్
- మెల్‌బోర్న్‌లో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్
- విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

5

## ఉమ్మడి శిక్షణా శిబిరాలు నిర్వహించండి

- ◆ ఫ్రెండ్లీ మ్యాచ్‌లపై దృష్టి సారించండి
- ◆ క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్‌లకు మంత్రి లోకేష్ వినతి
- ◆ సానుకూలంగా స్పందించిన క్రికెట్ విక్టోరియా
- ◆ భారత్‌లో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడి

6

# పర్యటన దిగ్విజయం!

- ముగిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దుబాయ్ పర్యటన
- మూడోవరోజూ క్షణం తీరికలేకుండా భేటీలు, సమావేశాలు
- త్వరలో యూఏఈ -ఏపీ మధ్య సరికొత్త వాణిజ్య బంధం
- పెట్టుబడులను ఆకర్షించడంలో చంద్రబాబు వ్యూహాత్మక అడుగు
- సమర్థ వాగ్దాటితో ఏపీపై ఆశలు చిగురింపచేసిన ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో అవకాశాలు పరిశీలించాలంటూ యూఏఈ మంత్రులకు ఆహ్వానం
- చివరిరోజూ పలు సంస్థల ప్రతినిధులను ఉత్సాహంగా కలిసిన సీఎం



దుబాయ్ (చైతన్య రథం): యూఏఈలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటన ఆశావహంగా ముగిసింది. అటు ప్రభుత్వ ప్రతినిధులు, ఇటు వాణిజ్య సంస్థ అధిపతులతో వరుస సమావేశాలతో యూఏఈ-ఏపీ మధ్య సరికొత్త వాణిజ్య బంధానికి తెరతీశారు. రాష్ట్రంలో పెట్టుబడులకుగల అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. పర్యటన చివరిరోజు శుక్రవారం దుబాయ్‌లో ముఖ్యమంత్రి పలువురు యూఏఈ మంత్రులను, అక్కడ వాణిజ్య సంస్థల ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. ముందుగా యూఏఈ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో భేటీ అయ్యారు. యూఏఈ ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వాణిజ్య బంధాన్ని పెంపొందించే అంశంపైనా, లాజిస్టిక్స్, రవాణా, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడుల గురించి ఇరువురు నేతలు చర్చించారు. భారత్-యూఏఈ దేశాలు నాలెడ్జ్ ఎకానమీపై ప్రస్తుతం దృష్టి పెట్టినట్టుగానే, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పాలన, పౌరసేవలను మరింత మెరుగ్గా అందించే అంశంపై ఏపీకి సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. సాంకేతికంగా పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్టీజీఎస్ ద్వారా ఇచ్చిపుచ్చుకునే అంశంపై ఇరువురు అవగాహనకు వచ్చారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్- దుబాయ్ సిలికాన్ ఒయాసియా మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై రెండు ప్రభుత్వాలు ఒక అంగీకారానికి వచ్చాయి. ముఖ్యంగా ఆహార భద్రతకు సంబంధించి ఏపీతో కలిసి పనిచేసేందుకు యూఏఈ ఆర్థిక వ్యవహారాల మంత్రి ఆసక్తి కనబరిచారు.

## యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రితో భేటీ

యుఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ జియౌదితోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు పక్షాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారం అంశాలపై చర్చ జరిగింది. థానీ బిన్ అహ్మద్ భారతదేశం -యుఏఈల మధ్య ఉన్న దీర్ఘకాలిక స్నేహబంధాన్ని ప్రస్తావిస్తూ, రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, పెట్రో కెమికల్స్, రియల్ ఎస్టేట్‌వంటి రంగాల్లో భాగస్వామ్యంతో పాటు... ముఖ్యంగా అమరావతిలో పెట్టుబడులు పెట్టే అంశంపై థానీ ఆసక్తి చూపించారు. ఏపీలో పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని థానీ అన్నారు. త్వరలోనే రాష్ట్రాన్ని సందర్శిస్తామని చెప్పారు.



## రాష్ట్రంలో పెట్టుబడులకు ఆహ్వానం

దుబాయ్ వర్చువల్ అసెట్స్ రెగ్యులేటరీ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ దీపా రాజా కార్బన్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమై చర్చలు జరిపారు. డిజిటల్ ఎకానమీ, ఫిన్‌టెక్, బ్లాక్‌చైన్, వర్చువల్ అసెట్ రెగ్యులేషన్, క్రిప్టో, డిజిటల్ ట్రాన్సాక్షన్ సెక్యూరిటీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్-దుబాయ్ మధ్య భాగస్వామ్య అవకాశాలను ముఖ్యమంత్రి విశ్లేషించారు. ఏపీ ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌లో ముందంజలో ఉందని, ఫిన్‌టెక్ వాలీ విశాఖపట్నం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌వంటి ప్రాజెక్టులు డిజిటల్ ఇన్నోవేషన్‌కు కేంద్రాలుగా ఎదుగుతున్నాయని ముఖ్యమంత్రి వివరించారు. వర్చువల్ అసెట్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్, డిజిటల్ కరెన్సీ సేఫ్టీ నార్మ్స్, బ్లాక్‌చైన్ ఆధారిత ప్రభుత్వ సేవల అమలుకు సంయుక్తంగా పనిచేయాలని ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. దీనికి దీపా రాజా సుముఖత వ్యక్తం చేశారు. అలాగే, క్రౌన్ ఎల్ఎన్జీ సీఈఓ స్వపన్ కటారియాతోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఎల్ఎన్జీ, గ్రీన్‌ఎనర్జీ రంగాల్లో ఆంధ్రప్రదేశ్-క్రౌన్ ఎల్ఎన్జీ మధ్య భాగస్వామ్య అవకాశాలపై ఇరువురు మాట్లాడుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలిక పెట్టుబడి అవకాశాలను పరిశీలిస్తామని కటారియా చెప్పారు. మరోవైపు ట్రైస్టార్ గ్రూప్ సీఈఓ యూజిన్ మేయిన్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి లాజిస్టిక్స్, ఇంధన రవాణా, సప్లై చైన్ మేనేజ్‌మెంట్, గ్రీన్ ఫ్యూయెల్స్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకున్న అవకాశాలను వివరించారు. ఏపీ సుదీర్ఘ తీర ప్రాంతం కలిగి ఉందని... పోర్టులు, ఇండస్ట్రియల్ కారిడార్లు, లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి ఆస్కారం ఉందని తెలిపారు. ఆస్టర్ గ్రూప్ స్థాపకుడు డాక్టర్ అజాద్ మూపెన్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. సమావేశంలో ఆరోగ్య సేవల విస్తరణ, మెడికల్ ఎడ్యుకేషన్, టెలీ-హెల్త్, హెల్త్‌కేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్, మెడికల్ కాలేజీలు, హెల్త్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఏపీలో ఆస్టర్ గ్రూప్ పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయి మెడికల్ సదుపాయాలు స్థాపించాలని ఆహ్వానించారు. దీనికి అజాద్ మూపెన్ ఆసక్తి వ్యక్తం చేశారు. అపారెల్ గ్రూప్ సీఈఓ నీలేశ్ వేద్‌తోనూ ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. టెక్స్‌టైల్, గార్మెంట్ తయారీ, రిటైల్, ఫ్యాషన్ పరిశ్రమ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకుగల అవకాశాలను ముఖ్యమంత్రి తెలియజేశారు. దీనికి స్పందించిన నీలేశ్ వేద్ ఏపీలో అపారెల్ మాన్యుఫాక్చరింగ్, రిటైల్ ఎకోసిస్టమ్ అభివృద్ధి గురించి పరిశీలన చేస్తామని హామీ ఇచ్చారు.










# ప్రవాసాంధ్రులూ..

# పెట్టుబడులతో రండి

- ఏపీని అగ్రస్థానంలో నిలపడంలో బాధ్యత నిర్వర్తించండి
- జన్మభూమి-కర్మభూమి సిద్ధాంతాన్ని వదిలిపెట్టొద్దు..
- 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్'కు సహకరించాలి
- ఏపీలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నాం..
- ప్రవాసాంధ్రులకూ భీమా పథకం వర్తింపు చేస్తున్నాం..
- దుబాయ్‌లో తెలుగు డయాస్పోరాలో సీఎం చంద్రబాబు పిలుపు
- ఉత్సాహభరితంగా సాగిన తెలుగు డయాస్పోరా
- పది గల్ఫ్ దేశాలనుంచి భారీగా హాజరైన ప్రవాసాంధ్రులు



దుబాయ్ (చైతన్య రథం): వన్ ఫ్యామిలీ -వన్ ఎంట్రప్రెన్యూర్ నినాదాన్ని అందిపుచ్చుకుని ప్రతీ ప్రవాసాంధ్రుల కుటుంబంలో ఒక్కరు ఏపీలో పెట్టుబడి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. జన్మభూమి- కర్మభూమి సిద్ధాంతాన్ని అందిపుచ్చుకుని రెండుదేశాల అభివృద్ధికీ తోడ్పడాలని సూచించారు. శుక్రవారం దుబాయ్‌లోని లీమెరిడియన్ హోటల్‌లో నిర్వహించిన తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. పది గల్ఫ్ దేశాలనుంచి పెద్ద సంఖ్యలో తెలుగుప్రజలు హాజరయ్యారు. యుఏఈ సహా సౌదీ అరేబియా, కువైట్, ఓమన్, బహ్రెయిన్, ఖతార్ దేశాలనుంచి తెలుగు ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ... "తెలుగు జాతికి తిరుగే లేదు. ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్ 1గా తయారవుతుంది. ప్రపంచంలో ఎక్కడకి వెళ్లినా తెలుగు ప్రజలు ఉన్నతస్థాయిలో ఉండాలని ఆకాంక్షించాను. 30 ఏళ్ల ముందు ఐటీని ప్రోత్సహించాను. తెలుగువాళ్లు ఐటీ నిపుణులుగా ఇప్పుడు ప్రపంచమంతటా రాణిస్తున్నారు. సత్యనాదెళ్లలాంటి తెలుగు వాళ్లు మైక్రోసాఫ్ట్ కంపెనీకి ప్రస్తుతం సీఈఓగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో కూటమి కోసం ప్రవాసాంధ్రులంతా తపించి గెలిపించారు. గల్ఫ్‌లోని పది దేశాలనుంచి తరలివచ్చి తెలుగు డయాస్పోరాకు హాజరు కావటం ఆనందాన్ని కలిగిస్తోంది" అని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

## విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్

'అబుదాబీ, దుబాయ్‌లు ఆయిల్ ఎకానమీ నుంచి పర్యాటకం, నాలెడ్జ్ ఎకానమీ దిశగా నడుస్తున్నాయి. 1.5 లక్షల హోటల్ రూములతో ఆతిథ్యరంగానికి పెద్దఎత్తున ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది. ఏపీలోనూ పర్యాటకానికి ప్రోత్సాహం కల్పిస్తున్నాం. దేశంలో ఐటీలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు ఐటీని ప్రోత్సహిస్తే ఇప్పుడు ఏఐకి ప్రాధాన్యమిస్తున్నాం. వన్ గవర్నమెంట్ వన్ సిటిజన్ పేరిట డేటా లేక్ తీసుకువస్తున్నాం. దీని ద్వారానే సుపరిపాలన అందించేలా కార్యాచరణ చేస్తున్నాం. గతంలో హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకువస్తే.. ఇప్పుడు ఏపీలోని విశాఖకు గూగుల్ తీసుకువస్తున్నాం. గూగుల్ విశాఖలో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దేశంలో క్వాంటం వ్యాలీ ఉన్న ఏకైక ప్రాంతం కూడా ఆంధ్రప్రదేశ్ మాత్రమే"నని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు.

## ప్రవాసాంధ్రులకు భీమా పథకం

'ఏపీలో ప్రతీ ఇంటికీ ఒక పారిశ్రామికవేత్తను తయారుచేసి లక్ష్యాన్ని సాధిస్తాం. ఐటీ, కమ్యూనికేషన్ల రంగంలో విప్లవాత్మక మార్పులను అందిపుచ్చుకుంటున్నాం. సాంకేతికత ద్వారా పాలన అందించేలా వాట్సప్ ద్వారా 730కి పైగా పౌర సేవలు అందిస్తున్నాం.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు కాబోతోంది. త్వరలో ఇక్కడి నుంచే దుబాయ్‌కి అవసరమైన ఎయిర్ టాక్సీలు తయారు చేసే రోజు వస్తుంది. దుబాయ్‌లాంటి దేశాలు మన దేశంనుంచే బంగారంకొని, ఆభరణాలుగా చేసి మళ్లీ మనకే విక్రయిస్తున్నారు. ఈ తరహా నాణ్యమైన ఉత్పాదక ప్రక్రియల్ని మన పారిశ్రామికవేత్తలు చేపట్టాలి. హెల్తీ వెల్తీ హ్యాపీ ఏపీ విధానంతో స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నాను. ప్రవాసాంధ్రుల కోసం భీమా కార్యక్రమం ప్రారంభిస్తున్నాం. రూ.10 లక్షల వరకూ అందరికీ భీమా కల్పించేలా కార్యక్రమం చేపట్టాం. ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు 18-60 ఏళ్ల వరకూ వయస్సున్న ప్రవాసాంధ్ర ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులకు ఈ భీమా వర్తింపచేస్తున్నాం. ప్రవాసాంధ్రులు ఎదుర్కోనే న్యాయపరమైన ఇబ్బందులకు ఎన్నార్టీ సొసైటీ ద్వారా లీగల్ కౌన్సిలింగ్, డాక్యుమెంటేషన్, అడ్వకేట్ ఫీజులలాంటి సమస్యలు పరిష్కరిస్తాం. అలాగే ప్రసూతీ ఖర్చుల కింద రూ.35 వేలు, సిజేరియన్ ద్వారా రూ.50 వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తాం. ఏపీలో వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అని ఏపీలో పిలుపునిచ్చాం. ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో ఒకరు పరిశ్రమ పెట్టండి. దీనికోసం ఓ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. దుబాయ్‌లో ఇంత పెద్దఎత్తున తెలుగువారు తరలివచ్చి ఏ నాయకుడికీ దక్కని గౌరవాన్ని అందించిన ప్రవాసాంధ్రులకు ధన్యవాదాలు" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అనంతరం తెలుగు డయాస్పోరాకు హాజరైన వారు ఫోటోలు దిగేందుకు సీఎం సమయం ఇచ్చారు. కార్యక్రమానికి మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఏపీ ఎన్నార్టీ సొసైటీ ఛైర్మన్ వేమూరి రవి, దుబాయ్‌లో భారత కాన్సులేట్ జనరల్ సతీష్‌శివన్ తదితరులు హాజరయ్యారు.





## వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా..

# ఏపీలో విప్లవాత్మక సంస్కరణలు

- విద్యార్థులను భవిష్యత్ నైపుణ్యాలకు సిద్ధం చేసేందుకు లీప్ విధానం
- మెల్‌బోర్న్ ఎడ్యుకేషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్



మెల్‌బోర్న్/ఆస్ట్రేలియా (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో 2029 నాటికి ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థను తయారుచేయడమే లక్ష్యంగా పలు విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఆరో రోజు శుక్రవారం ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ కమిషన్ (ఆస్ట్రేడ్) ఆధ్వర్యాన మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో స్టడీ మెల్‌బోర్న్, విక్టోరియన్ ఎడ్యుకేషన్, స్కిల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేస్తున్నామని తెలిపారు. మేం అమలు చేస్తున్న లీప్ కార్యక్రమం విద్యారంగంలో కొత్త తరానికి మార్గదర్శకత్వం వహిస్తోంది. అంతర్జాతీయస్థాయి ఉత్తమ బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు.

### భవిష్యత్ నైపుణ్యాలు, డిజిటల్ ఎడ్యుకేషన్..

21వ శతాబ్దపు నైపుణ్యాలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే మా లక్ష్యం. సాంప్రదాయ విధానాలకు స్వస్తి చెబుతూ... ఆట ఆధారిత పాఠ్యాంశాలు, ఏఐ ఆధారిత పరిష్కారాలతో బోధనా శిక్షణ, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) వంటి వినూత్న కార్యక్రమాలను లీప్ ప్రోగ్రామ్‌లో అమలు చేస్తున్నాం. ఏఐ, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా విద్యార్థులను టెక్నికల్, లీడర్ షిప్, రియల్ లైఫ్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి ఫలితాల ఆధారిత విధానం అమలుకు శ్రీకారం చుట్టాం. కొత్త విధానంలో అంతర్భాగంగా ఎస్‌డీజీ 2020 లక్ష్యాలకు అనుగుణంగా సవరించిన పాఠ్యాంశాలు, భవిష్యత్ నైపుణ్యాలు, డిజిటల్ ఎడ్యుకేషన్ ద్వారా సమగ్ర అభ్యాసం ఉన్నాయని చెప్పారు. అన్ని స్థాయిల్లో నైతిక విలువలకు పెద్దపీట వేస్తూ ప్రత్యేకంగా పాఠ్యాంశాలు ప్రవేశపెట్టామని మంత్రి లోకేష్ తెలిపారు.

### అంతర్జాతీయ విద్యార్థులకు గమ్యస్థానంగా..

స్టడీ మెల్‌బోర్న్ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రతి ఏటా 170 దేశాల నుంచి 1.75 లక్షల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం విక్టోరియా వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చైనా, భారత్, వియత్నాం, నేపాల్ నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు వస్తున్నట్లు చెప్పారు. వీరిద్వారా విక్టోరియా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు 12.6 బిలియన్ డాలర్ల ఆదాయం లభిస్తుందన్నారు. ఆస్ట్రేలియాలో పోస్ట్ స్టడీ పని అవకాశాలను కోరుకునే విద్యార్థులకు విక్టోరియా గమ్యస్థానంగా ఉందని తెలిపారు. ఆవిష్కరణ, పరిశోధన, సృజనాత్మకతలకు పెద్దపీట వేస్తూ... విక్టోరియాలో చదువుతో పాటు స్కాలర్ షిప్‌లు, పని అవకాశాలు వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యార్థులకు విక్టోరియా నెం.1 గమ్యస్థానంగా ఉంది. హైక్వాలిటీ ఎడ్యుకేషన్, కల్చరల్ డైవర్సిటీ, ఉత్సాహభరితమైన జీవనశైలి తమ ప్రత్యేకతలని తెలిపారు. వరల్డ్ మోస్ట్ లివబుల్ సిటీల్లో మెల్ బోర్న్ నెం.1 ర్యాంకు సాధించిందని స్టడీ మెల్‌బోర్న్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెల్‌బోర్న్ యూనివర్సిటీ, మోనాష్ యూనివర్సిటీ, స్విన్ బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

---

# 2047 నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఏపీ





- 16 నెలల్లోనే 117 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- భారీ పెట్టుబడులకు గేట్ వేగా విశాఖ
- 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు
- జనవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు
- ఆస్ట్రేడ్ ఎగ్జిక్యూటివ్‌ల రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్



మెల్‌బోర్న్/ఆస్ట్రేలియా (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా మార్చడమే మా లక్ష్యం.. సాంకేతిక ఆవిష్కరణలు, సుస్థిరమైన సమగ్రాభివృద్ధి ద్వారా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే తమ సంకల్పమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఉద్ఘాటించారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఆరో రోజు శుక్రవారం మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ కమిషన్ (ఆస్ట్రేడ్) ఎగ్జిక్యూటివ్ లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ ప్రసంగించారు. ఈ సమావేశానికి ఆస్ట్రేడ్ అంతర్జాతీయ విద్య, వాణిజ్య సేవా నైపుణ్యం, డిజిటల్ డెలివరీ విభాగాధిపతి ఎలోడీ జర్నెట్ అధ్యక్షత వహించగా, లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా శరవేగంగా దూసుకుపోతోందన్నారు. గత 16 నెలల్లోనే 117 బిలియన్ డాలర్ల పెట్టుబడులుసాధించాం. సుదీర్ఘమైన పాలనానుభవం,సమర్థవంతమైన దార్శనిక నాయకుడి వల్లే ఇది సాధ్యమైంది. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, డీప్‌టెక్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, పోర్టులు, ఫార్మా, బయోటెక్నాలజీ, టూరిజం వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో విశేష పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని మంత్రి లోకేష్ వివరించారు.

### తూర్పు తీర సముద్ర రవాణాకు కీలకం

బలమైన విధాన వ్యవస్థ, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, మూడు ఆర్థిక కారిడార్లు, భవిష్యత్‌కు తగిన శ్రామిక శక్తి, క్వాంటం కంప్యూటింగ్, డీప్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వ్యాలీ వంటివి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్నాయి. అధునాతన సాంకేతికత, ఏఐ ఆధారిత గవర్నెన్స్ వేగవంతమైన అభివృద్ధికి దన్నుగా నిలుస్తున్నాయి. అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ 4.0తో పాటు 24 థీమెటిక్ పాలసీలను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఏఐ వంటి అధునాతన సాంకేతిక రంగంతోపాటు డ్రోన్లు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. 1053 కి.మీ.ల సువిశాల తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 6 ఆపరేషనల్ పోర్టుల ద్వారా ఏటా 193 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా అవుతోంది. వచ్చే ఏడాదికల్లా 350 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మరో 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ప్రారంభం కానున్నాయి. తూర్పు తీర సముద్ర కార్గో రవాణాలో 40శాతం ఏపీ నుంచే సాగుతోంది. ప్రస్తుతం 20 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులను 2047 నాటికి 450 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని మంత్రి లోకేష్ తెలిపారు.

### 2.4 ట్రిలియన్ డాలర్లకు ఏపీ ఆర్థిక వ్యవస్థ

విశాఖపట్నం ఐటీ, ఇన్నోవేషన్, డేటా హబ్‌గా తయారవుతోంది. విశాఖలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ హబ్ నిర్మించబోతోంది. అదేవిధంగా ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.35లక్షల కోట్లతో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతోంది. భారీ పెట్టుబడులకు విశాఖపట్నం గేట్ వేగా మారింది. విశాఖ మహానగరం 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధిస్తుంది. ఏపీ రాజధాని అమరావతిలో వచ్చే జనవరి నుంచి దక్షిణాసియాలోనే తొలి 156-క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ సేవలు ప్రారంభించబోతున్నాం. ఇది భారత సాంకేతికరంగంలో గేమ్ ఛేంజర్ కాబోతుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో స్టేట్ డేటా లేక్, అవేర్ హబ్, ఇంటెలిజెన్స్ లేయర్, డిజిటల్ గవర్నెన్స్ వంటివి అంతర్భాగాలుగా ఉంటాయి. ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ... 2047నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా ముందుకు సాగుతోంది. నవంబర్ 14-15 తేదీల్లో విశాఖపట్నంలో తాము ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న పార్టనర్ షిప్ సమ్మిట్ - 2025కు ఆస్ట్రేలియన్ పారిశ్రామికవేత్తలు హాజరై ఏపీలో పెట్టుబడి అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# 13 నెలల నిరంతర శ్రమతో ఏపీకి గూగుల్



- 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే
- మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్
- వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో దేశంలోనే రెండో స్థానంలో ఏపీ
- ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్
- మెల్‌బోర్న్‌లో సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్
- విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం

మెల్‌బోర్న్/ఆస్ట్రేలియా (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13నెలల నిరంతర శ్రమ దాగి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆరో రోజు శుక్రవారం..ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్(AIBC) ప్రతినిధులతో మెల్‌బోర్న్‌లోని గ్రాండ్ హయత్ హోటల్ ది రెసిడెన్సీ హాల్‌లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్‌కు తనను ఆహ్వానించినందుకు ఆస్ట్రేలియాప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. భారత దేశంలో మీ పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎందుకు పరిగణించాలో మూడు ప్రధాన కారణాలు చెబుతాను. ఏపీలో అనుభవం కలిగిన దార్శనిక నాయకత్వం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. పెద్ద ప్రాజెక్టులను రాష్ట్రానికి ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. దీనివల్ల దేశంతో పాటు ఏపీలో కూడా సాఫీగా పెట్టుబడులు పెట్టేందుకు మీకుసహకారం లభిస్తుంది. ఏపీలో 50శాతం మంది ఎమ్మెల్యేలు కొత్తగా ఎన్నిక య్యారు. 25మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు ఉన్నారు.రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు మేమంతా కసితోపనిచేస్తున్నామని మంత్రి లోకేష్ ఉద్ఘాటించారు.

## ఒప్పందం తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్

రెండో కారణం.. ఏపీ స్టార్టప్ స్టేట్. చేపట్టిన పనులు పూర్తిచేయాలనే దృఢ సంకల్పంతో ఉన్నాం. మీరు ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్ అవుతుంది. మొదటగా మేం ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేస్తాం. ఆయా ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారులు, నాయకులతో నిరంతరం ప్రాజెక్ట్ పురోగతిపై రోజువారీ పద్ధతిలో చర్చిస్తాం. ప్రాజెక్ట్ ఏ దశలో ఉందో, ఏం చేయాలో తెలుసుకుంటాం. ఉదాహరణకు ఆతిథ్య సేవల రంగంలో ఓ కంపెనీకి శుక్రవారం ఉదయం భూమి కేటాయింపు ప్రస్తుత పరిస్థితి, ఫైల్ ఎక్కడ ఉందో, క్లియరెన్స్ ఎప్పుడు వస్తుందో అన్న వివరాలు పంపించాం. ఇచ్చిన హామీని అమలుచేయడం మాకు చాలా ముఖ్యం. మీ ప్రాజెక్టును నిరంతరం ఫాలో అప్ చేస్తాం. మీరు నిర్దేశించిన సమయం కంటే వేగంగా పూర్తిచేయడమే మా లక్ష్యమని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

## 13 నెలల నిరంతర శ్రమతో..

ఏపీకి గూగుల్ డేటా హబ్ గురించి అందరూ వినే ఉంటారు. దాని వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉంది. ఆ సంస్థ నాయకత్వం మొదట వచ్చినప్పుడు నేను స్వయంగా వాళ్లను తీసుకెళ్లి ప్రాజెక్ట్ వచ్చే స్థలాన్ని చూపించాను. తర్వాత నేను వారి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి ఎందుకు ఏపీని ఎంచుకోవాలనే అంశంపై వారిని ఒప్పించాను. తర్వాత గూగుల్ నాయకత్వం వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబుని ఏపీలో కలిశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పులు చేయాలని వారు కోరారు. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మాట్లాడి అవసరమైన విధానపరమైన సవరణలు చేశాం. దీంతో గూగుల్ ప్రాజెక్ట్ రావటం మాత్రమే కాదు.. భారతదేశం గ్లోబల్ డేటా సెంటర్ హబ్‌గా ఎదిగేందుకు మార్గం సుగమమైంది. ఆ ప్రాజెక్ట్‌ను మేం 13 నెలల్లోనే పూర్తిచేశాం. మేం చెప్పిన సమయం కంటే ఒక నెల మాత్రమే ఆలస్యమైంది. నెల ఆలస్యంపై ఇప్పటికీ మేం బాధపడుతుంటాం. ఆదిత్య మిట్టల్, నాకు మధ్య ఒక్క జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఆర్సెలర్ మిట్టల్ ఏపీకి వచ్చింది. ఇందుకు కావాల్సిన అనుమతులపై ప్రధాని మోదీతో చర్చించి మార్గం సుగమం చేశాం. నవంబర్‌లో ఈ ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేయనున్నాం. 15 నెలల్లోనే ఈ ప్రాజెక్ట్ ఏపీకి వచ్చిందని మంత్రి లోకేష్ వివరించారు.

## ఇది ఆరంభం మాత్రమే

గత 16 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. దేశంలో సాఫ్ట్ ల్యాండింగ్‌కు మేం మీ వెంటే ఉంటాం. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో మీ ప్రతి ఆలోచన, ప్రాజెక్ట్‌కు మేం పూర్తి మద్దతు ఇస్తాం. మీ పెట్టుబడుల గమ్యస్థానంలో ఏపీని ఎందుకు ఎంచుకోవాలనేందుకు మూడో కారణం.. మాది జాతీయ దృక్పథం కలిగి ఉన్న ప్రాంతీయ పార్టీ. రెండు రాష్ట్రాల్లో ఉన్నాం. ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ దేశ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తాం. దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా మేం ఎప్పుడూ జాతీయ విధానాలపై సానుకూల ప్రభావం చూపాం. ఈ ప్రక్రియలో ఏపీకి కూడా ప్రయోజనం లభించింది. గతంలో కూడా చంద్రబాబునాయుడు టెలికాం, విమానయాన రంగం, డిజిటల్ చెల్లింపులు వంటి సంస్కరణల్లో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు డేటా సెంటర్ విధాన సంస్కరణల్లో కీలకపాత్ర పోషించారని మంత్రి లోకేష్ తెలిపారు.

## 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా ఏపీ

ప్రస్తుత ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో చేయాల్సిన విధానపరమైన మార్పులు గుర్తించి, వాటిని అమలుచేసే పనిలో ఉన్నాం. ఇందుకు ఉదాహరణ కార్మిక సంస్కరణలు. 9 సంస్కరణల్లో మార్పులు చేయాలని సూచించారు. 8 సంస్కరణలను 15 రోజుల్లోనే మేం పూర్తిచేశాం. మేం ప్రస్తుతం 180 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాం. దీనిని 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తీసుకెళ్తాం. మేం కేవలం ఒకటి, రెండు రంగాలపైనే దృష్టిపెట్టలేదు. 15 రంగాలపై దృష్టి కేంద్రీకరించాం. క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తాం. ఆటోమోటివ్, సిమెంట్, పునరుత్పాదక రంగం, ఎలక్ట్రానిక్స్, కంప్రెస్డ్ బయోగ్యాస్, ఫార్మా, స్టీల్, ఆక్వా, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. దేశంలో తయారవుతున్న ఏసీల్లో సగం ఏపీలోనే తయారవుతున్నాయి. దీనిని 70శాతానికి తీసుకెళ్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ చెప్పారు.

## దేశంలోనే రెండో స్థానంలో..

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది. ఈ పెట్టుబడుల ద్వారా త్వరలోనే నెం.1 అవుతాం. మేం కేవలం ఎంవోయూలు కుదుర్చుకోవడమే కాకుండా ప్రాజెక్టుల గ్రౌండింగ్ కోసం కృషిచేస్తున్నాం. విశాఖలో నవంబర్ 14,15 తేదీల్లో పార్టనర్ షిప్ సమ్మిట్ జరగబోతోంది. అదో అద్భుతమైన నగరం. పార్టనర్ షిప్ సమ్మిట్‌కు హాజరై పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించాలి. బెంగళూరు, గోవా నగరాల కలయిక విశాఖపట్నం. దేశంలోనే 9వ అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖ ఉంది. త్వరలోనే టాప్-3 లో నిలవనుంది. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని మంత్రి లోకేష్ విశ్వాసం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్(AIBC) నేషనల్ ఛైర్ దీపక్ రాజ్ గుప్తా, కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా(మెల్‌బోర్న్) డాక్టర్ సుశీల్ కుమార్, సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) డైరక్టర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.




### ఘోర బస్సు ప్రమాదంపై

# మంత్రి లోకేష్ దిగ్భ్రాంతి

- మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన మంత్రి
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

అమరావతి (చైతన్యరథం): కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బస్సు దగ్ధమై పలువురు ప్రయాణికులు మృతిచెందడం పట్ల విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగి పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అన్నారు. ప్రమాద ఘటన తరువాత ప్రభుత్వం అన్ని రకాల సహాయక చర్యలను చేపట్టిందన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# యువనేత లోకేష్ చొరవ

- కేవలం 6గంటల్లో బీమా సొమ్ము మంజూరు
- కర్నూలు బస్సు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త గోళ్ల రమేష్ కుటుంబం దుర్మరణం
- ఆస్ట్రేలియా నుండి స్పందించిన మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): కార్యకర్తలకు కష్టమొస్తే క్షణం ఆలోచించకుండా సాయమందించడం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ నైజం. కర్నూలు జిల్లా చినటేకూరు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన బస్సు దుర్ఘటనలో నెల్లూరుజిల్లా చాకలికొండకు చెందిన తెలుగుదేశం కార్యకర్త గోళ్ల రమేష్, ఆయన భార్య అనూష, వారి ఇద్దరు పిల్లలు కూడా దుర్మరణం పాలయ్యారు. పార్టీ యంత్రాంగం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, తీవ్ర ఆవేదన చెందిన యువనేత లోకేష్ తక్షణమే వారి కుటుంబానికి వెంటనే సాయం అందేలా చూడాలని ఆదేశించారు. లోకేష్ ఆదేశాలు అందుకున్న వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది రంగంలోకి దిగి ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో సంప్రదించారు. ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు కూడా మానవతా దృక్పథంతో వెనువెంటనే స్పందించారు. కేవలం ఆరుగంటల వ్యవధిలో క్లెయిమ్‌లను ప్రాసెస్ చేసి పరిష్కరించారు. మృతులు గోళ్ల రమేష్, అనూషల కుటుంబ సభ్యులకు చెరో 5లక్షల చొప్పున ఇన్సూరెన్స్ సొమ్ము మంజూరైంది. శని, ఆదివారాలు బ్యాంకు సెలవు దినాలు కావడంతో సోమవారం గోళ్ల రమేష్, అనూష కుటుంబాలకు ఇన్సూరెన్స్ సొమ్ము అందనుంది. యువనేత లోకేష్ చొరవతో తెలుగుదేశం పార్టీకి చెందిన కోటిమందికిపైగా కార్యకర్తలకు ఈ ఏడాది నుంచి రూ.5 లక్షల ప్రమాద బీమా చేయించిన విషయం తెలిసిందే. కార్యకర్తల సంక్షేమ నిధి సారథిగా మంత్రి లోకేష్ బాధ్యతలు చేపట్టాక ఇప్పటివరకు రూ.135 కోట్లు సాయం అందించారు.



# ఉమ్మడి శిక్షణా శిబిరాలు నిర్వహించండి

- ఫ్రెండ్లీ మ్యాచ్‌లపై దృష్టి సారించండి
- క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్‌లకు మంత్రి లోకేష్ వినతి
- సానుకూలంగా స్పందించిన క్రికెట్ విక్టోరియా
- భారత్‌లో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడి



మెల్‌బోర్న్/ఆస్ట్రేలియా (చైతన్యరథం): ఏపీలో ప్రతిభగల క్రికెట్ క్రీడాకారులను గుర్తించడానికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆధ్వర్యాన ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఆరోరోజు శుక్రవారం మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్‌లతో మంత్రి నారా లోకేష్ సమావేశమయ్యారు.

ఏపీ క్రీడాకారులను ఐపీఎల్ స్థాయికి తీసుకెళ్లడమే ఏపీఎల్ ముఖ్యోద్దేశమని తెలిపారు. ఐపీఎల్-2025 మెగా వేలంలో ఆంధ్రప్రదేశ్ (ఏపీఎల్) నుండి షేక్ రషీద్, త్రిపూర్ణ విజయ్, నితీష్ రెడ్డి, సత్యనారాయణ రాజు, పైలా అవినాష్ ఎంపికయ్యారు. వీరితో పాటు గతంలో ఏపీఎల్‌లో ఆడిన ఇతర ఆటగాళ్లను కూడా వివిధ ఐపీఎల్ ఫ్రాంచైజీలు తమ జట్టులో చేర్చుకున్నాయన్నారు.

ఆంధ్రప్రదేశ్/విక్టోరియాలలో క్రికెట్ క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంచేందుకు ఉమ్మడి శిక్షణా శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్‌లు నిర్వహించే అంశాన్ని పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ సౌకర్యాలు, ఈవెంట్ల నిర్వహణలో పర్యావరణ అను కూల పద్ధతులను ప్రోత్సహించాలి. మహిళా క్రికెట్ క్రీడాకారులకు అవకాశాలను విస్తరించే కార్యక్రమాల పై దృష్టి సారించాలనికోరారు. లైవ్ స్ట్రీమింగ్, సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అభిమానుల అనుభవాన్ని మెరుగుపర్చేందుకు చొరవచూపాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

### భారత్‌లో క్రికెట్ అకాడమీ

క్రికెట్ విక్టోరియా ప్రతినిధులు మాట్లాడుతూ... భారతదేశంలో జారీ చేయబోయే క్రికెట్ విద్య డిప్లొమాలు, డిగ్రీలపై తాము ఆసక్తిగా ఉన్నామన్నారు. భారత్‌లో క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. మహిళల క్రికెట్ అభివృద్ధికి మా వంతు సహకారం అందిస్తాం. విక్టోరియా రాష్ట్రంలో వివిధ స్థాయిల్లో క్రికెట్ క్రీడాకారులను ప్రోత్సహించడం, క్రీడాసౌకర్యాలను అభివృద్ధి చేయడం మా లక్ష్యం. విక్టోరియా పురుషుల జట్టు (విక్టోరియా బుష్‌రేంజర్స్), విక్టోరియన్ మహిళల జట్టు (విక్టోరియా స్పిరిట్)తో సహా విక్టోరియా ప్రొఫెషనల్ క్రికెట్ జట్లను క్రికెట్ విక్టోరియా పర్యవేక్షిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఔత్సాహిక క్రికెటర్ల ప్రోత్సాహానికి జూనియర్ క్రికెట్, స్కూల్ ఈవెంట్స్, కమ్యూనిటీ క్లబ్‌లకు మద్దతు ఇస్తున్నాం. అంతర్జాతీయంగా పేరొందిన మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ సహా రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ సౌకర్యాలను అభివృద్ధి చేస్తున్నాం. విక్టోరియా బుష్‌రేంజర్స్ షెఫీల్డ్ షీల్డ్ (ఫస్ట్-క్లాస్ క్రికెట్), మార్ష్ వన్-డే కప్ (దేశీయ వన్డే పోటీ)లో పోటీపడుతుడగా, విక్టోరియా స్పిరిట్ మహిళల జట్టు జాతీయ క్రికెట్ లీగ్ (డబ్ల్యూఎన్‌సీఎల్), మహిళల బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్)ల్లో తలపడుతున్నట్లు చెప్పారు.





# అబద్ధాలకు అగ్రజుడు.. జగన్!

జగన్‌రెడ్డి ఎన్ని అబద్ధాలు చెప్పినా, గూగుల్ డేటా సెంటర్‌తో విశాఖకు మహాయోగం పట్టిందన్నది నిజం. ఒకే ఒక్క పరిశ్రమతో విశాఖపట్నం దిశ, దశ మారనుంది. రాష్ట్ర ప్రగతిరథ గమనంలో ఇదొక కీలక ఘట్టం. గూగుల్ ఆసక్తి తెలుసుకుని.. కార్యరూపానికి తేవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ అపూర్వం. ఒక్కక్షణం ఆలస్యం చెయ్యకుండా గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు రప్పించడానికి శక్తినంతా ప్రయోగించారు చంద్రబాబు. సైబరాబాద్‌ను సృష్టించిన విధంగానే విశాఖ అభివృద్ధి ప్రదాతగా చంద్రబాబు పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోవడం ఖాయం!

మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికి ఏపీ.. ఏపీ ప్రజలపై ఏమాత్రం ప్రేమలేదు. ఆయన ప్రతిభ (పడగొట్టడం, విడగొట్టడం, చెడగొట్టడం) విధ్వంసక నైపుణ్యాలకే పరిమితం. అబద్ధాలు, అహంకారం, అరాచకత్వాలే ఆయన సహజాభరణాలుగా మిగిలాయి. అబద్ధాలాడటంతో ప్రపంచ నేతలకంటే ఆరాకులు ఎక్కువే చదివిన జగన్‌రెడ్డి.. ఇంట్లో కూర్చుని సొంత మురికి మీడియా మైకుల ముందు 'గూగుల్ డేటా సెంటర్‌ను తానే తెచ్చా'నని చెప్పుకోవడం చూస్తుంటే.. నక్కలు నీతి శతకాలు వల్లెవేస్తున్నట్టుంది! గత కొంతకాలంగా కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ఎంతటి నీచానికైనా దిగజారతాననే ప్రకటనలు, ప్రవర్తనతో చెప్పుకుంటూనే ఉన్నారు. తాజాగా -అదానీ గ్రూప్, కేంద్రం, వైసీపీ ప్రభుత్వం చూపిన చొరవ వల్లే ఇది సాధ్యమైందని మురికి మీడియా మైకులముందు పచ్చి అబద్ధాలు వల్లెవేయడం జగన్‌కే చెల్లింది.

### ఇవీ.. అసలు వాస్తవాలు

విశాఖ మహానగరంలో దాదాపు రూ.70 వేల కోట్ల పెట్టుబడితో డేటా పార్కు, సోలార్ పార్కుల ఏర్పాటుకు ముందుకొచ్చిన అదానీ గ్రూప్ సంస్థతో.. 2019 జనవరి 9న అప్పటి టీడీపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖలో 400 ఎకరాల విస్తీర్ణంలో గిగావాట్ డేటా సెంటర్‌మూడు కేంద్రాలతో ఏర్పాటు చేయాలని, ఐదు గిగావాట్స్ సామర్థ్యంతో సోలార్ పార్క్‌ను నెలకొల్పాలని నిర్ణయించారు. ఒప్పందం జరిగిన 35రోజుల వ్యవధిలోనే విశాఖలోని కాపులుప్పాడలో అదానీ డేటా సెంటరుకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అప్పటి తెదేపా ప్రభుత్వం విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు, అవ సరమైన పునరుత్పాతక విద్యుత్ ప్రాజెక్టులు నెల కొల్పేందుకు మూడుచోట్ల 400ఎకరాలు కేటాయించింది. ఈ డేటా సెంటర్‌ను ప్రపంచానికే తలమానికగా తీర్చిదిద్దాలన్నది అప్పటి ప్రభుత్వం సంకల్పం. ఇందుకు విరుద్ధంగా.. జగన్‌రెడ్డి 2019లో అధికారంలోకి రాగానే.. కొర్రీలతో గూగుల్‌ని నిలిపివేసిన పెద్దమనిషి.. నేడు విశాఖకు డేటా సెంటర్ రావడానికి తానే కారణమైనట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటు. రాష్ట్రానికి ఎంతో ఉపయుక్తమైన ప్రాజెక్టుపై నిర్లక్ష్యం వహించిన జగన్‌రెడ్డే.. ప్రాజెక్టు సాధించామన్న క్రెడిట్ ముఖ్యమంత్రి చంద్రబాబు కొట్టేస్తున్నారంటూ బుకాయించడం విడ్డూరం!

కూటమి ప్రభుత్వం, కేంద్రం సహకారంతో గూగుల్‌వంటి ప్రపంచ ఐటీ దిగ్గజాన్ని విశాఖలో రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో సాధిస్తే.. దానిని తక్కువ చేసి మాట్లాడటం జగన్ తెంపరితనానికి పరాకాష్ట. ప్రపంచం మొత్తం చంద్రబాబు ప్రభుత్వా సామర్థ్యాన్ని వేనోళ్ల పొగుడుతుంటే.. డేటా సెంటర్‌పై పచ్చి అబద్ధాలను పచారం చేస్తుండటాన్ని -జగన్ విజ్ఞతకే వదిలేయాలి. జగన్ హయాంలో అదానీ సంస్థను దారికి తెచ్చుకునేందుకు ప్రాజెక్టుపై సమీక్షల పేరిట ఆలస్యం చేశారు. దీర్ఘకాలిక ప్రణాళికలు తమకువద్దని.. మూడేళ్లలో ఏంచేస్తారో చెప్పాలంటూ మోకాలు అడ్డుపెట్టిందీ జగనే. పాత ఒప్పందం రద్దు చేస్తున్నామని, కొత్త ప్రతిపాదనతో రావాలనడంతో.. ప్రాజెక్టు పరిధిని అదానీ సంస్థ పరిమితం చేసేసింది. అలా, 2023లో అదానీ డేటా సెంటర్‌కు జగన్ మళ్లీ శంకుస్థాపన చేసినా ముందుకు సాగలేదు. తనకు ఏమాత్రం సంబంధంలేని గూగుల్ డేటా సెంటర్‌లో క్రెడిట్ వాటా ఇవ్వాలని కోరుకోవడం -జగన్ నీతిమాలిన రాజకీయాలకు పరాకాష్ట!!

కూటమి అధికారంలోకి వచ్చాక.. పెట్టుబడుల ఆకర్షణకు ప్రభుత్వం అనుసరిస్తున్న ఫ్రెండ్లీ విధానాలు నచ్చే.. విశాఖలో పెట్టుబడులకు గూగుల్ సంస్థ ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఇప్పుడున్న పన్ను విధానాలను మార్చి, భవిష్యత్‌లో పెంచితే ఎలాగని డైలమాలోవున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ప్రధానిని కలిసి సమస్య వివరించారు. పన్ను విధానం లో మార్పు ఉండదని, భవిష్యత్‌లో పెంచబోమని మోదీ హామీ ఇచ్చాకే.. గూగుల్‌ని ఆహ్వానించారు. పన్ను పెంచబోమన్న ప్రధాని హామీతో గూగుల్‌కి భరోసా దక్కింది. ఏపీకి గూగుల్ డేటా సెంటర్‌ను తీసుకురావడానికి ప్రభుత్వం 13 నెలలుగా పడిన శ్రమకు ప్రతిఫలమే గూగుల్. విశాఖలో గూగుల్ ఏర్పాటుకు ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది మొదలు... జగన్ ముఠా సోషల్ మీడియాలో ఇష్టాను సారం విషప్రచారం కావించింది. ప్రాజెక్టుతో పర్యావరణానికి ముప్పు అంది. ఆశించినన్ని ఉద్యోగాలు రావంది. జగన్ ఎంతగా దిగజారుతున్నారంటే.. మునుపటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలు, వచ్చిన పెట్టుబడులు, ఏర్పాటైన పరిశ్రమల్లోనూ క్రెడిట్ కొట్టేయాలన్నది జగన్ వ్యూహంగా కనిపిస్తోంది.

గూగుల్ డేటా సెంటర్‌పై -జగన్ మోచేతి నీళు ్లతాగే కుహనా మేధావులు బురదజల్లే ప్రయత్నాలు గట్టిగానే చేశారు. కూటమి ప్రభుత్వం సాధిస్తోన్న భారీ ప్రాజెక్టుల పరపతి.. తమకు రాజకీయ ఉనికి లేకుండా చేస్తుందనీ భయపడ్డారు. అందులో భాగమే -వైసీపీ సాగిస్తోన్న విష ప్రచారం.జగన్ ముఠా దుష్ప్రచారాన్ని జనం నమ్మలేదు. సరికదా.. జగన్‌రెడ్డిని ఛీకొట్టే పరిస్థితి రావడంతో డేటా సెంటర్‌తో భవిష్యత్‌లో మార్పు రావొచ్చంటూ నాల్క మడతపెట్టారు. భోగాపురం ఎయిర్ పోర్టును కూడాతానే తెచ్చినట్టుగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేసుకోవడం.. జగన్ మార్క్ రోత రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం.

- నీరుకొండ ప్రసాద్

# రహదారిపై.. మహా విషాదం!






- బైక్ ఢీకొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం
- కర్నూలు సమీపంలో దుర్ఘటన
- 19 మంది ప్రయాణికుల సజీవ దహనం
- బైకర్‌తో కలిసి మొత్తం 20 మంది దుర్మరణం
- మృతుల్లో ఏపీకి చెందిన ఆరుగురు, తెలంగాణ వాసులు ఆరుగురు
- తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున.. ఒడిశా, బీహార్ నుంచి ఒక్కొక్కరు

కర్నూలు (చైతన్యరథం): జాతీయ రహదారిపై మాటలకు అందని మహా విషాదం చోటు చేసుకుంది. కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగి 19 మంది సజీవ దహనమయ్యారు. బైకును బస్సు బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బైకు నడుపుతున్న వ్యక్తితో కలిపి ప్రమాదంలో మొత్తం 20 మంది ప్రాణాలు కోల్పోయారు. సజీవ దహనమైన బస్సు ప్రయాణికుల్లో ఏపీ, తెలంగాణ నుంచి ఆరుగురు చొప్పున,ఒడిశా, బీహార్ నుంచి ఒక్కొక్కరు, తమిళనాడు, కర్ణాటక నుంచి ఇద్దరు చొప్పున ఉన్నారు. మరొకరి మృతదేహం గుర్తించాల్సి ఉంది. కర్నూలు శివారు చిన్నటేకూరులో జాతీయ రహదారి 44పై శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఈఘటన జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లు, 41మంది ప్రయాణికులు కలిపి మొత్తం 43మంది ఉన్నారు. వీరిలో 19 మంది సజీవ దహనం కాగా.. 22 మంది గాయాలతో బయటపడ్డారు. డ్రైవర్లలో ఒకరు పరారవగా.. మరొకరు పోలీసుల అదుపులో ఉన్నారు.

బస్సు ఢీకొన్న తర్వాత ద్విచక్రవాహనదారుడు కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. బైక్ మాత్రం బస్సు కిందకు చొచ్చుకుపోయింది. ఆ సమయంలో బైక్‌లోని పెట్రోల్ లీక్ అవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో గాఢ నిద్రలోఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడి లేచి హాహాకారాలు చేస్తూ కొందరు బయటపడగా, పలువురు మంటల్లోనే చిక్కుకున్నారు.

ప్రమాదసమయంలో జాతీయరహదారిపై ప్రయాణిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా హిందూపూర్‌కు చెందిన నవీన్ బస్సు ప్రమాదంలో గాయపడ్డ ఆరుగురిని తన కారులో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హైమా రెడ్డి బస్సులో మంటలు చెలరేగడాన్ని చూసి ఆగి, పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే వారు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

## తక్షణ సహాయక చర్యలు

బస్సు ప్రమాద బాదితులను ఆదుకునేందుకు కర్నూలు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద బాదితులను ఆదుకునేందుకు పలు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08518-277305, కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంట్రోల్ రూమ్ 9121101059, ఘటనాస్థలి కంట్రోల్ రూమ్ 9121101061, కర్నూలు పోలీస్ ఆఫీసు కంట్రోల్ రూమ్ 9121101075గా ప్రకటించడం జరిగిందన్నారు. అదనంగా, ఆస్పత్రి హెల్ప్‌డెస్క్ నంబర్లు 9494609814 మరియు 9052951010 ద్వారా కూడా బాధితుల కుటుంబాలు సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లా వింజమూరు మండలం గొల్లవారిపల్లిలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. గోళ్ల రమేష్ సహా నలుగురు కుటుంబ సభ్యులు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ ప్రమాదంలో గోళ్ల రమేష్ 35), ఆయన భార్య అనూష (30), కుమార్తె మన్విత (10), కుమారుడు మనీష్ (12) మృతి చెందారు. బంధువులు ఘటనా స్థలికి చేరుకున్నారు.

## రావులపాలెం వాసి మృతి

కర్నూలులో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం పట్టణానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి (39) ప్రాణాలు కోల్పోయారు. రావులపాలెం మండలం ఊబలంకకు చెందిన శ్రీనివాస్‌కు క్రేన్లు ఉన్నాయి. బస్సులో శ్రీనివాస్ పక్కనే కూర్చున్న స్నేహితుడు పంకజ్ (ఉత్తర్ ప్రదేశ్) కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. మరోవైపు బస్సు ప్రమాదం నుంచి తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన మల్లిడి గంగాధర రామారెడ్డి ప్రాణాలతో బయటపడ్డారు.

## హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లిన మంత్రి మండిపల్లి

బస్సు ఘోర ప్రమాద ఘటనపై వెంటనే స్పందించిన రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేసిన ఆయన, ఈ ఘటన హృదయ విదారకమని పేర్కొన్నారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని రవాణా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాలుగా భద్రతా ప్రమాణాలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి వెంట రాష్ట్ర హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఉన్నతాధికారులు కూడా ఉన్నారు.

## సీటింగ్‌కు అనుమతి.. స్లీపర్‌గా మార్పు

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో 19 మందిని విగత జీవులుగా చేసిన వేమూరి కావేరి ట్రావెల్స్ అక్రమ బాగోతం వెల్లడయింది. ఆ సంస్థ నిర్వహించిన ఈ బస్సు సీటింగ్ క్యారియరే కానీ స్లీపర్ సర్వీస్ కాదని బయటపడింది. వేమూరి కావేరి ట్రావెల్స్ పేరిట హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖపట్నం రూట్లలో టూరిస్టు పర్మిషన్లతో పర్యాటక ప్రాంతాలకు బస్సులను తిప్పే సంస్థగా నమోదైంది. తెలంగాణకు చెందిన హెబ్రాన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ బస్సును 2018లో కొనుగోలు చేసి 2023 వరకు నిర్వహించింది. ఆ తర్వాత వేమూరి వినోద్ కమార్ ఈ బస్సును కొనుగోలు చేసి ఎన్వోసీ తీసుకుని కేంద్ర పాలిత ప్రాంతమైన డయ్యూ డామన్‌లో తిరిగి రిజిస్ట్రేషన్ చేయించారు. ఇక్కడే వేమూరి కావేరి సంస్థ అక్రమానికి తెరలేపింది. తెలుగు రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేస్తే అధికారులు కొంత కఠినంగా ఉంటారన్న అంచనాతో డయ్యూ డామన్లో చేశారు. వాస్తవానికి ఈ సంస్థ ప్రధాన కార్యాలయం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఉంది. డయ్యూ డామన్లో ఆల్ ఇండియా పర్మిట్ తీసుకున్న కావేరి ట్రావెల్స్.. ఒడిశాలోని రాయగడలో ఆల్టరేషన్, ఫిట్నెస్ చేయించుకున్నారు.

రాయగడ అధికారులు ఆల్టరేషన్, ఫిట్‌నెస్ మంజూరు చేసేటప్పుడు బస్సు సామర్థ్యం, సీటింగ్ వివరాలను స్పష్టంగా పొందుపరిచారు. ప్రమాదానికి గురైన బస్సుకు కేవలం 43 సీట్ల సీటింగ్ పర్మిషన్ మాత్రమే ఇచ్చారు. కానీ కావేరి ట్రావెల్స్ సంస్థ బస్సును స్లీపర్ క్యారియర్‌గా మార్చింది. ఇలా మార్చడం బస్సు సామర్థ్యాన్ని అధిగమించడమే. డయ్యూ డామన్ లో సీటింగ్ సామర్థ్యం ఉన్న బస్సుకు రవాణా పన్ను ఒక్క సీటుకు రూ.450 మాత్రమే. అదే స్లీపర్ సీటు అయితే రూ.800 అవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చార్జీలు చాలా ఎక్కువ. తెలుగు రాష్ట్రాల్లో ఒక్క సీటుకు రూ.4500 పన్ను చెల్లించాలి. అదే స్లీపర్ సీటుకు అయితే రూ.12వేల చొప్పున ప్రభుత్వానికి ట్యాక్స్ చెల్లించాలి. ఇలా ట్యాక్స్‌లను ఎగవేసేందుకే వేమూరి కావేరి ట్రావెల్స్ సంస్థ అక్రమ రిజిస్ట్రేషన్, ఆల్టరేషన్ చేయించింది.

## మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం

### క్షతగాత్రులకు రూ.2 లక్షలు - మంత్రి మండిపల్లి ప్రకటన

కర్నూలు (చైతన్యరథం): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తిస్థాయి సహాయం అందించనున్నట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. హోంమంత్రి వంగలపూడి అనిత, రాయలసీమ ఐ జి కోయ ప్రవీణ్‌తో కలిసి మంత్రి రాంప్రసాద్ రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. మూడు రాష్ట్రాల మంత్రులతో మాట్లాడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం కోసం రెండు లక్షల రూపాయలు అలాగే మరణించిన కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయినట్లు -ఏపీ హోం మంత్రి అనిత వెల్లడించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు తెలిపారు. బస్సులో 39 మంది పెద్దవాళ్లు, నలుగురు చిన్నారులతోపాటు గుర్తు తెలియని మరో వ్యక్తి ఉన్నట్లు చెప్పారు. ప్రమాదం నుంచి ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది బయటపడ్డారు. స్వల్ప గాయాలతో ఆస్పత్రుల్లో 12 మంది చికిత్స పొందుతున్నారని వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హోం మంత్రి వెల్లడించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కాలిపోయాయన్నారు. చనిపోయిన వ్యక్తుల డీఎన్‌ఏ ఆధారంగా వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేస్తామన్నారు. ఈ ప్రమాదంపై 16 బృందాలతో అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. డీఎన్‌ఏ పరీక్షల కోసం 10 ప్రత్యేక బృందాలు పని చేస్తాయన్నారు. ప్రమాదానికి కారణాలు అన్వేషించేందుకు మరో 4 బృందాలు, రసాయన విశ్లేషణ కోసం 2 బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

## క్షతగాత్రులకు పరామర్శ

కర్నూలు జిల్లా చిన్నిటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని హోంమంత్రి అనిత, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వారిని మంత్రులు పరామర్శించి వారి పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.



# నిర్లక్ష్యమే కారణమైతే.. కఠిన చర్యలు తప్పవు!

- టేకూరువద్ద ట్రావెల్ బస్సు దగ్ధంపై సీఎం చంద్రబాబు
- ప్రమాద ఘటన వివరాలు తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతి
- దుబాయ్‌నుంచి మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- తక్షణ సహాయక చర్యలకు హోంమంత్రి, డీజీపీలకు ఆదేశం
- సంఘటనా ప్రాంతంనుంచే నివేదిక ఇచ్చిన మంత్రి మండిపల్లి
- ఘోర దుర్ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి.. తీవ్ర విచారం



అమరావతి(చైతన్య రథం): కర్నూలులో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం కావడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. హైదరాబాద్‌నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు శుక్రవారంతెల్లవారుజామున కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ఘోర అగ్ని ప్రమాదానికి గురైంది. ఘటనలో పలువురు మరణించారు. మరికొంతమంది తీవ్రగాయాలపాల య్యారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.కర్నూలు బస్సు ప్రమాద ఘటన నేపథ్యంలో.. ఇతర రాష్ట్రాల రవాణా మంత్రు లు, అధికారులతో సమగ్ర విచారణకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. దుబాయ్ పర్యటనలో ఉన్న చంద్రబాబు.. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ప్రైవేటు బస్సుల ఫిటెనెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో బస్సుల సాంకేతిక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రమాదానికి నిర్లక్ష్యమే కారణమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సు రిజిస్ట్రేషన్, ఫిట్నెస్, పర్మిట్ వివరాలపై పూర్తి నివేదికను కోరారు. హెూంమంత్రి, రవాణా మంత్రి, సీఎస్, డీజీపీ, స్థానిక డీఐజీ, జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులు మరియు బాధిత కుటుంబాలకు అవసరమైన సాయం అందించాలని, మృతుల సంఖ్య పెరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. గాయపడిన వారికి అత్యు త్తమ వైద్యం అందించాలని, మృతదేహాలను గుర్తించి కుటుంబాలకు అప్పగించాలని సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంతోపాటు, ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించా లంటూ సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## హుటాహుటిన ఘటనా స్థలానికి రవాణా మంత్రి

ఘోర ప్రమాద ఘటనపై వెంటనే స్పందించిన రవాణా మంత్రి మండిలపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేసిన ఆయన, ఘటన హృదయ విదారకమన్నారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని రవాణా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాలుగా భద్రతా ప్రమాణాలుండేలా చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారన్నారు. మృతుల వివరాలు త్వరగా గుర్తించి.. కుటుంబా లకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని సూచించారన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యశాఖకు సూచనలు జారీ చేశారన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలు కఠినంగా నిర్వహించాలని, అన్ని జిల్లాల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖను ఆదేశించారు. ప్రమాదానికి నిర్లక్ష్యం కారణమై ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యతని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల ప్రాణ భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని పేర్కొన్నారు.

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ: అనిత

హెూం మరియు విపత్తుల మంత్రి వంగలపూడి అనిత కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు దగ్ధమైన ఘటనలో పలువురు మృతి చెంద డంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రుల కు తక్షణ వైద్య సాయం అందించాలని ఉన్నతాధి కారులను ఆదేశించారు. ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న హెూం మంత్రి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన అచ్చెన్న

బస్సు ఘోర అగ్నిప్రమాదంపై వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనలో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని, గాయపడిన



వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులు ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ.. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించే విధంగా తగు భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో రవాణా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు.

## తీవ్ర విచార వ్యక్తం చేసిన జనార్ధన్ రెడ్డి

కర్నూలు జిల్లాలో బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటనపై దుబాయ్ పర్యటనలోనున్న రహదారులు భవనాల మంత్రి బిసి జనార్ధన రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దుబాయ్‌నుంచే జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తక్షణ మరియు



మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైతే వారిని హైదరాబాద్‌కు తరలించాలని మంత్రి ఆదేశించారు. అనేక మంది ప్రయాణికులు సజీవ దహనమైన వార్త తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ, ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## కర్నూలు వైద్యులకు ఆదేశాలిచ్చిన సత్యకుమార్


బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన వైద్య మంత్రి సత్యకుమార్.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వాస్పత్రి సూపర్నెంట్‌ను ఆదేశించారు. బస్సులోనే భౌతిక అవశేషాలున్నందున, అవసరమైతే ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని



ఆదేశించారు. ఫోరెన్సిక్ వైద్యులను ఘటన స్థలానికి పంపించి, మృతులను గుర్తించేందుకు డీఎన్‌ఏ నమూనాలు సేకరించాలని మంత్రి సూచించారు. మృతదేహాల తరలింపుకు మహాప్రస్థానం వాహనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రమాదంలో స్వల్పగాయాలతో 12మంది ఆసుపత్రిలో చేరగా, ప్రాథమిక చికిత్స అనంతరం వారిలో ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారని, ఒకరి పరిస్థితి నిలకడగానే ఉందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

## పూర్తిస్థాయి విచారణ జరపాలన్న మంత్రి ఫరూక్

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం ఘటనపై తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేసిన న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. బస్సు ప్రమాదంలో ప్రయాణికులు సజీవదహనం కావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న మంత్రి.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రమాదంనుంచి బయటపడ్డ ప్రయాణికులకు అవసరమైన వైద్య సేవలు తక్షణం అందించాలని కర్నూలు జిల్లా అధికారులను ఆదేశించారు. కర్నూలులో ప్రయివేట్ బస్సు ఘోర ఘటనపై పరిశ్రమల



మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుబాయ్ పర్యటనలో ఉన్నప్పటికీ, ప్రమాద విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ఘటనలో పలువురు దుర్మరణం పాలయ్యారన్న సమాచారంతో మంత్రి చలించిపోయారు. ఘోర ఘటనపై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ మంత్రి అనగాని సత్యప్రసాద్ కర్నూలు బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 20మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందజేయాలని అధికారులకు సూచించారు.

## తక్షణ సహాయక చర్యలు చేపట్టిన కర్నూలు యంత్రాంగం

చిన్నటేకూరు వద్ద సంభవించిన బస్సు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కర్నూలు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలకు ఉపక్రమించింది. ప్రమాద స్థలంలో పరిస్థితిని సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఏ సిరి.. తక్షణ చర్యలకు ఉపక్రమించారు. హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న కావేరి బస్సులో సుమారు 41మంది ప్రయాణికులున్నా రని, తెల్లవారుజామున 3 గంటల సమయంలో బస్సు బైక్‌ను ఢీకొనడంవల్ల ఇంధనం లీకై ప్రమాదం సంభవించినట్టు ప్రాథమిక నివేదికలో వెల్లడైందన్నారు. ఘటనలో 21మంది సురక్షితంగా ఉన్నారని, మిగిలిన 20మందిలో 11మంది మృతదేహాలను గుర్తించగా, మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు పలు కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08518-277305, కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంట్రోల్‌రూమ్ 9121101059, ఘటనాస్థలి కంట్రోల్ రూమ్ 9121101061, కర్నూలు పోలీస్ ఆఫీసు కంట్రోల్ రూమ్ 9121101075గా ప్రకటించారు. అదనంగా, ఆస్పత్రి హెల్ప్‌డెస్క్ నంబర్లు 9494609814 మరియు 9052951010 ద్వారా కూడా బాధితుల కుటుంబాలు సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

చైతన్యరథం

# తుపానుపై ప్రభుత్వం అప్రమత్తం

- విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హెూంమంత్రి అనిత సమీక్ష
- నేడు, రేపు భారీ.. సోమ, మంగళవారాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయన్న అధికారులు
- ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి
- ప్రాణ నష్టం జరగకుండా చూడాలని మంత్రి ఆదేశం



అమరావతి (చైతన్యరథం): బంగాళాఖాతంలో అల్పపీడనం తుపానుగా బలపడనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమయింది. తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలని అలెర్ట్ చేయాలని అధికారులను హెూంమంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్, ఈడీ దీపక్, ఇతర హెూంమంత్రి అనిత శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అల్పపీడనం నైరుతి, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో సోమవారానికి తుపానుగా బలపడుతుందని ప్రఖర్ జైన్ తెలిపారు. రాష్ట్రానికి శని, ఆదివారాల్లో భారీ, సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్ష సూచన ఉందని వివరించారు. దీనిపై హెూంమంత్రి అనిత స్పందిస్తూ పటిష్టమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చూడాలన్నారు. తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు, ప్రజలకు తెలియజేయాలి. సహాయక చర్యలకు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను పంపించండి. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం మరింత అలెర్ట్‌గా ఉండాలి. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి 24/7 కొనసాగించాలి. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళల్లో ఉండే వారిని గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. అవసరమైతే ప్రజలను సహాయక శిబిరాలకు తరలించడానికి సిద్ధంగా ఉండాలి. ఎక్కడిక్కడ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి మంచి ఆహారం అందించాలి. విరిగిన చెట్లు తొలగించడం, విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ పనులు సత్వరమే జరిగేలా ఉండాలి. సోషల్ మీడియాలోని వదంతులు నమ్మవద్దని ప్రజలకు తెలియజెప్పాలి. ప్రజలకు ఏ అవసరం వచ్చినా విపత్తుల సంస్థ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలి. బలమైన ఈదురుగాలుల వీచేప్పుడు చెట్లు, హెూర్డింగ్స్ వద్ద ఉండవద్దు. భారీవర్షాలు కురుస్తున్నపుడు వీలైనంత వరకు ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని హెూంమంత్రి అనిత సూచించారు.

### భారీ వర్షసూచన

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. శనివారినికి ఆగ్నేయ, దాని పక్కనే ఉన్న మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, ఆదివారం నాటికి తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందుతుందని పేర్కొన్నారు. ఇది సోమవారం ఉదయానికి నైరుతి, దానికి పక్కనే ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు.

దీని ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో శనివారం భారీ వర్షాలు, ఆదివారం భారీ నుంచి అతి భారీవర్షాలు, సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 50-70 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతప్రజలు అలెర్ట్‌గా ఉండాలన్నారు. రానున్న మూడు రోజులు వాతావరణం క్రింది విధంగా ఉండనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ప్రఖర్ జైన్ వివరించారు.

**శనివారం:** కోనసీమ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**ఆదివారం:** గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు.. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు, కడప, అన్నమయ్య, చిత్తూరు అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**సోమవారం:** కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

# మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు

- ఎలక్ట్రిషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం
- నవంబర్ 2 తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- నెలకు రూ.2.60 లక్షలుపైబడి జీతం
- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని మైనారిటీ యువతకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జర్మనీ దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఏపీ ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డిసి), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓఎంసిఏపి), ఐఈఎస్ ల సహకారంతో, జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. రెండు సంవత్సరాల ఐటిఐ, మూడు సంవత్సరాల ఎలక్ట్రిషియన్ ట్రేడ్ విద్యార్హతతో ఉత్తీర్ణత సాధించిన వారు జర్మనీ ఉద్యోగాలకు అర్హులన్నారు. వయో పరిమితి గరిష్టంగా 30 సంవత్సరాలు లోపు ఉన్నవారు, కనీసం రెండేళ్ల సంబంధిత ఎలక్ట్రిషియన్ పనుల్లో అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

***నెలకు 2.60 లక్షలు పైబడిన జీతంతో ఉద్యోగాలు***

జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీగా జీతం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. నెలకు 2,600 నుండి 2,700 యూరోలు ( భారత కరెన్సీలో రూ. 2.60 లక్షల నుండి రూ.2.70 లక్షలు) జీతం పొందవచ్చునన్నారు. రెండేళ్ల ఒప్పందం మేరకు జర్మనీలో ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు ఉందని తెలిపారు. ఒప్పందం ప్రకారం అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. జర్మనీలో అవసరమయ్యే అక్కడి స్థానిక గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని, వసతి, రాక (ఆరైవల్) సహాయాన్ని అక్కడ యజమాని అందిస్తారని తెలిపారు. జర్మనీలో 6 నెలల ప్రొబేషన్ కాలం పూర్తయిన తర్వాత 1000 యూరోలు తిరిగి చెల్లిస్తారన్నారు.

***నవంబర్ నుండి జర్మన్ భాష పై శిక్షణ***

జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులకు జర్మన్ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు మంత్రి ఫరూక్ తెలిపారు. దాదాపు 12 లేదా 14 వారాల పాటు జర్మన్ భాష లోని ఏ-1,ఏ-2 స్థాయిల వరకు క్లాస్ రూమ్ శిక్షణను తాత్కాలికంగా రాజమండ్రి లో ఏర్పాటు చేసి రోజుకి 8 గంటలపాటు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు ఖర్చును అభ్యర్థులే భరించాల్సి ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ.1.15 లక్షలు మూడు వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. విమాన, వీసా తదితర ఛార్జీలు కూడా అభ్యర్థులు స్వయంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. జర్మనీలో ఉద్యోగాల కోసం నవంబర్ 2వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చెల్లుబాటు అయ్యే పాస్ పోర్టు, గతంలో పనిచేసిన కంపెనీల నుండి రిలీవింగ్ లెటర్, సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మైనారిటీ అభ్యర్థులందరూ వారి బయోడేటా స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీ ఎస్ఎస్‌డిసి. ఇన్ కు ఆన్‌లైన్ ద్వారా పంపించాలని మంత్రి కోరారు. మరిన్ని వివరాల కోసం, ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 8712655686, 8790118349, 8790117279 సెల్ నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని, అర్హులైన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు.

# భూ కేటాయింపులపై సమగ్ర విధానం

- సర్వీసు ఇనాం భూములపై పూర్తిస్థాయి అధ్యయనం
- 45 రోజుల్లో నివేదిక, సీఎంతో చర్చించి నిర్ణయం
- లీగల్ అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు
- వచ్చే జూన్ నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి
- మంత్రులు అనగాని, పార్థసారథి, నారాయణ వెల్లడి



అమరావతి (చైతన్యరథం): సర్వీసు ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి సమగ్ర విధానం తేవాలని నిర్ణయించినట్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సర్వీసు ఇనాం భూములపై పూర్తి స్థాయి అధ్యయనం కోసం దేవాదాయశాఖ అధికారులు, తాహశీల్దార్లతో కమిటీలు వేస్తున్నామని, ఈ కమిటీలు సమగ్ర అధ్యయనం చేసి 45 రోజుల్లోగా నివేదిక ఇస్తాయని చెప్పారు. ఆ నివేదికపై చర్చించి ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం తీసుకొని సర్వీసు ఇనాం భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరగగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, పయ్యావుల కేశవ్, ఎన్ఎండి ఫరూక్, పార్థసారథి పాల్గొన్నారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విస్తృతంగా పర్యటిస్తూ రాత్రింబవళ్లు కష్టపడి రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెస్తున్నారని, ఈ నేపథ్యంలో పరిశ్రమలకు, ఇతర అవసరాలకు భూముల కేటాయింపుపై ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని నిర్ణయించామన్నారు. దీనిపై సమావేశంలో చర్చించామని, త్వరలోనే విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. ఫ్రీహెూల్డ్ భూముల సమస్యపై కూడా చర్చించామని, ఆ భూముల విధానాన్ని మరింత సరళతరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు చెప్పారు. వక్ఫ్ భూమలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు.

### అర్హులైన వారందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు: మంత్రి పార్థసారథి

సమాచార, ప్రజా సంబంధాలు, హౌసింగ్ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనతో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. అర్హులైన వారందరికీ రెండు సెంట్లు, మూడు సెంట్లు స్థలాలు ఎలా ఇవ్వాలో ఈ సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం సెంటు, సెంటున్నర స్థలాలని నివాస యోగ్యం కాని, నిర్మాణాలకు అనువుకాని ప్రాంతాల్లో స్థలాలను ఇచ్చి ప్రజలకు గుదిబండల్లా మార్చిందన్నారు. నిర్మాణాలు జరగని లేఅవుట్లలో లబ్దిదారులను ఒప్పించి చట్టపరంగా వాటిని రద్దుచేసి వారికి మళ్లీ రెండు, మూడు సెంట్లు ఇచ్చే అవకాశాన్ని సమావేశంలో చర్చించామన్నారు. చాలా చోట్ల ఈ లేఅవుట్ల నిర్మాణాలకై ప్రైవేటు భూములను సేకరించి, భూ యజమానులకు సొమ్మును చెల్లించకపోవడం వల్ల లబ్దిదారులకు పట్టాలను కూడా అందజేయలేకపోయారన్నారు. అదే విధంగా భూ యజమానులకు డబ్బులు కూడా అందక పలు ఇబ్బందులకు గురవ్వడమే కాకుండా తీవ్రంగా నష్టపోయారన్నారు. ఈ సమస్యను పరిష్కరించి ఏ విధంగా లబ్దిదారులకు న్యాయం చేయాలనే కోణంలో మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో సుదీరంగా చర్చించామన్నారు. ఈ అంశంపై అధికారుల స్థాయిలో కూడా మరోకసారి సమావేశాన్ని నిర్వహించిన తదుపరి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అదే విధంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో లీగల్ గా ఉన్న అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించేందుకు అడ్వకేట్ జనరల్‌తో సంప్రదిస్తామని, ఆయన అభిప్రాయం తెలుసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి తదుపరి సమావేశంలో తగు నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాల్లో ఇళు కూడా కట్టించి ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పార్థసారథి చెప్పారు.

### జూన్ నాటికి టిడ్కో ఇళ్లు పూర్తి: మంత్రి నారాయణ

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ 2014-19 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలకు ఏడు లక్షల టిడ్కో ఇళ్లను అన్ని సౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఐదు లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతినిచ్చి గ్రౌండ్ చేస్తే గత వైసీపీ ప్రభుత్వం 2 లక్షల 60 వేలకు కుదించి వాటిని కూడా పూర్తి చేయలేదని చెప్పారు. అనేక పాలసీలు మార్చి గందరగోళానికి గురి చేసింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు న్యాయం చేయాలని చెప్పారన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకూడదన్నారని, మొత్తం రెండు లక్షల 60 వేల టిడ్కో ఇళ్లను వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారని చెప్పారు. అందుకు గాను తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. పేద ప్రజలు ఇబ్బంది పడకుండా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సబ్ కమిటీ సమావేశంలో టిడ్కో ఇళ్ల పూర్తిపై చర్చించామని మంత్రి నారాయణ తెలిపారు.

# అడవులు జాతి సంపద.. ప్రతి అంగుళం అమూల్యం

- ఆక్రమణలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించం
- శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు చల్లించేందుకు ప్రణాళిక
- దేశ అవసరాలకు తగిన కలప రాష్ట్రం నుంచి అందిద్దాం
- ఎకో టూరిజం ప్రోత్సాహంతో గిరిజన యువతకు ఉపాధి
- అటవీ శాఖను ఆదాయార్జన శాఖగా తయారు చేయాలి
- గ్రేట్ గ్రీన్ వాల్ రాష్ట్రానికి వరం కావాలి
- అటవీ శాఖ సిబ్బంది భద్రతకు అధిక ప్రాధాన్యం
- ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ
- రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్ షాప్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి

అమరావతి (చైతన్యరథం): అడవులు జాతీయ సంపద.. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత.. అడవుల రక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది.. అడవులను రక్షించుకునే విషయంలో రాజకీయాలకు తావుండదు.. రాజీకి తావుండదు.. అడవుల్లో ప్రతి అంగుళం అమూల్యం.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడవుల రక్షణ విషయంలో మార్గదర్శకం చేస్తున్నారు.. అటవీశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు కూడా అటవీ భూములను రక్షించే విషయంలో పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్లాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అటవీశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తే తన సొంత ఇలాకాలోని అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటే, అప్పటి వ్యవస్థలో అధికారులు ఎందుకు పట్టించుకోకుండా ఉండిపోయారో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. అలాంటి తప్పిదాలు కూటమి ప్రభుత్వంలో జరగడానికి వీల్లేదని, పార్టీలు, వ్యక్తులకు అతీతంగా అటవీ భూమి అంగుళం కబ్జా అయినా వేగంగా స్పందించాల్సిన బాధ్యతను అటవీ అధికారులు తీసుకోవాలని చెప్పారు. కృష్ణా జిల్లా కొండపావులూరులోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవరణలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల రెండు రోజుల వర్క్ షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న పవన్ కళ్యాణ్.. అడవుల సంరక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ అటవీ శాఖలో విభిన్నమైన బాధ్యతలు పంచుకోవడానికి సరిపడినంత సిబ్బంది లేరని ప్రతి సమీక్షలోనూ అధికారులు తన దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. ఈ సమస్య అధిగమించడానికి ఉన్న మార్గాలను కేబినెట్ ముందు ఉంచాం. సిబ్బంది నియామకం వ్యవహారంలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలి. ఎలాంటి సిఫార్సులకు తావివ్వవద్దు. అడవుల్ని సంరక్షించాలంటే అటవీ శాఖ అధికారుల భద్రత ప్రధానమైనది. అటవీ సిబ్బంది భద్రత పట్ల కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి స్పష్టతతో ఉంది. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఇబ్బందిపెట్టినా, దాడులకు పాల్పడినా ఏ స్థాయి వ్యక్తులైనా వారిని ఉపేక్షించం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. విధి నిర్వహణలో ఇబ్బందులు ఉంటే వ్యక్తిగతంగా నన్ను కలిసి సమస్యను చెప్పండి. శ్రీశైలం ఘటన నా దృష్టికి వచ్చిన వెంటనే నిజానిజాలు తెలుసుకున్నాను. సిబ్బందికి తగిన న్యాయం జరిగేలా చూశాం. విధి నిర్వహణ విషయంలో ఎలాంటి భయాలకు తావివ్వవద్దని పవన్ స్పష్టం చేశారు.




### 50 శాతం పచ్చదనం లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా 22 శాతం భూ భాగంలో నోటిఫై చేసిన అడవులు ఉన్నాయి. డీ-నోటిఫై చేసిన దానితో కలిపితే మొత్తం 31 శాతంగా ఉండవచ్చు అని అంచనా. అయితే ఉన్న అడవుల్లో ఎంత పచ్చదనం ఉంది? ఆక్రమణల నేపథ్యంలో ఎంత శాతం అడవులు మిగిలాయి అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై సమగ్ర సర్వే చేసి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని అన్యాక్రాంతమైన అటవీ భూములను స్వాధీనం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. ఆక్రమణలు ఎక్కడ ఉన్నా, చేసింది ఎవరైనా ఉపేక్షించవద్దు. 2047 నాటికి రాష్ట్ర భూ భాగంలో 50 శాతం పచ్చదనంతో నిండేలా పని చేయాలి. దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరం. భావితరాలకు పచ్చదనాన్ని పెంపొందించేలా చైతన్యవంతులను చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలమని పవన్ అన్నారు.

### గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్... గొప్ప ప్రయత్నం

974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం మనది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంత రక్షణకు మడ అడవుల పెంపకం ప్రధానం. తీరం వెంబడి ఖాళీ ప్రదేశాల్లో తాటి చెట్లు, పాల్మిరా, పాడనస్ వంటి తీర ప్రాంత జాతుల మొక్కల పునరుద్ధరణపై దృష్టి సారించి ఆకుపచ్చని గోడ నిర్మాణానికి కాల వ్యవధి పెట్టుకుని పని చేద్దాం. దీని వల్ల తీర ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి బతుకు భరోసా లభిస్తుంది. అలాగే తుపాన్లు, సునామీల వంటి విపత్తుల నుంచి సహజ సిద్ధమైన రక్షణ పొందవచ్చు. సముద్ర జీవ జాతులను కాపాడవచ్చు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. సంవత్సరానికి 10 అడుగులకు పైగా సముద్ర గర్భంలో కలసిపోతుంది. ఇలాంటి కోతలను కూడా మడ అడవుల పెంపకం ద్వారా నివారించవచ్చు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆంధ్రప్రదేశ్ అనేది ఒక గొప్ప ప్రయత్నంగా ప్రారంభిస్తున్నాం. దీన్ని ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. లక్ష్యాన్ని అధిగమించేలా పనిచేయాలని పవన్ చెప్పారు.

### ఎర్రచందనం విత్తనాలు చల్లేందుకు ప్రణాళిక

శేషాచలం అడవుల్లో 1987 ప్రాంతంలో హెలీకాప్టర్ల ద్వారా విస్తారంగా ఎర్రచందనం విత్తనాలు చల్లారు. ఆ తర్వాత అలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇప్పుడు మరోసారి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు విస్తారంగా చల్లే కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీంతోపాటు ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధంతోపాటు ఇతర రాష్ట్రాల్లో పట్టుబడుతున్న ఎర్రచందనాన్ని తిరిగి రాష్ట్రానికి రప్పించే చర్యలు తీసుకుంటున్నాం. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లిన సందర్భంగా ఆ రాష్ట్ర అటవీ అధికారులు మన రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుకున్న రూ.110 కోట్ల ఎర్ర చందనాన్ని పట్టుకుని వేలం వేసుకున్నట్టు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. అందుకోసం అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుని ప్రభావవంతంగా పని చేయాల్సిన అవసరం ఉందని పవన్ అన్నారు.

బ్రిటీష్ హయాంలో అడవులు ఆదాయ మార్గాలుగా ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. మన దేశ అవసరాల కోసం ఏటా రూ.22 వేల కోట్ల విలువైన 900 లక్షల క్యూబిక్ మీటర్ల కలపను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అడవులను కాపాడుకుంటూనే, డీనోటిఫై చేసిన ప్రాంతాలను కలప పెంపకానికి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలి. ఖాళీ ప్రదేశం ఉన్న ప్రతి చోటా కలప పెంచాలి. అవసరం అయితే పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా శాఖలను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టాలి. అడవి ఆదాయ వనరుగా ఉంటేనే సిబ్బంది కొరత సమస్యను అధిగమించగలం. దేశానికి అవసరం అయ్యే కలపను రాష్ట్రం నుంచి అందించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకోవాలని పవన్ చెప్పారు.

### హస్త కళలకు అవసరమయ్యే వృక్షాలు పెంచాలి

ఉడ్ బ్యాంక్స్ ఏర్పాటు, ఎకో టూరిజం మీద దృష్టి సారించాలి. పర్యావరణాన్ని రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని ప్రోత్సహించాలి. తద్వారా గిరిజన యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలి. అడవులను కాపాడుకుంటూ, గిరిజనుల జీవనాధారానికి ఇబ్బంది కలగకుండా చూడాలి. అడవుల అందాలను ప్రజలు ఆస్వాదించే ఏర్పాటు చేయాలి. కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజంపై దృష్టి సారించాలి. అది భవిష్యత్ పర్యాటక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ముడి కలప కొరత ఉంది. అంకుడు, తెల్ల పొనికి చెట్లను విస్తృతంగా పెంచి ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీకి ఇబ్బందులు లేకుండా చూడాలి. కళాకారుల అవసరానికి తగినంతగా సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. కొండపల్లి బొమ్మల తయారీకి వినియోగించే తెల్లపొనికి చెట్ల పెంపకం సవాలుతో కూడుకున్న వ్యవహారం. అవి చాలా నెమ్మదిగా పెరుగుతాయి. వీటి వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాలి. ఒక పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని ముందుకు తీసుకువెళ్లాలని పవన్ అన్నారు.

మానవులు - జంతువుల సంఘర్షణను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలి. రాష్ట్ర సరిహద్దుల్లోని చిత్తూరు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మదపుటేనుగుల సంచారం ఎక్కువగా ఉంది. చిత్తూరు జిల్లాలో సమస్య పరిష్కారానికి కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తీసుకువచ్చాం. శ్రీకాకుళంలో తొమ్మిది ఆడ ఏనుగులు సంచరిస్తున్నట్టు సమాచారం ఉంది. ఇవి ఒడిశా నుంచి వచ్చాయి. ఒడిశాలో మైనింగ్ పెరిగిపోవడంతో అవి ఇటు వైపు వలస వచ్చినట్టు తెలుస్తోంది. మన రాష్ట్రంలో అవి తిరుగుతున్న ప్రాంతం మొత్తం పంట పొలాలున్న ప్రాంతం. ఈ సమస్య పరిష్కారానికి అవసరం అయితే ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడి వాటిని తిరిగి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం. అడవుల సంరక్షణ, ప్రకృతి పరిరక్షణ, గిరిజనుల కోసం ఏదైనా చేయాలన్న తపన, నిబద్ధతతో పని చేసేందుకు ముందుకు వచ్చే అధికారులకు కూటమి ప్రభుత్వం తరఫున మా వంతు సహకారం అందిస్తాం. అడవులను కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పెంపొందించుకుంటూ పచ్చని హరితాంధ్రప్రదేశ్ నిర్మిద్దామని పవన్ పిలుపు ఇచ్చారు.

### గ్రేట్ గ్రీన్ వాల్ పోస్టర్ల విడుదల

ఈ సందర్భంగా గ్రేట్ గ్రీన్ వాల్ ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. అంతకు ముందు ఎన్ఐఆర్డీలోని నక్షత్ర వనాన్ని పరిశీలించి ప్రతి మొక్క వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. జమ్మి చెట్టును నాటారు. ఈ వర్క్ షాప్‌లో అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ చలపతిరావు, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జున రావు, శాఖ ఉన్నతాధికారులు రాహుల్ పాండే, శాంతిప్రియా పాండే, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ పీఎస్ రెడ్డి, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు.. అండగా ఉంటాం

- ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం
- రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం
- మంత్రి వాసంశెట్టి సుభాష్ భరోసా
- వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి
- సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు

రామచంద్రపురం (చైతన్యరథం): అన్నదాతలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పంటలు, నీట మునిగి నేలమట్టమయ్యాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పంట పొలాలను మంత్రి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,



జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధైర్య పడవద్దు.. కూటమి ప్రభుత్వం మీకు అన్నివేళలా అండగా ఉంటుందంటూ భరోసా ఇచ్చారు. ఎంతమంది రైతులు క్రాఫ్ ఇన్సూరెన్స్ చేయించుకున్నారో తెలుసుకొని ఒక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రామచంద్రపురం, కె. గంగవరం, కాజులూరు మండలాల్లో మొత్తం 36,511 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉన్నాయని, అందులో సుమారు 2,056 ఎకరాల్లో పంటలు పడిపోయినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే దశ నుండి పాలు నిండే దశ వరకు ఉన్నాయన్నారు. అకాల వర్షాల కారణంగా రైతాంగం ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఈ సీజన్లో పంట అంచనా దిగుబడి సుమారు 1.49 లక్ష మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అలాగే 68 పీపీసీల ద్వారా ఆ నెల 27 నుండి నవంబర్ 10 వరకు ప్రారంభమయ్యే అవకాశం ఉందని మంత్రి సుభాష్ వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు, అధికారులు ఉన్నారు.

చైతన్యరథం

# నిగ్గు తేలుద్దాం... సిద్ధమా జగన్‌రెడ్డీ?

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆరోపణలపై విచారణకు కమిటీ ఏర్పాటుకి ప్రభుత్వం సిద్ధం
- ప్రభుత్వ నూతన వైద్య కళాశాలల సంక్షోభానికి జగన్‌రెడ్డే కారణం
- పరిష్కారం కోసమే పీపీపీ విధానమన్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- పీపీపీ కింద ప్రతి ఏడాది 220 అదనపు సీట్లు లభిస్తాయి.... ఇది 2 నూతన కళా శాలల ఏర్పాటుకు సమానం
- సమగ్ర సమాచారంతో 12 పేజీల కరదీపికను విడుదల చేసిన మంత్రి
- ప్రజల తరపున జగన్‌కు 30 ప్రశ్నలు



అమరావతి (చైతన్యరథం): పది నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతోందంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఘాటుగా స్పందించారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిజనిజాలను నిగ్గు తేల్చేందుకు నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని శుక్రవారం మంత్రి వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మంత్రి మాట్లాడుతూ ... ప్రభుత్వం చేపట్టనున్న పబ్లిక్, ప్రైవేటు పార్టనర్షిప్ (పీపీపీ) విధానం ప్రైవేటీకరణకే కిందకి వస్తుందని కానీ, లేక దీనివల్ల ప్రైవేటీకరణ ఫలితాలే సంభవిస్తాయని కానీ ఈ కమిటీ నిర్ధారిస్తే కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునస్సమీక్ష చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కమిటీని ఏర్పాటుచేసేందుకు మాజీ సీఎం ఇద్దరు లేదా ముగ్గురు నిపుణులను త్వరగా సూచించాలని మంత్రి కోరారు. నిర్దిష్ట కాలపరిమితిలో ఈ కమిటీ తమ నివేదికను అందించేలా.. చర్యలు చేబడతామని, తద్వారా ప్రజలకు పీపీపీ విధానంలో పది కళాశాలల అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు తెలుస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

### సంక్షోభానికి మూలాలు

రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కశాలలను నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్ రెడ్డి ఆ మేరకు తగు చర్యలు చేపట్టకపోవడం వల్లనే సంక్షోభం ఏర్పడిందని... పది కళాశాలలకు సంబంధించి ఈ సంక్షోభం మరీ తీవ్ర స్థాయిలో ఉందని.. దీనికి ప్రధాన కారకుడు మాజీ ముఖ్యమంత్రేనని సోదాహరణంగా మంత్రి స్పష్టం చేశారు. ఈ కళాశాలల నిర్మాణం కోసం మొత్తం రూ.8,480 కోట్లు వెచ్చించాల్సి ఉండగా, ప్రకటన అనంతరం నాలుగేళ్లలో జగన్ రెడ్డి కేవలం రూ.1,550.39 కోట్లు (18%)మాత్రమే వ్యయంచేసి నందున సంక్షోభం నెలకొందని మంత్రి తెలిపారు. పర్యవసానంగా... 2023-26 మధ్యకాలంలో (మూడేళ్లు) మొత్తం 2,550 కొత్త ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పిస్తామని జగన్ రెడ్డి ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయిందని, కేవలం 800 ప్రవేశాలు మాత్రమే జరిగాయని మంత్రి వివరించారు.

### 10 కళాశాలల దైన్యస్థితి

ప్రభుత్వం పీపీపీ విధానంలో చేపట్టదల్చిన కళాశాలల నిర్మాణానికి సంబంధించి జగన్ రెడ్డి నిర్వాకాన్ని మంత్రి సత్యకుమార్ వివరించారు. ఈ కళాశాలల నిర్మాణాలకు సంబంధించి మొత్తం రూ.4,995 కోట్లు వెచ్చించాల్సి ఉండగా జగన్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కేవలం రూ.631.77 కోట్లు మాత్రమే (12.75%) వెచ్చించడంతో ఈ కళాశాలలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయాయని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను పాత్రికేయులకు మంత్రి వెల్లడించారు. పార్వతీపురం కళాశాల కోసం జగన్ రెడ్డి కనీసం భూ సేకరణ కూడా జరపలేదని మంత్రి తెలిపారు. మరో 8 కళాశాలలకు సంబంధించి వైకాపా హయాంలో జరిగిన వ్యయం రూ.0.59 కోట్ల నుంచి రూ.60.85 కోట్లు మాత్రమేనని, రూ.500 కోట్ల వ్యయంతో కూడిన ఒక్క పులివెందుల కళాశాల కోసమే జగన్ రెడ్డి భారీ స్థాయిలో రూ.396.16 కోట్లు (80%) వెచ్చించారని ఆయన తెలిపారు.

పాలకొల్లు కళాశాలను రూ.475 కోట్లతో నిర్మించాల్సి ఉండగా గత ప్రభుత్వం కేవలం రూ.0.59 కోట్లు (0.12%) మాత్రమే వెచ్చించింది. నర్సీపట్నం కళాశాల-రూ.500 కోట్లు/రూ.10.70 కోట్లు/2.14%, పెనుకొండ-రూ.475 కోట్లు/రూ.18.98కోట్లు (3.99%), బాపట్ల-రూ.505 కోట్లు/రూ.22.10 కోట్లు (2.14%), మదనపల్లి-రూ.475 కోట్లు/రూ.28.54 కోట్లు (6.00%), మార్కాపురం - రూ.475 కోట్లు/రూ.46.26 కోట్లు (9.74%), ఆదోని కళాశాలకు రూ.475 కోట్లు వ్యయం చేయాల్సి ఉండగా కేవలం రూ.47.59కోట్లు (10.01%) మాత్రమే ఖర్చు చేశారని మంత్రి తెలిపారు. ఈ పది కళాశాలలకు సంబంధించి ప్రణాళిక మేరకు మొత్తం 132.43 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాల్సి ఉండగా జగన్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల్లో కేవలం 27.72 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం (23.93%) మేరకు మాత్రమే నిర్మాణాలు పూర్తిచేసిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు.

పార్వతీపురం, పాలకొల్లు కళాశాలలకు సంబంధించి ఎటువంటి నిర్మాణాలు జరగలేదని, బాపట్ల కళాశాల పనులు కేవలం పునాదులకు మాత్రమే పరిమితయ్యాయని మంత్రి వివరించారు. మరో 6 కళాశాలలకు సంబంధించి 0.89% నుంచి 3.61% మేరకే పనులు పూర్తయ్యాయని తెలుపుతూ.... మాజీ సీఎం సొంత నియోజకవర్గంలోని పులివెందుల కళాశాలకు సంబంధించి మాత్రం 95.41% నిర్మాణాలు పూర్తిచేశారన్నారు.

### తనకో రూలు... ఇతరులకు మరోటా?

నాలుగేళ్ల కాలంలో వైద్య కళాశాలల నిర్మాణాల కోసం అత్యల్పంగా ఖర్చుచేసిన జగన్‌రెడ్డి జూన్, 2024లో అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలోపే 17 కళాశాలల నిర్మాణాలను పూర్తి చేసేందుకు భారీస్థాయిలో రూ.6,930 కోట్లు ఖర్చు చేయాలని డిమాండ్ చేయడాన్ని మంత్రి తప్పుబట్టారు. సాలీనా జగన్ రెడ్డి చేసిన రూ.387 కోట్ల వ్యయం ఆయన హయాంలోని ఆర్థిక దుస్థితికి నిదర్శనమన్నారు. అటువంటి దుర్భర పరిస్థితి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనతికాలంలోనే ఎలా మెరుగు అవుతుందో జగన్ రెడ్డే చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తాను ప్రతిపాదించిన వైద్య కళాశాలల నిర్మాణం సంక్షోభంలో కూరుకుపోవడం పట్ల జగన్ రెడ్డి ఆత్మవిమర్శ చేసుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఈ సంక్షోభ పరిసితిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని చేపట్టాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడిందని ఆయన స్పష్టంచేశారు.

### పీపీపీతో ప్రయోజనాలు!

కూటమి ప్రభుత్వం చేపట్టనున్న పీపీపీ విధానంతో కలిగే ప్రయోజనాలను మంత్రి వివరించారు: 1. ఈ విధానంలో ప్రతి కళాశాలలో 22 చొప్పున మొత్తం పది కళాశాలల్లో 220 సీట్లు కేవలం మన రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోనికి వస్తాయి. ఈ ఫలితం రెండు కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో సమానం. 2. ప్రతి కళాశాల అనుబంధ ఆసుపత్రుల్లో 205 అదనపు పడకలతో మొత్తం పది ఆసుపత్రుల్లో 2,050 అదనపు పడకలు సమకూరతాయి. 3. వైద్య విద్య, వైద్య సేవల నాణ్యత పెరుగుతుంది. 4. కళాశాలల నిర్మాణ, నిర్వహణ వ్యయం తగ్గడంతో ఇతర పథకాలకు విలువైన ఆర్థిక వనరులు లభిస్తాయి. 5. వైద్య కళాశాలల నిర్మాణ, నిర్వహణలో ప్రైవేటు రంగంతో ముడిపడిన సామర్థ్యం జతకూడుతుంది. మరీ ముఖ్యంగా జగన్ రెడ్డి తీరుతో 20 ఏళ్లలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులో వచ్చే వైద్య కళాశాలలు తక్కువ వ్యవధిలో లభిస్తాయి. 6. వైద్య విద్య, సేవల రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఒనగూరుతుంది.

### ప్రజల కోసం, ప్రజల తరపున జగన్‌రెడ్డికి 30 ప్రశ్నలు

రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు సంబంధించి, మాజీ సీఎం జగన్‌రెడ్డి నిర్లక్ష్యం, అసమర్థత సంక్షోభానికి దారితీసిన తీరు, దానికి సంబంధించిన పలు అంశాలపై సమగ్ర సమాచారంతో కూడిన 12 పేజీల కరదీపికను మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం విడుదలచేశారు. దీని ద్వారా జగన్‌రెడ్డికి మంత్రి 30 ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా.. 1. జగన్‌రెడ్డి 2,550 ఎంబీబీఎస్ ప్రవేశాలను మూడేళ్లలో 2025-26 నాటికే కల్పిస్తామని హామీ ఇచ్చారా? లేక 15-20 ఏళ్లలో అందుబాటులోనికి తెచ్చామని చెప్పారా? 2. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద, నాబార్డుతో ఆర్థిక వనరుల లభ్యత కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ అవసరాల మేరకు వైద్య కళాశాలల నిర్మాణంపై ఎందుకు వ్యయం చేయలేకపోయారు? 3. రాష్ట్ర వాటా కింద విడుదల చేయాల్సిన 20% నిధులను ఇవ్వలేకపోవడం మీ అసమర్థతకు నిదర్శనం కాదా? 4. అభివృద్ధి వికేంద్రీకరణ కోసమంటూ 3 రాజధానులను ప్రతిపాదించిన జగన్‌రెడ్డి ఇతర ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యంచేస్తూ కేవలం పులివెందుల కళాశాలపై దాదాపు రూ.400 కోట్లు ఎందుకు వ్యయంచేశారు? 5. పీపీపీ విధానంలో ప్రభుత్వ కళాశాలలకు సంబంధించిన భూములను, ఇతర ఆస్తులను కానీ ప్రైవేటు భాగస్వాములకు బదలాయిస్తామని కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రతిపాదన చేయకున్నా ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారు? 6. ప్రపంచ ప్రమాణాలతో కూడిన వైద్య కళాశాలలను స్వశక్తితో నడిచే విధంగా కాలేజీల స్థాయిలోనే ఆదాయ వనరులను కల్పించడానికంటూ సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి, రూ.12 లక్షలు, రూ.20 లక్షల వార్షిక ఫీజును ప్రవేశపెట్టిన జగన్‌రెడ్డి అదే విధానంలో ముందుకు సాగనున్న పీపీపీని ఏ దురుద్దేశంతో వ్యతిరేకిస్తున్నారు? 7. జగన్ రెడ్డి వ్యతిరేకిస్తున్నది పీపీపీనా? ప్రైవేటీకరణ నునా? రెండింటినా? 8. రాష్ట్రంలో పీపీపీ విధానంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, 108, 104, 102 సర్వీసులు, ఎమ్మారై, సీటీ స్కాన్ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రజలకు అందుతున్న విషయం జగన్‌రెడ్డికి తెలియదా? 9. రాష్ట్ర, దేశ వ్యాప్తంగా పీపీపీ విధానంలో లక్షలాది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మితమవుతున్న జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధిని జగన్‌రెడ్డి బహిరంగంగా వ్యతిరేకింగలరా? 10. జగన్‌రెడ్డి పులివెందులకు ముఖ్యమంత్రి? రాష్ట్రానికా?

### జగన్ మానసిక స్థితి ఆందోళనకరం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆధీనంలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపట్ల జగన్‌రెడ్డి వ్యాఖ్యలను ఉదహరిస్తూ... ఆయన మానసిక సితిపట్ల మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వెలిబుచ్చారు. తాను నిత్యం వల్లివేసే అబద్ధాలే... నిజాలని నమ్మే ఆయన వైఖరి... సరికాదని, దీంతో తీవ్ర పరిణామాలు ఏర్పడతాయి కనుక ఆయన వైఖరిని మార్చుకోవాలని మంత్రి సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా జగన్‌రెడ్డి తనకు తాను దైవదూతగా భావిస్తున్నారని మంత్రి ఆక్షేపించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ అమలుపై జగన్‌రెడ్డి వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు.

### నెటువర్క్ ఆసుపత్రుల సమస్య పరిష్కారానికి అన్వేషణ!

డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా సేవలు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులు ప్రభుత్వ బకాయిలు వల్ల సమస్యలు ఎదుర్కొనడం వాస్తవమేనని, అదే సమయాన రాష్ట్ర ప్రభుత్వం వనరుల సమస్య ఎదుర్కొవడం కూడా యథార్థమని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం మార్గాలను అన్వేషిస్తున్నామని, అందులో భాగంగా ఒక ప్రత్యామ్నాయ విధానంపై చర్చలు జరుగుతున్నాయని, ఈ ఆలోచన ఒక రూపం దాల్చిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు.

---



గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

**తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడిన మంత్రి డా.స్వామి - సీఎం చంద్రబాబు, మంత్రికి విద్యార్థిని, తల్లితండ్రుల కృతజ్ఞతలు**

అమరావతి (చైతన్యరథం): డా. బీఆర్ అంబేద్కర్ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినికి మంత్రి ప్రత్యేక చొరవతో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే...నెల్లూరు జిల్లా రాపూరు ఎస్సీ బాలికల హాస్టల్ లో 6వ తరగతి విద్యార్థిని ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురికాగా హాస్టల్ వార్డెన్, సిబ్బంది గూడూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించి వైద్యం అందించారు. విషయం తెలుసుకున్న మంత్రి స్వామి తిరుపతి జిల్లా కలెక్టర్, డాక్టర్లతో మాట్లాడి విద్యార్థినిని తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చేర్పించి ప్రత్యేక వైద్యం చేయించారు. ప్రస్తుతం విద్యార్థిని ప్రాణాపాయ స్థితి నుంచి కోలుకోగా ఆరోగ్యం నిలకడగా ఉంది. మరికొద్ది రోజుల్లో విద్యార్థినిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి డా. స్వామికి విద్యార్థిని, ఆమె తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. డా.స్వామి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తీవ్ర అనారోగ్యానికి గురైన 30 మందికి పైగా అంబేద్కర్ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రత్యేక చొరవతో కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించి వారి ప్రాణాలు కాపాడారు.

## టీడీపీలో చేరిన 100 కుటుంబాలు

**• పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



సాలూరు (చైతన్యరథం): రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులైన పలువురు టీడీపీలో చేరుతున్నారని అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని కొదమ పంచాయతీ పరిధిలో 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ (టిడిపి)లో చేరాయి. వారందరికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... "తమ ప్రభుత్వం ప్రజలకు న్యాయమైన పాలన అందించేందుకు కట్టుబడి ఉంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, యువత భవిష్యత్ బాగుండేలా నిర్ణయాలు తీసుకోవడమే మా లక్ష్యం. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రజలు గట్టి నమ్మకంతో టిడిపిలో చేరుతున్నారు." అని అన్నారు. పార్టీలో చేరిన 100 కుటుంబాలు మాట్లాడుతూ, "ప్రజా సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రానికి సరైన దిశానిర్దేశం చేయగల సామర్థ్యం టిడిపికి మాత్రమే ఉంది. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే నాయకత్వం చంద్రబాబుది. ఆయన అనుభవం, టిడిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి ఎలా ఉండేదో మేము చూశాం. అందుకే మేము ఈ పార్టీతో కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాం." అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు హాజరై, కొత్తగా పార్టీలో చేరిన వారిని అభినందించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ అన్ని విధాలుగా అండగా ఉంటామని నేతలు హామీ ఇచ్చారు.

## విద్యార్థులందరికీ అత్యున్నత విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**• మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



విజయనగరం (చైతన్యరథం): రాష్ట్రంలో విద్యార్థులందరికీ అత్యున్నత విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం విజయనగరం వేణుగోపాలపురం ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణసంస్థలో రూ. 745.68 లక్షలతో నిర్మించనున్న సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ భవన సముదాయానికి మంత్రి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అత్యున్నత విద్యాశిక్షణను అందించేందుకు భారీ ఆడిటోరియం, సెమినార్ హాల్, లైబ్రరీ, అదనపు తరగతి గదులు, హాస్టల్ భవనాలను నిర్మిస్తామని ప్రకటించారు. రూ. 65.25 లక్షలతో నిర్మించిన నాలుగు తరగతి గదులను, రూ. 61.10 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఏఎంసీ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీఈఓ యు.మాణిక్యంనాయుడు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఏ.రామారావు, డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి



కురుపాం (చైతన్యరథం): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రజా దర్బార్ యొక్క ముఖ్య ఉదేశ్యమని ప్రభుత్వ విప్ మరియు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతులు రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజాదర్బార్ నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## వైసీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోని పంచాయతీలు

**• ఇళ్ల నిర్మాణాలకు వచ్చే నెల 5లోగా దరఖాస్తు చేసుకోవాలి : మంత్రి అచ్చెన్నాయుడు**



నిమ్మాడ (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వ అయిదేళ్ల పాలనలో పంచాయతీలు నిస్తేజంగా మారాయి. గ్రామ పాలనలో సర్పంచుల ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోయింది. కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులు సైతం పక్కదారి పుట్టాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కనీసం కాలువల్లో పూడికలు తీసేందుకు.. వీధి దీపాల మరమ్మతులకు కూడా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ పరిధిలో గల ఇంటి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని ఇంటి యజమానులకు డిమాండు నోటీసు జారీ చేసి ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీల్లో నివసిస్తున్న ఇళ్ల లబ్ధిదారులు, వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు ఇంటి పన్ను వసూలు, సాధించాల్సిన లక్ష్యాల వివరాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్‌లోగా ప్రతీ ఇంటి విలువ లెక్కించి సమగ్ర ఇంటి పన్ను వివరాలు సేకరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటి యజమానికి డిమాండ్ నోటీసు అందిస్తున్నది లేనిది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లింపు కోసం సామాజిక బాధ్యతగా వినియోగదారులు ముందుకురావాలని కోరారు. ఆదాయ వరరులను వినియోగించుకొని సమష్టి కృషితో పంచాయతీల అభివృద్ధి దిశగా పయనిద్దామన్నారు. నియోజక వర్గంలోని ఇంటి స్థలం కలిగిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి వచ్చే నెల 5 తేదీ లోగా ఆయా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, మండల తాసిల్దార్‌లకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

రాష్ట్ర ప్రజలు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం, ఆలోచన అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఐదుగురు లబ్ధిదారులకు రూ. 3,5 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) వరం లాంటిదన్నారు. పేద ప్రజలు అనారోగ్యం పాల్కె ఆసుపత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటున్నారని అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పౌరుని ఆరోగ్య పరిస్థితిని డిజిటల్కైజేషన్ చేసి సంజీవిని పథకం ద్వారా ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ 25 లక్షల రూపాయల వరకు ఇన్స్యూరెన్స్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## ఎన్టీఆర్ బాటలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**• సూపర్ సిక్స్ సహా హామీలన్నీ అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి**



ఏలూరు (చైతన్యరథం): సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. శుక్రవారం సాయంత్రం నూజివీడు మండలం మర్రిబంధం గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. విగ్రహావిష్కరణ అనంతరం జరిగిన సభలో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. ఎన్టీఆర్ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి అన్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన ముహూర్తం గొప్పదని, ఆ ముహూర్త బలంతో 43 ఏళ్ళుగా ప్రతీ తెలుగువాడు గర్వంగా కాలర్ ఎగరేసుకునే విధంగా తెలుగుదేశం పార్టీ తిరుగులేనివిధంగా దూసుకువెళుతోందన్నారు. ఆయన ఆశీర్వాద బలంతో చంద్రబాబునాయుడు నాయకత్వంలో తనలాంటి ఎంతోమంది రాజకీయాల్లోకి వచ్చి, ఆయన ఆశయాల సాధనకోసం నిరంతరం పనిచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్, పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కష్టపడుతున్నారని, అనేక కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి క్షణం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చి యువతకు విద్యా ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ దీపావళి పండుగ రోజు కూడా దుబాయ్, ఆస్ట్రేలియా దేశాల్లో పర్యటిస్తూ కష్టపడుతున్న విషయాన్ని మనం గుర్తుపెట్టుకోవాలన్నారు. అభివృద్ధితో పాటు, సంక్షేమంలో కూడా వెనుకడుగు వేయకుండా, సూపర్ సిక్స్ సహా అన్ని హామీలు అమలు చేస్తూ పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. వైసీపీ నేతల మాయ మాటలు నమ్మినందుకు ఒకసారి రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, కాబట్టి మరోసారి అటువంటి మోసపు పార్టీ నాయకుల మాటలు ఎవ్వరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారధి, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మండల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ సీనియర్ నేత మృతి



నక్కపల్లి (చైతన్యరథం): జాతీయ రహదారిపై ఒడ్డిమెట్ట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెదేపా సీనియర్ నాయకుడు జల్లూరి సుదర్శనరావు(73) మృతిచెందారు. జి.జగన్నాథపురానికి చెందిన ఈయన ద్విచక్ర వాహనంపై తుని వెళ్తుండగా, ఒడ్డిమెట్ట దాటగానే వెనుక నుంచి వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై కె.సన్నిబాబు కేసు నమోదు చేశారు. ఈయన మృతిపట్ల మంత్రి అనిత, పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈయన గతంలో తెదేపా ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా, మాజీ ఉప సర్పంచిగా పదవులు చేపట్టారు.

# ఆలయాలకు సమర్ధవంతమైన కమిటీల నియామకం

**•వేడుకగా శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అభినందన కార్యక్రమం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలోని వివిధ దేవాలయాలు, ధార్మిక సంస్థలకు సమర్ధవంతమైన కమిటీలను వేయడం జరిగిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్యాపురం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానానికి నూతన పాలక మండలి నియమించబడింది. మళ్ల వెంకట రాజు చైర్మన్‌గా, కోలా రామచంద్రరావు, పెండ్యాల ఉమా మహేష్, నక్కెళ్ల హరి ప్రసాద్, వంజరపు శంకర్, సేలం సత్యనారాయణ, పానింగపల్లి సత్య శ్రీనివాస చార్యులు, తంగెళ్ల పద్మావతి, ఉప్పులూరి సూర్యకుమారి, కల్లూరి సూర్య నాగ వెంకట అన్నపూర్ణ, అరవ సువర్చల సంతోషి, కుప్పల రాజేశ్వరి డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారందరినీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులు గన్ని కృష్ణ, చల్లా శంకరరావు, కాశీ నవీన్ కుమార్, వై శ్రీను, జామి సత్యనారాయణ తదితరులు ఘనంగా సన్మానించారు. ఆలయం వద్ద టిడిపి నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన, నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి ఉన్నంత ప్రాధాన్యత మన ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని ఉందన్నారు. ప్రస్తుతం నగరంలో కూటమి సభ్యులను కలుపుకొని ఎండోమెంట్ కమిటీలను సమర్థవంతమైన సభ్యులతో వేయడం జరుగుతుందన్నారు. పార్టీ కోసం కష్టపడి కష్టాలను అధిగమించిన వారిని గుర్తించి అవకాశం ఇస్తున్నట్లు వివరించారు. కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 8 కమిటీలు ప్రమాణస్వీకారం చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో పార్టీ అధినాయకత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలతో పాటు ఇచ్చిన హామీలను కూడా నెరవేరుస్తోందన్నారు.

# సామాన్యులకు అండగా ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం (చైతన్యరథం): సామాన్యులకు అండగా ఉండేలా ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని తీర్చిదిద్దామని, ఎవరైనా వచ్చి తమ సమస్యలపై ఇక్కడ వినతులు సమర్పించవచ్చని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. శుక్రవారం సామర్లకోట పట్నం శ్రీకాంత్ షెల్టో కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సుమారు 22 మంది తమ వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. అధికారులతో మాట్లాడి పలు సమస్యలను ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.



# మద్యం వినియోగదారులు సురక్ష యాప్‌ని వినియోగించాలి



కొత్తపేట (చైతన్యరథం): కల్తీ మద్యం అంశంలో జగన్ పాపాలు శాపాలై ప్రజల్ని పట్టి పీడించాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం రింగ్ రోడ్డులో శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో ఎక్సైజ్ సూపరెండెంట్ ప్రసాద్,కొత్తపేట ఎక్సైజ్ సి.ఐ కాత్యాయని తదితరులతో కలసి మద్యం షాపును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తీసుకువచ్చిన సురక్షా యాప్ పై వినియోగదారులకు అవగాహన కలిగించారు.మద్యం షాపు వద్ద కొనుగోలు చేసిన బాటిల్ క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ బాటిల్ ఎక్కడ తయారు అయ్యింది, అందులో ఉన్న వివరాలు తెలుస్తాయన్నారు. స్వయంగా ఎమ్మెల్యే బాటిల్స్ ను స్కాన్ చేసి వివరాలను అందరికీ చూపించారు. ప్రతి వినియోగదారుడు ఈ విధంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి మద్యం వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కూటమి హయాంలో నాణ్యమైన మద్యం లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాస్, గనిశెట్టి వీరేష్, కొవ్వూరి అచ్చిరెడ్డి మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**కూటమి అధికారంలోకి వచ్చాక ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నాం...**

అత్యంత పురాతనమైన మందేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలకమండలి సభ్యులు కృషిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవంలో కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. పాలకమండలి సభ్యులచే ఎమ్మెల్యే బండారు ప్రమాణస్వీకారం చేయించారు.

# సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం : ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



జగ్గంపేట (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం ఆవరణలో ప్రజల నుంచి శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వినతులు స్వీకరించారు. ఈ వినతులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. జగ్గంపేట గ్రామానికి చెందినవి రిషిత క్రైట్ విద్యాసంస్థల్లో బీటెక్ సి ఎస్ ఈ(ఏఐడి) బ్యాచ్ నందు అడ్మిషన్‌కు అప్లై చేసుకుంది. అని ఈ అమ్మాయి ఫీజు కట్టలేని పరిస్థితిలో ఉందని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అమరావతిలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో అర్జీ సమర్పించిందని మంత్రి లోకేష్ నాకు ఎండార్స్ చేయడం జరిగిందని వెంటనే ఈ అమ్మాయికి ఫీజు తగ్గించాలని చైర్మన్ పోతుల విశ్వంకు లెటర్ రాసి పంపించడం జరిగింది. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ... రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భారత్, జగ్గంపేట మండలం టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, మణికర్ణిక యువజన సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# రాయవరం బాణాసంచా ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

**•రూ.15 లక్షల చొప్పున పరిహారం అందజేసిన మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ళ జోగేశ్వరరావు**



అనపర్తి (చైతన్యరథం): రాయవరం బాణాసంచా ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారాన్ని శుక్రవారం కూటమి నేతలతో కలిసి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అందజేశారు. ఇటీవల రాయవరం గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఒక్కో కుటుంబానికి 15 లక్షల రూపాయల చొప్పున పరిహారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ... పది రోజుల క్రితం ఇక్కడ జరిగిన బాణాసంచా ప్రమాదంలో పదిమంది మృతి చెందడంతో బాధిత కుటుంబాలను ఆదుకోవాలంటూ స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, మండపేట ఎమ్మెల్యే జోగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించడం జరిగిందని స్పందించిన ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందించేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. ఒక్కో కుటుంబానికి 15 లక్షల రూపాయలు చొప్పున అందజేయడమే కాకుండా వీరిలో ఎనిమిది మందికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ నుండి కూడా వారికి రూ.5 లక్షల చొప్పున త్వరలోనే పరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ప్రమాదం జరిగింది రాయవరంలో అయినా ప్రమాద సంఘటనలో మృతి చెందిన వారంతా అనపర్తి నియోజకవర్గానికి చెందిన వారు కావడంతో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రూ.15 లక్షల పరిహారం అందించేందుకు నావంతు కృషి చేశానని అన్నారు. సంఘటన గురించి ముఖ్యమంత్రికి వివరించి ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు చొప్పున పరిహారం అందించడం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ అధినేత సైతం మృతి చెందినప్పటికి వారి కుటుంబ సభ్యులు సైతం సహృదయంతో స్పందించి ఒక్కో కుటుంబానికి రెండు లక్షల 50 వేల రూపాయలు చొప్పున పరిహారం అందించడం జరిగిందన్నారు. ఈ దురదృష్టకర సంఘటనలో భాధితులకు న్యాయం చేయడం అందరూ తమ వంతు సహకారం అందజేశారని రామకృష్ణారెడ్డి తెలిపారు.

# నిత్యాన్నదానశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన టెంపుల్ మెంట్రేన్ విశ్రాంతి షెడ్‌ను శుక్రవారం ఎమ్మెల్యే సత్యప్రభ ప్రారంభించారు. సుమారు రూ.2కోట్లు 50 లక్షల వ్యయంతో లారస్ ల్యాబ్స్ సౌజన్యంతో ఈ ఆధునిక సదుపాయాన్ని ఆలయ పడమట గోపురం వద్ద ఏర్పాటు చేశారు. ఈ విశ్రాంతి షెడ్‌లో భక్తుల సౌకర్యం కోసం దర్శన టికెట్ కౌంటర్లు, వ్రత బుకింగ్ కౌంటర్లు, అలాగే ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సత్యప్రభ స్వయంగా ఈ కౌంటర్లను ప్రారంభించి, భక్తుల సేవకు అందుబాటులో తీసుకువచ్చారు. తరువాత ఎమ్మెల్యే నిత్యాన్నదానశాలను సందర్శించి, అక్కడ భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదం నాణ్యతను పరిశీలించారు. కొంతసేపు స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించి, ఆహార నాణ్యతపై వారితో మాట్లాడారు. భోజనం రుచి, పరిశుభ్రత, సేవ పట్ల భక్తులు సంతృప్తిని వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. తదుపరి ఎమ్మెల్యే దేవస్థాన సిబ్బందికి భక్తుల సౌకర్యాలపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కొండపై స్థానిక నాయకుడు పసుపులేటి చక్రి ఏర్పాటు చేసిన జ్యూస్ షాపును ప్రారంభించారు.

# కార్యకర్తల కుటుంబాలకు అండగా టీడీపీ

అయ్యన్నపేట (చైతన్యరథం): ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా సౌకర్యాన్ని పార్టీ అధినేత చంద్రబాబు ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. విజయనగరం పట్టణం, 31వ డివిజన్ నటరాజ్ కాలనీకి చెందిన తెదేపా కార్యకర్త పెద్ద నూకరాజు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. శుక్రవారం అతడి కుటుంబాన్ని పరామర్శించి, పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన ప్రమాద బీమా రూ.5,00,000 వారి బ్యాంకు ఖాతాకు జమ చేశారు. ఒక మంచి ఆలోచన.. కష్టాల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు భరోసా ఇస్తుందన్నారు.

## ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజల నుండి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులకు చరవాణి నుండి ఆదేశించి, సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ప్రజలకు, పార్టీ శ్రేణులకు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష, అని ఇప్పటికే తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని, అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలే మా లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చారిత్రక ఘట్టం

**●గూగుల్ తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు, లోకేష్ దే : గురుమూర్తి**



విజయవాడ (చైతన్యరథం): విశాఖపట్నంకు గూగుల్ సెంటర్ రావటం చారిత్రక ఘట్టమని, ఇది ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికే సాధ్యపడిందని, గూగులు తీసుకొచ్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి పేర్కొన్నారు. 'గూగుల్ డేటా సెంటర్‌పై వైకాపా అధినేత జగన్ గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై శు క్రవారం గురుమూర్తి తీవ్రంగా స్పందించారు. వైకాపా హయాంలోనే గూగుల్‌కు పునాది వేశామంటున్న జగన్ చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని, గూగుల్ సెంటర్ ఏర్పాటుతో కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే జగన్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పైకి మాత్రం తాము గూగుల్ డేటా సెంటర్ను వ్యతిరేకించట్లేదని, సపోర్ట్ చేస్తున్నామని చెబుతూనే ఆ క్రెడిట్ అంతా మాదే అని చెప్పుకోవటానికి జగన్ ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఐటీ సిటీ, టెక్నాలజీ అభివృద్ధి అంతా దివంగత సీఎం వైయస్సార్‌దేనని చెప్పుకోవటం ఆయన రాజకీయ కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ఐటీ అభివృద్ధికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పునాదులు వేసింది చంద్రబాబేనని, ఆయన వల్లే ఐటీ రంగం బలోపేతమైందని యావత్ ప్రపంచమంతా కొనియాడుతుంటే జగన్ మాత్రం తన తండ్రే అభివృద్ధి చేశాడని చెప్పుకోవటం రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. నాడు కంప్యూటర్ కూడు పెడుతుందా అని గేలిచేసినవారు, నేడు ఐటీకి మేమే కృషి చేశామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాను గుజరాత్ సీఎంగా ఉండగా ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు ఐటీ రంగంలో గణనీయంగా సాధించిన ప్రగతిని స్ఫూర్తిగా తీసుకుని నాడు గుజరాత్లో ఐటీని అభివృద్ధి చేశానని ఎన్నోసార్లు చెప్పిన విషయం జగన్‌కు వినపడలేదా అంటూ నిలదీశారు. నేడు ప్రపంచంలోని ఐటీరంగంలో మన తెలుగువాళ్లు సత్తా చాటుతున్నారంటూ అది చంద్రబాబు విజన్‌తోనే సాధ్యమైందన్నారు. అన్యాయంగా చంద్రబాబును వైకాపా ప్రభుత్వం జైల్లో ఉంచితే ప్రపంచ దేశాల్లో ఉన్న తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐటీ ఉద్యోగులంతా సంఘీభావ ర్యాలీలు నిర్వహించిన విషయాన్ని జగన్ మర్చిపోతే ఎలా అంటూ మండిపడ్డారు.

## నిరుద్యోగులు ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్



గన్నవరం (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా గన్నవరంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వివియన్. కృష్ణమోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ఆదేశాల మేరకు పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఆఫీస్ అసిస్టెంట్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇస్తామని, వచ్చే నెలలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, నూతన సాంకేతికతను ఉపయోగించి, నిపుణుల ద్వారా శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉన్న పరిశ్రమలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. జిల్లాలో ఆసక్తి కలిగిన యువతీయువకులు ఈ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ తెలిపారు. ఈ కోర్సుకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతి యువకులు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు, పూర్తి వివరాలకు 9494005725 నెంబర్లో సంప్రదించి తమ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : చీఫ్ విప్ జీవీ



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. వినుకొండ నియోజకవర్గ ప్రజల కోసం చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు ప్రజా దర్బార్‌కు హాజరై వారి సమస్యలను చీఫ్‌విప్ జీవి ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపుతానని చీఫ్ విప్ జీవి పేర్కొన్నారు. వినుకొండ పట్టణముతోపాటు గ్రామాల్లో సిసి రోడ్లు, విద్యుత్తు, డ్రైన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వివిధ వర్గాల ప్రజలు విన్నవించారు. ఫిర్యాదులను పరిశీలించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి పాలనలో ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందని వివరించారు. సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తూ ప్రజా ప్రభుత్వంగా ప్రజల మన్ననలు పొందిందన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## సురక్ష యాప్‌తో కల్తీ మద్యానికి చెక్ : ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): క్యూఆర్ కోడ్ స్కాన్‌తో సురక్షితమైన మద్యం అందిస్తున్నామని, రాష్ట్రంలో పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలు చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక సెంటర్లోని వైన్స్ వద్ద సురక్ష యాప్ గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పాలన అందిస్తున్నట్లు తెలిపారు. మద్యం కొనుగోలు చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ సురక్ష యాప్ ద్వారా స్కాన్ చేసి మద్యం తీసుకోవాలని సూచించారు. వైసీపీ నాయకులు మద్యం విధానంపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలోని నకిలీ మద్యానికి బీజాలు పడినట్లు స్పష్టమైందని తెలిపారు.

## కల్తీ మద్యం నిందితుల్ని జైలుకు పంపిస్తాం : ఎమ్మెల్యే బోడే ప్రసాద్



విజయవాడ (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వంలో, వైకాపా నేతలు కల్తీ మద్యం తయారు చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన పరిస్థితి ప్రజలెవరూ మరచిపోలేదు, ప్రామాణ్యం ఉన్న ప్రమాణాలు కలిగిన మద్యం దుకాణాలలో దొరకకుండా నకిలీ మద్యంతో సొంత బ్రాండ్లు రూపొందించి ప్రజల ప్రాణాలు బలిగొన్న వైసీపీ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేస్తూ, తమ పార్టీ ఉనికిని కాపాడుకోవటం కొరకు ప్రయత్నిస్తుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ వైకాపా నేతలను విమర్శించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మద్యం దుకాణాలలో మద్యం సీసాలను పరిశీలనకు వెళ్ళిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కూటమి ప్రభుత్వంలో, మద్యం దుకాణాలలో, బార్ షాపులలో విక్రయించే మద్యం సీసాలపై సాంకేతికతతో రూపొందించిన QR చిహ్నం ద్వారా, వినియోగదారులకు మద్యం తయారీకి సంబంధించి పూర్తి వివరాలు తెలియపరుస్తున్నామని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. ఉద్దేశ్యపూర్వకంగా వైకాపా చేస్తున్న నిరాధార ఆరోపణలకు ముగింపు పలికేలా నూతన సాంకేతిక పరికరాన్ని కూడా మద్యం దుకాణాల్లో ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తద్వారా ఆండ్రాయిడ్ ఫోన్ లేని వారు కూడా మద్యం దుకాణాల్లో ఆ పరికరం ద్వారా మద్యం తయారు, కల్తీ సంబంధించి వివరాలు చూడవచ్చని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. దొంగే దొంగ అన్నట్లు వైకాపా పార్టీ నేతలు, కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని చూస్తున్నా, ఎవరైతే నకిలీ మద్యం తయారీలో భాగస్వాములుగా ఉన్నారో వారిపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటూ కూటమి ప్రభుత్వం పారదర్శకతను చేసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

## జగన్ ఏడుపులే కూటమి ప్రభుత్వానికి దీవెనలు : పాతర్ల రమేష్



అమరావతి (చైతన్యరథం): జగన్ ఏడుపులే కూటమి ప్రభుత్వానికి దీవెనలు అని, కూటమి ప్రభుత్వంపై చంద్రబాబుపై జగన్ విష ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు, లోకేష్ అవిశ్రాంతంగా విదేశీ పెట్టుబడుల కోసం కృషి చేస్తుంటే, ప్రతిపక్ష హోదా అడుకుంటున్న జగన్ రెడ్డి సొల్లు కబుర్లు, పచ్చిఅబద్ధాలతో విష ప్రచారం చేస్తూ 2 గంటలకు పైగా రికార్డు వీడియోతో ప్రజల సహనానికి పరీక్ష పెట్టాడని, ఎప్పటి లాగానే జగన్ రెడ్డి 2 గంటలకు పైగా చెప్పిన సోదిలో ఒక్క నిజం కూడా లేదని రమేష్ తీవ్రంగా విమర్శించారు. నిజం చెబితే తల వెయ్యి వక్కలు అవుతుందని, జగన్‌కు శాపం వల్ల కాబోలు జగన్ ఎప్పుడు నిజాలు మాట్లాడడని అన్నారు. గూగుల్ రాకపై నిజం జగన్ రెడ్డి సోది చెబుతున్నాడని ఆయన విమర్శించారు. హైదరాబాద్ ఐటీ విప్లవానికి ఆద్యుడు చంద్రబాబు అనే విషయం ప్రపంచం మొత్తానికి తెలుసు అని అన్నారు. శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకే మరలా మరలా శంకుస్థాపనలు చేసి ఆ ప్రాజెక్టును మేమే తెచ్చామని చెప్పుకుంటూ తిరిగే జగన్... 2019 జనవరి 12నే విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు అదాని గ్రూప్ ఒప్పందం చేసుకొని మొదటి అడుగు వేసిందని చంద్రబాబేనని అన్నారు. రాష్ట్రాన్ని ఏఐ డేటా హబ్ గా మార్చాలని తపనతో యువనేత లోకేష్ బాబు అహర్నిశలు కష్టపడుతుంటే ఆ కష్టాన్ని దోచేయాలని చూస్తున్నావని ఆయన విమర్శించారు. చెడ్డీల కంపెనీనే తరిమేసిన జగన్... గూగుల్ తెచ్చావంటే చిన్న పిల్లవాడు కూడా నమ్మడని ఆయన తెలిపారు. కంపెనీలకు తరిమి వేయడంతో పాటు రాష్ట్రంలో ఐటీ రంగాన్ని జగన్ సమాధి చేశాడని, ఐటీ ఎగుమతుల్లో దేశంలోనే ముందుండాల్సిన రాష్ట్రాన్ని అట్టడుగు చేర్చిన జగన్ నేడు గూగుల్ సంస్థ గురించి మాట్లాడేందుకు అర్హత కోల్పోయాడని ఆయన విమర్శించారు. వైసీపీ ముఠా మంట ఎందుకు ఏడుపు చూస్తుంటే ఆటో వెనుక రాశి క్యాప్షన్ ఒకటి గుర్తొస్తుందని, మీ ఏడుపులే మా కూటమికి దీవెనలు అని ఆయన గుర్తు చేశారు.

# కపటం లేని నాయకుడు మాలేపాటి

## సుబ్బానాయుడు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారాయణ, టీడీపీకి మాలేపాటి మృతి తీరనిలోటని నివాళి



దగదర్తి, (చైతన్యరథం): టీడీపీ సీనియర్ నాయకులు, ఏపీ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు హఠాన్మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు జిల్లా దగదర్తిలోని మాలేపాటి స్వగృహానికి రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ తో కలిసి మంత్రి నారాయణ శుక్రవారం వెళ్లి సుబ్బానాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి భాను చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుబ్బానాయుడు ఆలస్యమైనా కోలుకుని క్షేమంగా బయటకు వస్తారు అనుకున్నామని, ఇలాంటి విషాదకరమైన వార్త వినిపించడం తనకు ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. ఎంతో ఆత్మీయంగా ఉండే కుటుంబసభ్యుడిని కోల్పోయామని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ దగదర్తి మండల అధ్యక్షుడిగా, కావలి నియోజకవర్గ ఇన్ చార్జిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆయన తెలుగుదేశం పార్టీకి, ప్రజలకు అందించిన సేవలు ఎనలేనివన్నారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేయడమే గాక కపటం లేని నాయకుడిగా గుర్తింపు పొందారన్నారు.. ఆయన అన్న కుమారుడు, యువ నేత మాలేపాటి భాను మరణించడం బాధాకరమని, ఆయన మృతి చెందిన 24 గంటల్లో సుబ్బానాయుడు మృతి చెందడం అత్యంత విషాదకరమన్నారు. సుబ్బానాయుడు మరణం టీడీపీకి తీరనిలోటని.. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని, ఈ కష్టకాలంలో ఆయన కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.



# అన్నదాన సత్రాన్ని ప్రారంభించిన ఎంపీ మాగుంట

## పాల్గొన్న దర్శి టీడీపీ ఇన్చార్జి గొట్టిపాటి లక్ష్మి తదితరులు

దర్శి, (చైతన్యరథం): తాళ్ళూరు మండలం, తూర్పు గంగవరం గ్రామం, శ్రీ గుంటిగంగమ్మ దేవత దేవస్థానం వద్ద దేవస్థాన చైర్మన్ కొసనా గురుబ్రహ్మం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అన్నదాన సత్రాన్ని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. దర్శి టీడీపీ ఇంచార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ శాసనసభ్యులు నారపుశెట్టి పాపారావు, దేవస్థాన చైర్మన్ కొసనా గురుబ్రహ్మం వెంట ఉన్నారు. తాళ్లూరు మండల ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలోదర్శి మార్కెట్ కమిటీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, తాళ్లూరు, దర్శి మండలాల టీడీపీ అధ్యక్షులు మేడగం వెంకటేశ్వర రెడ్డి, మరెళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరు మండలం మరియు నియోజకవర్గం లోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# మానవతామూర్తి ముఖ్యమంత్రి చంద్రబాబు

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



పెన్నానది పరివాహక ప్రాంతాలకు రక్షణగా వున్న పొర్లు కట్టల తాత్కాలిక మమత్తులకు నిధులు కేటాయించి మానవత్వం చాటుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బురదను సైతం లెక్క చేయకుండా బుచ్చిరెడ్డి పాళెం మండలం జొన్నవాడ సమీపంలోని బాపనపాడు గ్రామం వద్ద ఇటీవల పడ్డ వర్షాలకు కోతకు గురైన కరకట్టను ఆమె పరిశీలించారు. 2021 లో పెన్నానదికి భారీ వరదలు వచ్చిన సందర్భంగా బాపనపాడు వద్ద పొర్లుకట్టకు గండి పడ్డ విషయాన్ని స్థానికులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ వరదల కారణంగా గండ్లు పడి ఊళ్లకు ఊళ్లు ముంపుకు గురైన గతనుభవాలు పునరావృత్తం కాకూడదన్న ఉద్దేశంతోనే కోవూరు నియోజకవర్గ పరిధిలోని పెన్నా పరివాహక ప్రాంత పొర్లు కట్టలకు తాత్కాలిక మరమత్తులు చేపట్టామన్నారు. ఈ నెల 28 న భారీ తుఫాను వస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యలో రేపటి నుంచే మర్మత్తుల పనులు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో కరకట్టల గండ్లు పూడ్చే పనులు నాసిరకంగా చేయబట్టే నేడు ఈ పరిస్థితి వచ్చిందనన్నారు. 15 లక్షలు వెచ్చించి చేయనున్న బాపనపాడు, మినగల్లు పొర్లుకట్టల తాత్కాలిక మరమ్మతులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రెడ్డి గా సూచించారు. సాగునీటి సంఘ అధ్యక్షులు, గ్రామ నాయకులు కరకట్టల మరమత్తు పనులను పర్యేక్షించాలని ఆమె పేర్కొన్నారు. బలహీనంగా వున్న పొర్లుకట్టలతో పెన్నా నది పరిసర గ్రామాలకు ముప్పు వుందని ప్రభుత్వం దృష్టికి తేగానే స్పందించి నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆమె ధన్యవాదాలు తెలియ చేసారు. అభివృద్ధి, సంక్షేమాలతో పాటు ప్రజల క్షేమం కోరే మానవతావాదిగా ఆమె సీఎం చంద్రబాబు నాయుడును అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మెన్ జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, జొన్నవాడ సర్పంచ్ కందికట్టు పెంచలయ్య, కాగులపాడు సర్పంచ్ సురేష్, స్థానిక నాయకులు శంకర్, ప్రసన్నకుమార్ రెడ్డి, సుధాకర్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# ఆవేదన కలిగించిన హఠాన్మరణాలు



## విచారం వ్యక్తం చేసిన చేజెర్ల

కోవూరు, (చైతన్యరథం): కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటీకూరు సమీపంలో తెల్లవారుజామున చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం లో దాదాపు 22 మంది మృత్యువాత పడటం బాధాకరమని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అందులో నెల్లూరు జిల్లా వింజమూరు మండలం చాకలకొండ పంచాయతీ పరిధిలోని గొల్లవారి పల్లెకు చెందిన రమేష్, అనూషతో సహా వారి ఇద్దరు చిన్నారులు మున్విత, మనీష్ తో సహా ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందటం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి పవిత్ర ఆత్మ కు శాంతి చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని భగవంతుని కోరుకుంటూ,వారి మృతికి సంతాపం తెలియచేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ఈ ప్రమాదంలో గాయపడి హాస్పటల్ లో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు.

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మాలెపాటి రవీంద్ర నాయుడు తనయుడు, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు మాలెపాటి భానుచందర్ గారి అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. భాను చందర్ మృతితో తెలుగుదేశం పార్టీ ఒక యువనాయకుడిని కోల్పోయిందన్నారు. ఆయన పవిత్ర ఆత్మ కు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం ప్రసాదించాలని భగవంతుని కోరుకుంటూ, వారి మృతికి సంతాపం తెలియచేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.




# గుండె తరుక్కుపోతోంది

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేశ్

వింజమూరు, (చైతన్యరథం): కర్నూలు రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన వింజమూరు మండలం గోళ్లవారిపల్లెకు చెందిన గోళ్ల రమేష్ కుటుంబ సభ్యుల బాధ వింటే గుండె తరుక్కుపోతోందని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన రమేష్ తండ్రి మాల కొండయ్యను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్తో కలిసి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఆయనకు ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో రమేష్, భార్య అనూషతో పాటు ఇద్దరు చిన్నారులు కూడా మృతి చెందటం కలచి వేసిందని చెప్పారు. ఇలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదు అని అన్నారు. కోల్పోయిన వ్యక్తిని తిరిగి తీసుకురాలేమని కానీ ఆ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా తప్పకుండా తాము సహాయం చేసేందుకు ముందుంటామని వెల్లడించారు. మాల కొండయ్యను చూస్తుంటే గుండె బరువెక్కుతోందని చెమర్చిన కళ్ళతో చెప్పారు. ప్రభుత్వం కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తాము ఆర్థిక సహాయం చేయగలమని, కానీ ఆ కుటుంబానికి మానసిక ధైర్యం ఊరి ప్రజలు అందించాలన్నారు. బస్సు యాజమాన్యాలు ఇలాంటి విషయంలో తప్పకుండా దృష్టి సారించాలన్నారు. బస్సుల ఫిట్నెస్, డాక్యుమెంట్స్, అనుమతులు తప్పకుండా ఉండాలన్నారు. నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, ఉదయగిరి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బస్సు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త గోళ్ల రమేష్ కుటుంబం దుర్మరణం

## మంత్రి లోకేష్ చొరవతో గంటల వ్యవధిలోనే బీమా సొమ్ము మంజూరు

**అమరావతి, (చైతన్యరథం):** కార్యకర్తలకు కష్టమొస్తే క్షణం ఆలోచించకుండా సాయమందించడం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నైజం. కర్నూలు జిల్లా చినటేకూరు వద్ద ఈరోజు ఉదయం జరిగిన బస్సు దుర్ఘటనలో నెల్లూరుజిల్లా చాకలికొండకు చెందిన తెలుగుదేశం కార్యకర్త గోళ్ల రమేష్, అతని భార్య అనూష, వారి ఇద్దరు పిల్లలు కూడా దుర్మరణం పాలయ్యారు. పార్టీ యంత్రాంగం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న లోకేష్ దృష్టికి ఈ విషయాన్నితీసుకెళ్లగా, తీవ్ర ఆవేదన చెందిన యువనేత లోకేష్ తక్షణమే వారి కుటుంబానికి వెంటనే సాయం అందేలా చూడాలని ఆదేశించారు. లోకేష్ ఆదేశాలు అందుకున్న వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయం సిబ్బంది రంగంలోకి దిగి ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో సంప్రదించారు.

# భూమి సమస్యలను సత్వరం పరిష్కరించండి

**రామగిరి మండల అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే పరిటాల సునీత, సరైన వివరాలతో రాకపోవడంపై ఎమ్మెల్యే సునీత ఆగ్రహం**




రాప్తాడు, (చైతన్యరథం): రామగిరి మండలంలోని భూ సమస్యలకు, వివాదాలకు వెంటనే పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. రామగిరి మండలానికి సంబంధించిన అన్ని శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ లో ఉన్న పనులు, ప్రజా సమస్యల మీద సుదీర్ఘంగా చర్చించారు. కొన్ని శాఖల అధికారులు సరైన వివరాలతో రాకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక సమావేశానికి హాజరయ్యేటప్పుడు అధికారుల వద్ద సమగ్రమైన సమాచారం ఉండాలన్నారు. మండలంలో ఎన్ని ఎకరాల భూములకు సరిఅయిన రికార్డులు ఉన్నాయి. ఎన్ని ఎకరాలకు రికార్డులు సరిగా లేవన్న విషయంపై చర్చించారు. దీనిని వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే భూముల స్వాధీనంలో ఒకరు ఉంటే, రికార్డుల్లో మరొకరి పేరు ఉందని ఇలాంటి తప్పిదాలు చాలా జరిగాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ ప్రాజెక్టుల కోసం సాగులో లేని భూములను సేకరించాలని సూచించారు. ఇప్పటివరకు ఎన్ని ఎకరాలు సేకరించారన్నదానిపై చర్చించారు. రేషన్ కార్డుల విషయంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఉండాలన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో పురోగతి గురించి చర్చించారు. ఇప్పటివరకు ఎంతమందికి ఇళ్ల పట్టాలిచ్చారు.. అందులో ఎంతమంది ఇళ్లు నిర్మించుకున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవలం పట్టాలు తీసుకున్న వారు, అర్హత లేని వారికి పట్టాలు ఇవ్వడం వంటివి గుర్తించాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు అందేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో కమ్యూనిటీ హాల్స్, రోడ్లు, కల్వర్టుల నిర్మాణం గురించి చర్చించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఇంకా అర్హత ఉండి కూడా రాని వారి వివరాలు గురించి తెలుసుకున్నారు. నవంబర్ నెలలో వారికి డబ్బు జమవుతుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.

మహిళా సంఘాల సభ్యులకు ఎంత మేర రుణాలు ఇచ్చారన్నది ఆరా తీశారు. అలాగే సరిగా పనిచేయని యానిమేటర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ తరపున 68 ట్రాన్స్ఫార్మర్లు మంజూరు చేయాల్సిఉందన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఉన్న అన్ని రకాల పనులు వేగంగా జరగాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రులలో కూర్చోవడానికి పేషెంట్లకు కుర్చీలు లేకపోవడం ఇతర సమస్యలు పరిష్కరించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. వచ్చే సమావేశానికి అధికారులంతా సమగ్రమైన వివరాలతో రావాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు.



## ఎగువ సగిలేరులో జలకళ

కలసపాడు, (చైతన్యరథం0: మండలంలోని ఎగువ సగిలేరులో జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులుగా ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు శుక్రవారం ఎగువ సగిలేరుకు వరద నీరు చేరుతోంది. ఎగువ నుంచి 1000 క్యూసెక్కులకు పైగా నీరు చేరుతోందని నీటిపారుదల శాఖ ఏఈ సృజని తెలిపారు. 250 క్యూసెక్కుల నీటిని పీటీఎస్ కాలువకు, మరో 700 క్యూసెక్కుల నీటిని దిగువ సగిలేరుకు వదిలామని తెలిపారు.

## పర్యాటక కేంద్రంగా రాయదుర్గం

రాయదుర్గం, (చైతన్యరథం): అనంతపురం జిల్లా రాయదుర్గం పట్టణంలో రూ.2 కోట్లతో నిర్మించిన జయంతి రుద్రయ్యశెట్టి నూతన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాయదుర్గం పట్టణాన్ని పర్యాటకంగా, సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాయి. రాజశేఖర్, ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.





## బాలకృష్ణపై నోరు పారేసుకుంటే నాలుక కోస్తా

**నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హెచ్చరిక**




నెల్లూరు, (చైతన్యరథం): నందమూరి బాలకృష్ణ పై జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆయన సైకోతనానికీ నిదర్శనం అని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మండిపడ్డారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు జగన్ మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీచ సంస్కృతి, రౌడీ సంస్కృతి దోపిడీ, దౌర్జన్య సంస్కృతితో రాష్ట్రాన్ని దోచుకొని రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. 50 సంవత్సరాల సుదీర్ఘ కళామతల్లి సేవలో చరిత్ర సృష్టించిన బాలకృష్ణను విమర్శిస్తే, ఆకాశం మీద ఉమ్మి వేసినట్లే అని కోటంరెడ్డి అన్నారు. జగన్ ముందు తన మానసిక పరిస్థితి తెలుసుకోవాల్లని సూచించారు. జగన్ కంటే దొంగ, దోపిడీ దారుడు ఎవ్వరూ ఉండరని వ్యాఖ్యానించారు. "జె బ్రాండ్" మద్యంతో పేదల బతుకులు బుగ్గి చేసిన ద్రోహి దుర్మార్గుడు జగన్ అంటూ ధ్వజమెత్తారు. గౌరవప్రదమైన విశిష్టమైన ప్రెసిడెంట్ మెడల్ పేరును నీ "జె బ్రాండ్" మందుకు పెట్టావంటే అంతకంటే సైకోతనం ఎక్కడన్నా ఉంటుందా అంటూ ప్రశ్నించారు. బాలకృష్ణ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్ మోహన్ రెడ్డి పై స్పీకర్ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి అసెంబ్లీలో బూతుల సంస్కృతిని తీసుకువచ్చిన దరిద్రుడు జగన్ అంటూ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఎన్టీఆర్ బిడ్డ భువనేశ్వరమ్మను నిండు సభలో వైసీపీ ఎమ్మెల్యేలు అవమానకరంగా మాట్లాడినప్పుడు గాడిదలు కాస్తున్నావా అంటూ ప్రశ్నించారు. ఆడవారి పట్ల అసభ్యకరంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యేలను ప్రోత్సహించిన దరిద్రమైన క్యారెక్టర్ జగన్ అంటూ వ్యక్తం చేశారు. ఆస్తి కోసం కన్న తల్లిని తోడబుట్టిన చెల్లిని రోడ్డున పడేసి.. ఎంతోమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను దారుణంగా హత్య చేయించిన నరరూప రాక్షసుడు జగన్ అంటూ మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో పెట్టుబడులు సేకరించడానికి, పరిశ్రమలు తేవడానికి నిద్రాహారాలు మాని పనిచేస్తుంటే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు జగన్ సైంధవుడిలా ఉన్నాడని విమర్శించారు. రాష్ట్ర పరిపాలన చేతకాని దద్దమ్మ జగన్మోహన్ రెడ్డి అని.. అలాంటి వ్యక్తి బాలకృష్ణుడు విమర్శిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. మరోసారి బాలకృష్ణపై నోరు జారితే తాము చూస్తూ ఊరుకోమని.. హెచ్చరించారు. అధికారం కోల్పోయేసరికి జగన్కు పిచ్చి పట్టిందని విమర్శించారు. హస్త ప్రజలు ఓట్లే ఇస్తే కనీసం అసెంబ్లీకి కూడా పోని జగన్ మరోసారి బాలకృష్ణపై అవాకులు చవాకులు మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు.

## మద్యం యాప్పై ప్రచారం

**గుంతకల్లులో వైన్షాపులు సందర్శించిన గుమ్మనూరు ఎమ్మెల్యే సోదరుడు**

గుంతకల్లు, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టినటువంటి మద్యం యాప్ గురించి గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుంతకల్లు పట్టణ అధ్యక్షుడె గుమ్మనూరు నారాయణస్వామి గుంతకల్లు పట్టణంలో ప్రచారం చేశారు. వైన్స్ షాప్ దగ్గరికి వెళ్లి మద్యం ప్రియులకు గవర్నమెంట్ ప్రవేశపెట్టిన యాప్ ద్వారా క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేయడంతో మద్యం బాటిల్ ఎప్పుడు తయారైనది ఏ షాపులో విక్రయిస్తున్నారనేది తెలుస్తుందన్నారు. మద్యం ధర, మద్యం బాటిల్ నాణ్యతను గురించి ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ పట్టణ మరియు గుంతకల్లు మండలం కూటమి కుటుంబ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి నివాసంలో తేనేటి విందుకు హాజరైన ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, వారి వెంట ఉన్న డాక్టర్ జెడ్ శివ ప్రసాద్



# సీజేఐ నియామక ప్రక్రియ ప్రారంభం

**సీనియర్‌గా జస్టిస్ సూర్యకాంత్‌కు అవకాశం**

భారత నూతన ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) నియామక ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రారంభించింది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ పదవీ కాలం నవంబరు 23న ముగియనుంది. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐ పేరును సూచించాలంటూ జస్టిస్ గవాయ్‌కు ప్రభుత్వం లేఖ రాసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సీజేఐ పదవీ విరమణకు నెల రోజుల ముందుగా తదుపరి ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియను ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోంది. సాధారణంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో అత్యంత సీనియర్లు ఈ పదవి వరిస్తుంది. దీని ప్రకారం జస్టిస్ సూర్యకాంత్‌కు అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఆయన నియామకానికి రాష్ట్రపతి ఆమోదం లభిస్తే.. 53వ భారత ప్రధాన న్యాయమూర్తిగా నవంబరు 24న ప్రమాణం చేస్తారు. 2027 ఫిబ్రవరి 9 వరకు పదవిలో కొనసాగుతారు. జస్టిస్ సూర్యకాంత్ హరియాణాలోని హిస్సార్ జిల్లాలో 1962 ఫిబ్రవరి 10న మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

## వాణిజ్య ఒప్పందాల్లో ఎవరికీ తలవంచం

**కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ స్పష్టీకరణ**

అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం రెండు దేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్ ఎవరి ఒత్తిడికి తలొగ్గదని, హడావిడి నిర్ణయాలు తీసుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. జర్మనీ రాజధాని, బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఉన్నతస్థాయి సమావేశంలో కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారత్ పలు వ్యూహాత్మక విధానాలను అనుసరిస్తోందన్నారు. కొవిడ్ మహమ్మారి వల్ల ప్రపంచ దేశాల మధ్య ఏర్పడిన అంతరాయాల తర్వాత 2021లో భారతదేశ వాణిజ్య విధానంలో వచ్చిన మార్పును పీయూష్ గోయల్ గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలోనే భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఒంటరిగా ఉండకూడదని ప్రపంచ దేశాలతో విశ్వసనీయ సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య సంబంధాలు ఏర్పరుచుకుంటోందని తెలిపారు. దీనివల్ల సాంకేతికత, పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్లు వంటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. ఈ విధంగా భారత్ వాణిజ్య ఒప్పందాలకు కట్టుబడి ఉందని కానీ ఒత్తిడితో మాత్రం చర్చలు జరపదని స్పష్టం చేశారు. ఇప్పటికే భారత్‌పై ఉన్న సుంకాలను అంగీకరిస్తున్నాం కదా అనే కారణంతో మరిన్ని సుంకాలను వేస్తామని బెదిరిస్తే.. ప్రత్యామ్నాయ మార్గాలు, కొత్త మార్కెట్లను వెతుక్కోవాల్సి వస్తుందని పీయూష్ గోయల్ పేర్కొన్నారు.

# మా సీఎం అభ్యర్థి నితీశ్

**బీహార్ ఎన్నికల ప్రచార ప్రారంభ సభలో ప్రధాని మోదీ ప్రకటన**



బీహార్ అసెంబ్లీ ఎన్నికలను అటు ఎన్డీయే, ఇటు ఇండియా బ్లాక్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీ శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సమస్తీపూర్ జిల్లాలోని కర్పూరీ గ్రామం అందుకు వేదికయింది. బిహార్ మాజీ సీఎం, దివంగత నేత కర్పూరీ ఠాకూర్‌కు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను కలిశారు. ఈ సందర్భంగా రోజ్‌గార్ మేళానుద్దేశించి ప్రసంగించారు. "యువతకు సాధికారత కల్పించడమే మా కూటమి ప్రాధాన్యం. ఫెస్టివల్ సీజన్లో ఆఫర్ లెటర్స్ అందుకోవడం వేడుకలను రెట్టింపు చేస్తుంది. ఈ రోజు 51 వేల మంది యువత ఆ ఆనందాన్ని పొందుతున్నారు. అది నాకు ఆనందాన్నిస్తోంది. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారికి అభినందనలు" అని మోదీ అన్నారు. "తమ నాయకుడు తేజస్వీ యాదవ్ అని మరి మీ నేత ఎవరు" అంటూ ఇండియా బ్లాక్ ప్రశ్నించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ మాట్లాడుతూ.. "నితీశ్ కుమార్ నాయకత్వంలో ఎన్డీయే కూటమి అన్ని రికార్డులను బ్రేక్ చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తుంది" అని వెల్లడించారు. అధికార కూటమి సీఎం అభ్యర్థి నితీశ్ అని మోదీ చెప్పడం ఇదే. తొలిసారి కావడం గమనార్హం. బిహార్ రాజకీయాల్లో కులం కీలక పాత్ర పోషిస్తుంది. ఎన్నికల ఫలితాలు నిర్ణయించడం లోనూ కుల సమీకరణాలదే ముఖ్య భూమిక, ఈ పరిస్థితిని మార్చేందుకు కొన్ని దశాబ్దాల క్రితమే పోరాడిన నేత కర్పూరీ ఠాకూర్, తన ఊరు పితాంఝియాలో కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. అట్టడుగున ఉన్నవారిని రాజకీయంగా చైతన్య పరిచారు. ముఖ్యమంత్రి స్థాయికి చేరినా పూరి గుడిసెలోనే ఉండేవారు. బిహార్‌కు రెండు పర్యాయాలు (డిసెంబరు 1970 నుంచి జూన్ 1971 వరకు, డిసెంబరు 1977 నుంచి ఏప్రిల్ 1979 వరకు) సీఎంగా సేవలందించి తన పాలనా దక్షతతో జన నాయక్‌గా చెరగని ముద్ర వేసుకున్నారు. గతేడాది ఆయన శత జయంతి వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నతో గౌరవించింది.

## ఐక్యరాజ్య సమితిలో మార్పులు జరగాలి

**భారత విదేశాంగమంత్రి జై శంకర్ పిలుపు**



భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఐక్యరాజ్య సమితి నిర్ణయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించలేవని వ్యాఖ్యానించారు. ఐరాస 80వ వార్షికోత్సవం నేపథ్యంలో పోస్టల్ స్టాంపు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వివాదాల యుగంలో శాంతి అనేది అవసరమని జై శంకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్తోందన్నారు. ఈ క్రమంలో యూఎన్లో అంతా సరిగా లేదన్నారు. ఐరాసలో అర్థవంతమైన సంస్కరణలు జరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది అత్యవసరమైనప్పటికీ, యూఎన్‌లో మార్పులు జరిగేలా ఆ సంస్కరణలు ఉండాలన్నారు. ఐరాసకు భారత్ ఎప్పుడూ బలమైన మద్దతుదారుగానే ఉంటుందని, అలాగే కొనసాగుతుందని తెలిపారు. కానీ, యూఎన్ నిర్ణయాలు దాని సభ్యత్వాన్ని, ప్రపంచ ప్రాధాన్యాలను ప్రతిబింబించవని వ్యాఖ్యానించారు. ఇటీవల మైనారిటీల రక్షణకు, భావ ప్రకటన, మీడియా స్వేచ్ఛా హక్కులు కాపాడేందుకు భారత్ సమర్థమంతమైన చర్యలు తీసుకోవాలంటూ ఐరాస మానవ హక్కుల కమిషన్ ప్రస్తుత చైర్మన్‌గా ఉన్న స్విట్జర్లాండ్ వ్యాఖ్యానించింది. దీనికి భారత్ దీటుగా బదులిచ్చింది. ఆ దేశం జాత్యహంకారం, క్రమబద్ధమైన వివక్ష, విదేశీయులపై విద్వేషం వంటి అంతర్గత సవాళ్లను ఎదుర్కొంటున్న విషయాన్ని ప్రస్తావించింది. ముందు వాటిని పరిష్కరించుకోవడంపై దృష్టిపెట్టాలని సూచించింది. మరోవైపు, పహల్గాంలో పౌరులపై జరిగిన ఉగ్రదాడిని ప్రపంచవ్యాప్తంగా ఖండించినప్పటికీ, పాకిస్థాన్ తన వక్రబుద్ధిని మార్చుకోలేదు. యూఎన్ సమావేశాల్లో పదేపదే కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పాటు భారత్‌పై నిందలు మోపే ప్రయత్నాలు చేస్తోంది. అయితే, భారత్ వీటిని ఎప్పటికప్పుడు తిప్పికొడుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో జై శంకర్ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇక, గురువారం యూఎన్లో జరిగిన సమావేశాల్లో పాక్ దౌత్యవేత్తలు ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. భారత్ వీటిని తీవ్రంగా వ్యతిరేకించింది.

## తమిళనాడులోనూ ఓటరు జాబితా సమగ్ర సవరణ

**వారం రోజుల్లో ప్రారంభం: సీఈసీ వెల్లడి**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తమిళనాడులోనూ నిర్వహించనున్నారు. రాష్ట్రంలో ఒక వారంలో ఎస్ఐఆర్ ప్రారంభం అవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం మద్రాస్ హైకోర్టుకు తెలిపింది. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్ శాసనసభలకు 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా ఎస్ఐర్ నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ఇది వరకే వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న బిహార్లో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయింది. 22 ఏళ్ల విరామం తర్వాత అక్కడ ఈ సవరణ చేపట్టారు. దానిపై విపక్షాలు విమర్శలు చేశాయి. ఎస్ఐఆర్ పేరుతో బిహార్లో పెద్ద ఎత్తున ఎన్నికల రిగ్గింగ్ జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈసీ ఉద్దేశపూర్వకంగా ఓటర్లను తొలగిస్తోందని ఆ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడిన సంగతి తెలిసిందే.

## కర్నూలు బస్సు ప్రమాదం
# కలిచివేసింది
## రాష్ట్రపతి ప్రధాని దిగ్భ్రాంతి



కర్నూలు జిల్లాలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఘోర ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో పలువురు సజీవదహనమయ్యారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం జరగడం తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ముర్ము విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ విపత్కర సమయంలో నా ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించే, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా" అని ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50వేలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక, ఈ ఘటనపై ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపంతెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలన్నారు. "హైదరాబాద్–బెంగళూరు హైవేపై జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా. ఇలాంటి ఘటనలతో ప్రజా రవాణాలో భద్రతా ప్రమాణాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రయాణికుల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ ఘటనల్లో బాధ్యులను నిర్ధరించడం అత్యావశ్యకం" అని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

# మొదలైన ఆంక్షల ఎఫెక్ట్

## - భారీగా పెరిగిన సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు



రష్యా ప్రధాన చమురు సంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ముడిచమురు కొనుగోలుదారులు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టడంతో.. రవాణా చేసే సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు అమాంతం పెరగడం గమనార్హం. మధ్య ప్రాచ్యం- చైనామార్గంలో ఈ ట్యాంకర్ల ఛార్జీలు ఒక్కరోజే 16 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. పుతిన్ అనుచితంగా చేస్తున్న యుద్ధానికి ప్రతిగా రష్యాలోని అతి పెద్ద చమురు కంపెనీలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై ఆంక్షలను విధిస్తున్నట్టు అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ బుధవారం ప్రకటించారు. దీంతో ఈ సంస్థలనుంచి ప్రధానంగా చమురు కొనుగోలు జరుపుతోన్న భారత, చైనీస్ రిఫైనరీలు అప్రమత్తమయ్యాయి. రష్యా చమురు కొనుగోలు తగ్గించుకోవాలని ఈ కంపెనీలు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అదే సమయంలో డిమాండుకు అనుగుణంగా చమురు దిగుమతి కోసం మధ్యప్రాచ్యంవైపు చూస్తున్నట్టు సమాచారం. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యం-చైనామార్గంలో త్వరలో ముగియనున్న ఫ్రీట్ అగ్రిమెంట్లకు సంబంధించి సూపర్ ట్యాంకర్ల ఛార్జీలు గురువారం 16శాతం పెరిగినట్టు బాల్టిక్ ఎక్స్ఛేంజ్ డేటా వెల్లడించింది. ట్యాంకర్ల ఛార్జీలు ఈ స్థాయిలోకి రావడం 2023 తర్వాత మళ్లీ ఇప్పుడే కావడం గమనార్హం. డిసెంబరు కాంట్రాక్టులకు సంబంధించిన ఛార్జీలు కూడా దాదాపు 13శాతం పెరిగినట్టు తెలుస్తోంది.

రష్యా కంపెనీలు, వాటికి అనుబంధంగా పనిచేసే డజన్ల కొద్దీ కంపెనీలపైనా ఆంక్షలు అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. అటు ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఇవన్నీ నవంబరు 21నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ డేటా ప్రకారం.. రష్యా ఆగస్టులో ప్రతి రోజూ 7.3 మిలియన్ బ్యారెల్ల ఇంధనాన్ని ఎగుమతి చేసింది. ప్రపంచ ముడిచమురు, రిఫైన్డ్ ఇంధన వినియోగంలో ఇది దాదాపు 7శాతానికి సమానం కావడం గమనార్హం.

# కెనడాతో వాణిజ్య చర్చలకు బ్రేక్

## టారిఫ్ యాడ్స్‌పై అమెరికా గుస్సా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాతో నడుస్తోన్న వాణిజ్య చర్చలను నిలిపివేశారు. యూఎస్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ ఆ దేశం ఇచ్చిన ప్రకటనలే అగ్రరాజ్య అధ్యక్షుడి ఆగ్రహానికి కారణమైంది. ఇది దారుణమైన ప్రవర్తన అని సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్ పెట్టారు. "అమెరికా జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థకు సుంకాలు చాలా ముఖ్యం. వారు దారుణమైన ప్రవర్తన కారణంగా కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసుకుంటున్నాం" అని తన పోస్టులో పేర్కొన్నారు. కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ప్రీమియర్ డగ్ ఫోర్డ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. "ఒంటారియో కొత్త ప్రకటన ప్రచారం ప్రారంభించింది. మాపై అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా మా ప్రచారాన్ని కొనసాగిస్తాం. అందుబాటులో ఉన్న ప్రతీ సాధనాన్ని ఉపయోగిస్తాం. కలిసి పనిచేయడమే ఇరువర్గాల శ్రేయస్సుకు మంచి మార్గం" అని రాసుకొచ్చారు. మరోవైపు, అమెరికాలో సుంకాలతో ముప్పు పొంచి ఉన్నందున ఆ దేశాన్ని దాటి మిగతా దేశాలతో ఎగుమతులు పెంచుకోవాలనుకుంటున్నట్టు కెనడా ప్రధాని మార్క్ కార్నీ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ట్రంప్ మండిపడ్డారు. వాణిజ్య చర్చల నిలిపివేతపై ప్రకటన చేశారు.

రష్యా కంపెనీలు, వాటికి అనుబంధంగా పని చేసే డజన్ల కొద్దీ కంపెనీలపైనా ఆంక్షలు అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. అటు ఈయూ కూడా ఆర్థిక ఆంక్షలు విధించింది. ఇవన్నీ నవంబరు 21నుంచి అమల్లోకి వచ్చే అవకాశముంది. అంతర్జాతీయ ఇంధన ఏజెన్సీ డేటా ప్రకారం.. రష్యా ఆగస్టులో ప్రతి రోజూ 7.3 మిలియన్ బ్యారెళ్ల ఇంధనాన్ని ఎగుమతి చేసింది. ప్రపంచ ముడిచమురు, రిఫైన్డ్ ఇంధన వినియోగంలో ఇది దాదాపు 7శాతానికి సమానం కావడం గమనార్హం.

# అల్లాడుతున్న జనం!

**- పాక్ -ఆఫ్ఘాన్ సరిహద్దుల్లో బతుకు కష్టాలు**

**- కిలో టమాటా ధర రూ.600లు అట**

పాకిస్థాన్-అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొనడంతో అక్టోబర్ 11నుంచి ఇరుదేశాల సరిహద్దులను మూసివేశారు. దీంతో పాక్- అఫ్గాన్ ప్రజలపై తీవ్ర ప్రభావం పడింది. బోర్డర్ మూసివేతవల్ల ఇరుదేశాల్లో పండ్లు, కూరగాయలు, ఖనిజాలు, ఔషధాలు, గోధుమలు, బియ్యం, చక్కెర, మాంసం, పాల ఉత్పత్తులు వంటి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ఘర్షణలకు ముందుతో పోలిస్తే పాక్‌లో టమాటా ధరలు ఐదు రెట్లు పెరిగినట్టు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం కిలో టమాటాల ధర 600 పాకిస్థానీ రూపాయలున్నట్టు తెలుస్తోంది. అఫ్గాన్‌నుంచి అధికంగా దిగుమతి చేసుకునే ఆపిల్ ధరలు కూడా భారీగా పెరిగినట్టు సమాచారం. సాధారణంగా పాక్- అఫ్గాన్ సరిహద్దునుంచి ఏటా ఇరుదేశాల మధ్య 2.3 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతుందని.. ఇరుదేశాల మధ్య ఘర్షణలు చెలరేగడంతో బోర్డర్లలో వాణిజ్యం, రవాణా సదుపాయాలు పూర్తిగా నిలిపివేశామని కాబుల్‌లోని పాక్-అఫ్గాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధిపతి ఖాన్ జాన్ అలోకోజాయ్ వెల్లడించారు. దీనివల్ల రోజుకు ఇరువైపులా దాదాపు ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8 కోట్లు) నష్టం వాటిల్లుతుందన్నారు. అఫ్గాన్‌నుంచి పాక్కు సరఫరా చేసే దాదాపు 5 కంటైనర్ల కూరగాయలు పాడైనట్టు తెలిపారు. సరిహద్దుకు ఇరువైపులా దాదాపు 5వేల కంటైనర్లు నిలిచిపోయాయని పాకిస్థాన్‌లోని ప్రధాన టోర్ఖమ్




సరిహద్దు క్రాసింగ్ వద్ద ఉన్న ఓ అధికారి పేర్కొన్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. గత కొన్ని రోజులుగా రెండు దేశాల సరిహద్దుల్లో తీవ్ర ఘర్షణలు, దాడులు జరిగి పలువురు సైనికులు, పౌరులు, ఉగ్రవాదులు మరణించారు. ఈ నేపథ్యంలో గతవారం ఖతార్లోని దోహాలో పాక్, అఫ్గాన్ రక్షణ మంత్రులు ఖ్వాజా ఆసిఫ్, ముల్లా యాకుబ్ మధ్య చర్చలు జరిగాయి. ఇందులోభాగంగా ఇరుదేశాలు కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించాయి. అయితే సరిహద్దు వాణిజ్యం మాత్రం ఇంకా తెరుచుకోలేదు. ఇరుదేశాల మధ్య తదుపరి రౌండ్ చర్చలు అక్టోబర్ 25న ఇస్తాంబుల్‌లో జరగనున్నాయి.

## ప్రాథమిక హక్కులపై పాక్ దాడి

**ఉగ్రవాద నిరోధక చట్టాలను దుర్వినియోగం చేస్తోంది**

**ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆందోళన**




ఉగ్రవాద నిరోధక చట్టాలను పాక్ దుర్వినియోగం చేస్తోందని మానవహక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' ఆందోళన వ్యక్తం చేసింది. చట్టాలను బలోచ్ ఉద్యమకారుల అణచివేతకు వాడుతోందన్నది ఆమ్నెస్టీ ఆరోపణ. 1997 ఉగ్రవాద నిరోధక చట్టం కింద బలోచ్‌కు చెందిన 32మందిని పాక్ తన వాచ్‌లిస్టులో చేర్చడాన్ని తప్పుబట్టింది. వారిలో ప్రత్యేక దేశం కోసం పోరాడే వారిని కూడా చేర్చిందని.. ఇది వారి హక్కులను పూర్తిగా కాలరాయడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమ్నెస్టీ దక్షిణాసియా రీజనల్ డైరెక్టర్ బాబూరామ్ మాట్లాడుతూ.. ప్రత్యేక దేశం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న బలోచ్ ప్రజలను పాక్ ఉగ్రవాదులుగా చిత్రీకరిస్తోందన్నారు. దీనివల్ల వారి స్వేచ్ఛ, గోప్యత, ఉద్యమానికి సంబంధించిన ప్రాథమిక హక్కులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు..

పాక్ తన వాచ్‌లిస్టులో పలువురు మహిళా బలోచ్ కార్యకర్తల పేర్లనూ చేర్చి.. హద్దులను దాటిందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనివల్ల వారు కఠినమైన పర్యవేక్షణ, ప్రయాణ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని, వారి బ్యాంకు ఖాతాలు కూడా ఫ్రీజ్ అవుతాయని పేర్కొంది. బలోచ్ ఉద్యమకారులకు వ్యతిరేకంగా పాక్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం కూడా వారికి లేకుండా ఉండేందుకు ఉగ్రవాద నిరోధక చట్టాలను ఉపయోగిస్తోందని తెలిపింది. పాక్ చేస్తున్న ఇటువంటి కుట్రలను అడ్డుకోవాలంటే అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు అనుగుణంగా ఆ దేశం ఉగ్రవాద నిరోధక చట్టాలను సవరించాలని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. బలోచిస్థాన్ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయడం కోసం బలోచ్ లిబరేషన్ ఆర్మీ ఏర్పడింది. పాక్‌లోని అత్యధిక ఖనిజ నిల్వలున్న ప్రావిన్స్‌గా బలోచిస్థాన్‌ను పేర్కొంటారు. ఇక్కడ చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజవాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. దీంతో ప్రత్యేక దేశం కోసం బలోచ్ ప్రజలు దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

**మూన్‌లైటింగ్‌కు పాల్పడుతూ**

# భారతీయుడి అరెస్ట్

**- అమెరికాలో 15ఏళ్ల జైలుకు అవకాశం**



భారత సంతతికి చెందిన మెహుల్ గోస్వామి 'మూన్‌లైటింగ్' అభియోగాలపై అమెరికాలో అరెస్టయ్యాడు. ఒక వ్యక్తి సాధారణ ఉద్యోగ సమయం తర్వాత కూడా మరో ఉద్యోగం చేయడాన్ని మూన్‌లైటింగ్ అంటారు. న్యూయార్క్‌వాసి గోస్వామి న్యూయార్క్ స్టేట్ ఆఫీస్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. ఇది అతడి ప్రాథమిక ఉద్యోగం. ఈ సమయంలో అతడు మాల్టాలోని గ్లోబల్ ఫౌండ్రీస్ సెమీకండక్టర్ కంపెనీలో కాంట్రాక్టర్ కూడా విధులు నిర్వహిస్తున్నాడు. 2022నుంచి అతడు ఇందులో కాంట్రాక్టర్‌గా ఉన్నాడు. ఈ-మెయిల్ ఆధారంగా గోస్వామి మూన్‌లైటింగ్‌కు పాల్పడుతున్నట్టు అధికారులు గుర్తించారు. రాష్ట్ర నిధుల్లోంచి దాదాపు రూ.44 లక్షలు దొంగతనం కూడా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తించాల్సిన సమయంలోనే.. ప్రైవేటు కంపెనీ కోసం పనిచేస్తుండటంతో అక్టోబరు 15న అధికారులు అతడిని అరెస్టు చేశారు. 'నిజాయతీగా సేవ చేసేందుకే ప్రభుత్వ ఉద్యోగులకు ఆ బాధ్యతలు అప్పగిస్తారు. గోస్వామి దాన్ని తీవ్రంగా ఉల్లంఘించాడు. రాష్ట్రం కోసం పనిచేస్తున్నా అని చెప్పుకుంటూ.. మరో కంపెనీ కోసం పూర్తి సమయం కేటాయించాడు. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో సహా ప్రజా వనరులను దుర్వినియోగం చేయడమే' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ లూసీ లాంగ్ వ్యాఖ్యానించారు. ఇటీవల అధికారులు గోస్వామిని కోర్టులో హాజరుపరచగా.. అతడు బెయిల్ లేకుండానే విడుదలయ్యాడు. అయితే, కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుంది. ఇందులో నేరం రుజువైతే అతడికి 15 ఏళ్లు జైలు శిక్ష పడుతుంది. ఇక, గోస్వామి అరెస్టు నేపథ్యంలో మూన్‌లైటింగ్ గురించి మరోసారి చర్చ జరుగుతుంది.

స్పోర్ట్స్
చైతన్యరథం



# స్మృతి ప్రపంచ రికార్డు

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ స్మృతి మంధన రికార్డు సృష్టించింది. మహిళల అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక సెంచరీలు చేసిన ప్లేయర్‌గా ఆసీస్ దిగ్గజం మెగ్ లాన్నింగ్ వరల్డ్ రికార్డును సమం చేసింది. ఈ ఇద్దరూ అంతర్జాతీయ క్రికెట్‌లో చెరో 17 సెంచరీలు చేశారు. లాన్నింగ్ వన్డేల్లో 15, టీ20ల్లో 2 సెంచరీలు చేయగా.. మంధన వన్డేల్లో 14, టెస్టుల్లో 2, టీ20ల్లో ఓ సెంచరీ చేసింది.

మహిళల వన్డే ప్రపంచకప్లో భాగంగా గురువారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సూపర్ సెంచరీ చేసిన మంధన.. లాన్నింగ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును సమం చేసింది. ఇకపై మంధన ఏ ఫార్మాట్లో అయినా సెంచరీ చేస్తే అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక శతకాల రికార్డు ఆమె పేరిటే సోలోగా ఉంటుంది.

**అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక సెంచరీలు చేసిన టాప్-5 బ్యాటర్లు..**

**స్మృతి మంధన-17(వన్డేల్లో 14,టెస్టుల్లో 2,టీ20ల్లో 1)**
**మెగ్ లాన్నింగ్-17 (వన్డేల్లో 15, టీ20ల్లో 2)**
**సూజీ బేట్స్-13 (వన్డేల్లో 13)**
**ట్యామీ బేమౌంట్-12 (వన్డేల్లో 12)**
**నాట్ సీవర్ బ్రంట్-10 (వన్డేల్లో 10)**

పై జాబితాలో మంధన మినహా మిగతా నలుగురు ఏదైన ఒకటి లేదా రెండు ఫార్మాట్లలో మాత్రమే సెంచరీలు చేశారు. మంధన మాత్రమే మూడు ఫార్మాట్లలో సెంచరీలు చేసి ఆల్ ఫార్మాట్ ప్లేయర్‌గా నిరూపించుకుంది.

న్యూజిలాండ్ పై తాజా సెంచరీతో మంధన మరో రికార్డు కూడా సమం చేసింది. ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వన్డే సెంచరీలు చేసిన ప్లేయర్‌గా తజ్మిన్ బ్రిట్స్ తో (సౌతాఫ్రికా) పాటు ప్రపంచ రికార్డును పంచుకుంది. తజ్మిన్, మంధన ఇద్దరు ఈ ఏడాది చెరో 5 సెంచరీలు చేశారు.

ఈ సెంచరీతో మంధన వన్డేల్లో అత్యధిక సెంచరీలు (14) చేసిన బ్యాటర్ల జాబితాలో రెండో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో సూజీ బేట్స్‌ను (13) దాటి, అగ్రస్థానంలో ఉన్న మెగ్ లాన్నింగ్‌కు (15) మరింత చేరువయ్యింది.

## తల వంచి, మౌనంగా నిష్క్రమించి..



మైదానంలో ఎంతో యాక్టివ్‌గా ఉండే టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి చాలా అరుదుగా మాత్రమే భావోద్వేగానికి గురవుతుంటాడు. అయితే తాజాగా అడిలైడ్ మ్యాచ్‌లో ప్రేక్షకులు చేసిన పనికి కింగ్ కోహ్లి ఎమోషనల్ అయ్యాడు. గురువారం ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా భారత్ రెండో వన్డే ఆడింది. ఈ మ్యాచ్‌లో కోహ్లి డకౌట్ అయ్యాడు. అతను జీరో పరుగులు చేసినా ప్రేక్షకుల నుంచి ఊహించని స్పందన లభించింది. అతడు డకౌట్ అయినా.. ప్రేక్షకులంతా కింగ్‌కు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. దీంతో కోహ్లి తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. 17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లికి.. అడిలైడ్‌లో ప్రేక్షకులు ఘన వీడ్కోలు పలికారు. ఇదే సమయంలో కోహ్లి తల వంచుకొని.. గ్లోవ్స్ తీసేసి ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెబుతూ మైదానం వీడాడు. ఈ సన్నివేశం కోహ్లి అభిమానులను తీవ్ర బాధకు గురి చేసింది.

అడిలైడ్ మైదానంలో ఒకప్పుడు రారాజుగా పరుగుల మోత మోగించిన కోహ్లి.. ఇప్పుడు మౌనంగా నిష్క్రమించడం చూసి అతడి అభిమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం కోహ్లి వికెట్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అడిలైడ్ గ్రౌండ్‌తో కోహ్లికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ మైదానంలోనే కోహ్లీ 5 శతకాలు బాదాడు. అంతేకాకుండా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఈ మైదానంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గానూ కింగ్ కోహ్లి రికార్డ్ సృష్టించాడు.

## న్యూజిలాండ్ మహిళా జట్టు కెప్టెన్ సోఫీ డివైన్ వన్డేలకు వీడ్కోలు



ఐదు ప్రపంచ కప్‌ల్లో ఆడిన న్యూజిలాండ్ మహిళా జట్టు కెప్టెన్ సోఫీ డివైన్ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ చేతిలో ఓటమితో వన్డే ప్రపంచ కప్ 2025 టోర్నీలో సెమీస్ అవకాశాలను కివీస్ కోల్పోయింది. దీంతో ఆదివారం ఇంగ్లాండ్‌తో మ్యాచ్ అనంతరం వన్డేలకు వీడ్కోలు పలుకుతానని సోఫీ డివైన్ వెల్లడించింది. ఈ సందర్భంగా భారత క్రికెట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తమ దేశంలో డొమెస్టిక్ క్రికెట్ ఇంకా మెరుగవ్వాలని.. భారత్‌కు మాత్రం మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) తో ప్రయోజనం చేకూరుతోందని తెలిపింది. డబ్ల్యూపీఎల్ వల్ల క్రికెట్‌కు గౌరవం వచ్చిందని వెల్లడించింది. భారత్‌లో దేశవాళీ క్రికెట్ వ్యవస్థ, నిర్మాణం మా దేశంతో పోలిస్తే చాలా భిన్నం, మరింత మెరుగుపడాలని వ్యాఖ్యానించింది. 36 ఏళ్ల సోఫీ డివైన్ ఇప్పటి వరకు 158 వన్డేలు, 146 టీ20లు ఆడింది. మొత్తం 7,600కిపైగా పరుగులు చేసింది. ఇందులో 9 వన్డే సెంచరీలు, ఒక టీ20 శతకం ఉంది.

## కుల్‌దీప్‌ను ఆడించకపోవటం తెలివితక్కువ నిర్ణయం..



ఆస్ట్రేలియా పర్యటనలో పెర్త్ వన్డేలో ఓటమి చవిచూసిన టీమ్ ఇండియా అడిలైడ్‌లో జరిగిన రెండో మ్యాచ్లోనూ పరాజయం పాలైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను 0–2తో కోల్పోయింది. భారత జట్టు దాదాపు 17 సంవత్సరాల తర్వాత ఆడిలైడ్ వేదికగా జరిగిన వన్డే మ్యాచ్లో ఓడిపోవటం గమనార్హం. బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ రాణించినప్పటికీ.. బౌలింగ్, ఫీల్డింగ్లో లోపాల వల్ల భారత జట్టు విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ మ్యాచ్‌లో టీమ్ ఇండియా నిర్దేశించిన 265 పరుగుల లక్ష్యాన్ని.. ఆసీస్ జట్టు 8 వికెట్లు కోల్పోయి 22 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. దీంతో జట్టు కూర్పుపై విమర్శలు విస్తున్నాయి. వికెట్ల తీయగల సత్తా ఉన్నా అతడిని తుదిజట్టుకు ఎంపిక చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా రెండో వన్డేలో ఆసీస్ స్పిన్నర్ ఆడం జంపా నాలుగు వికెట్లతో రాణించి... భారత బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించడం.. కుల్‌దీప్ లేని లోటును మరింతగా తెలియజెప్పింది. ఆతిథ్య జట్టు తమ స్పిన్నర్ను సమర్ధవంతంగా ఉపయోగించుకుంటే.. టీమిండియా మాత్రం వ్యూహాత్మక తప్పిదం చేసిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మొదటి రెండు వన్డేల్లోనూ చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడాన్ని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్లు రవిచంద్రన్ అశ్విన్, వరుణ్ ఆరోన్ తప్పుబట్టారు.

### తెలివి తక్కువ నిర్ణయం

అడిలైడ్ మ్యాచ్‌లో భారత జట్టు యాజమాన్యం అనుసరించిన వ్యూహాన్ని తప్పుబట్టిన దిగ్గజ స్పిన్నర్ అశ్విన్.. తెలివి తక్కువ నిర్ణయం కారణంగా సిరీస్ కోల్పోయామంటూ ఘాటు విమర్శలు చేశాడు. అడిలైడ్ వన్డేలో టీమిండియా బౌలింగ్ అటాక్ అత్యంత సాధారణంగా అనిపించింది. అసలు వికెట్ తీయాలని ఎవరూ ప్రయత్నించినట్లుగా అనిపించనేలేదు. పరుగులు చేయడం కంటే కూడా వికెట్లు పడగొట్టగలిగే బౌలర్లను ఎంపిక చేసుకోవాలి. ఆడం జంపా నాలుగు వికెట్లు ఎలా తీశాడో చూశారా?.. అతడు బంతిని తిప్పేశాడు. ప్రతిసారీ మన డ్రెసింగ్ రూమ్ దృష్టికోణం గురించే ఆలోచించవద్దు. మంచి కెప్టెన్లు, నాయకులు.. ఎల్లప్పుడూ ప్రత్యర్థి జట్టు ఎలాంటి ప్రణాళికలు రచిస్తుందో ముందే ఊహించి.. అందుకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకుంటారు.

ఈ మ్యాచ్‌లో బాగా ఆడిన ఆస్ట్రేలియా బ్యాటర్ కూపర్ కన్నోలి, మిచెల్ ఓవెన్ ఇంత వరకు అసలు కుల్‌దీప్‌ను ఎదుర్కోలేదు. మాథ్యూ షార్ట్.. అలెక్స్ క్యారీ గతంలో కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్లో ఇబ్బందిపడ్డాడు. ఆస్ట్రేలియా ప్రస్తుత బ్యాటింగ్ లైనప్‌లో చాలా మందికి కుల్‌దీప్ బౌలింగ్‌లో ఆడిన అనుభవమే లేదు. కాబట్టి అతడిని ఆడిస్తే.. ప్రత్యర్థి జట్టులోని ప్రతి బ్యాటర్ ఇబ్బంది పడేవాడు. ఇవేమీ ఆలోచించకుండా కుల్‌దీప్‌ను బెంచ్‌కు పరిమితం చేయడం తెలివితక్కువ నిర్ణయం అని కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతం గంభీర్ పై అశ్విన్ విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాడు.

### ఒక బ్యాటర్‌ను తగ్గించైనా..

జట్టులో ఒక బ్యాటర్‌ను తగ్గించైనా కుల్‌దీప్‌ను జట్టులోకి తీసుకోవాల్సిందని మాజీ క్రికెటర్ వరుణ్ ఆరోన్ అభిప్రాయపడ్డాడు. అతడు వికెట్ టేకింగ్ బౌలర్. జట్టులో ఒక బ్యాటర్‌ను తగ్గిస్తే.. తమ వెనక రన్స్ చేసే వారు లేరనే జాగ్రత్తతో మిగతా బ్యాటర్లు మరింత బాధ్యతాయుతంగా ఆడేందుకు ప్రయత్నిస్తారని నా అభిప్రాయం' అని అతడు అన్నాడు. జట్టులోకి కుల్‌దీప్‌ను తీసుకుంటే. అతడు కచ్చితంగా వికెట్లను కూల్చగలడు. భారత జట్టు ప్రత్యర్థి వికెట్లు తీసుకోవడం కంటే కూడా.. ఆ బ్యాటర్లు పొరపాటు చేసి వికెట్లు కోల్పోవాలని చూసింది. ఈ విషయం భారతజట్టు ఆటతీరు చూస్తేనే అర్థమైందని వరుణ్ ఆరోన్ కుండబద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

టీమ్ ఇండియా మొదటి రెండు మ్యాచుల్లో ఓడిపోవడంతో.. మూడు వన్డేల సిరీస్ ను ఇప్పటికే 2–0 తేడాతో కోల్పోయింది. ఇక చివరి వన్డే సిడ్నీ వేదికగా శనివారం జరగనుంది. అలాగే సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో అక్టోబర్ 29 నుంచి ఆసీస్‌తో టీమ్ ఇండియా అయిదు టీ20ల సిరీస్ ఆడనుంది.

## ప్రతీక.. బ్యాటింగ్ మెరుపుతీగ



భారత మహిళా క్రికెట్ జట్టులో అందరూ ఎక్కువగా ఓపెనర్ స్మృతి మంధాన గురించే మాట్లాడతారు. ఎందుకంటే భారత మహిళా క్రికెట్లో ఆమె ఓ స్టార్. దూకుడుగా ఆడటంతోపాటు ఎన్నో కీలక మ్యాచులు గెలిపించింది. కానీ, ప్రస్తుతం జరుగుతున్న మహిళల వన్డే ప్రపంచకప్ లో ఆమెతోపాటు మరొకరి గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాల్సిందే. ఆమే ఓపెనర్ ప్రతీకా రావల్. కివీస్ పై అద్భుత సెంచరీతో (122) ఆకట్టుకుంది. ఈ ప్రపంచ కప్‌లో ఒక్కసారి మినహా ప్రతి మ్యాచ్‌లోనూ 30కు పైగా స్కోరు చేయడం విశేషం. 6 మ్యాచ్‌ల్లో సెంచరీ, హాఫ్ సెంచరీ సాయంతో 51.33 సగటున 308 పరుగులు చేసి టోర్నీలో సెకెండ్ లీడింగ్ రన్ స్కోరర్‌గా కొనసాగుతోంది. ఒకవైపు స్మృతి మందాన ఆరంభ మ్యాచ్‌ల్లో కుదురుకోవడానికి ఇబ్బందిపడింది. ఆ సమయంలోనూ ప్రతీకా ఎదురుదాడికి దిగి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. అందువల్లే స్మృతి తొలి మూడు మ్యాచుల్లో తన స్థాయి ఆటను ప్రదర్శించలేకపోయినా.. ప్రతీకా తోడ్పాటుతో ఒత్తిడి నుంచి బయటపడింది. బంతిని బౌండరీ వైపు అలవోకగా పంపించడం ప్రతీకా స్పెషల్. అందులోను మరీ గట్టిగా కొట్టినట్టూ ఉండదు. సరైన టైమింగ్‌తో మంతిని బౌండరీ లైన్ దాటిస్తుంది. ఇలాంటి మెగా టోర్నీల్లో మంచి ప్రదర్శన ఇవ్వాలంటే ఎంతో అనుభవం ఉండాలి. కానీ, 25 ఏళ్ల ప్రతీకా అరంగేట్రం చేసి సంవత్సరం కూడా కాలేదు. అయినా సరే ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆడేందుకు కారణం 'సైకాలజీ' చదవడమేనని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు. సైకాలజీలో 75 శాతం మార్కులు సాధించిన ఆమె.. ప్రత్యర్థి ప్లేయర్ మైండ్‌సెట్ ఎలా ఉంటుందో ముందే ఊహించేస్తుంది. అందుకు తగినట్టుగా తన ఆటతీరులో మార్పు చేసుకుంటుంది.

ప్రతీకా రావల్ తండ్రి ప్రదీప్ కూడా క్రికెటరే. జాతీయ జట్టుకు ఆడలేకపోయినప్పటికీ తన కుమార్తెను మాత్రం అంతర్జాతీయ మ్యాచుల్లో ఆడేలా తీర్చిదిద్దాడు. క్రికెట్ మ్యాచ్లకు అంపైరింగ్ కూడా చేసే ప్రదీప్.. తన కుమార్తెకు దగ్గరుండి కోచింగ్ ఇచ్చాడు. యూనివర్సిటీ స్థాయిలో మీడియం పేసర్ కమ్ హార్డ్ హిట్టర్ అయిన ప్రదీప్ తన కుమార్తెను కూడా అలాగే తీర్చిదిద్దారు. అయితే, ప్రతీకా కెరీర్ ఆరంభం గొప్పగా ఏమీలేదు. గతేడాది డిసెంబర్లో అరంగేట్రం చేసిన ఆమె.. మొదట్లో అనుకున్నంత మేర రాణించలేకపోయింది. కానీ, ఆమె తనను తాను మెరుగుపర్చుకున్న తీరు అద్భుతం, ఇప్పుడు భారత మహిళా క్రికెట్ జట్టులో నాణ్యమైన ఓపెనర్‌గా ఎదిగింది. స్వతహాగా సైకాలజిస్ట్ కావడంతో.. క్లిష్ట పరిస్థితుల నుంచి ఎలా బయటకు రావాలనే దానిపై తీవ్రంగానే కసరత్తు చేసింది. ప్రత్యర్థుల ఆలోచనలే కాకుండా.. ఆటను అర్థం చేసుకోవడం మొదలు పెట్టింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ తోనే కాకుండా.. బౌలింగ్‌లోనూ తన సత్తా ఏంటో చూపించింది. రానున్న రోజుల్లో తప్పకుండా ఆల్రౌండర్ పాత్ర పోషించే స్థాయికి ఎదుగుతుందని విశ్లేషకులు అంటున్నారు.

### వేగంగా వెయ్యి పరుగులు

ప్రతిక రావల్ ఖాతాలో ప్రపంచ రికార్డు చేరింది. వన్డే ప్రపంచకప్‌లో భాగంగా గురువారం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్లో సూపర్ సెంచరీ చేసిన ఆమె.. వన్డేల్లో 1000 పరుగులు పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన ప్లేయర్‌గా ఆస్ట్రేలియాకు చెందిన లిండ్సే రీలర్ ప్రపంచ రికార్డును సమం చేసింది. లిండ్సే, ప్రతిక ఇద్దరూ 23 ఇన్నింగ్స్‌ల్లోనే 1000 పరుగులు పూర్తి చేశారు. సాధారణంగా ఆస్ట్రేలియా ప్లేయర్లతో నిండిపోయే ఇలాంటి రికార్డుల జాబితాలో ప్రతిక చేరడం విశేషం. వన్డేల్లో తొలి 1000 పరుగులను అత్యంత వేగంగా పూర్తి చేసిన టాప్–5 ప్లేయర్ల జాబితాలో ప్రతిక, లిండ్సే తర్వాత మిగిలిన ముగ్గురూ ఆస్ట్రేలియన్లే ఉన్నారు. నికోల్ బోల్టన్, మెగ్ లాన్నింగ్ చెరో 25 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని తాకగా.. బెలిండా క్లార్క్ 27 ఇన్నింగ్స్‌ల్లో చేరుకుంది. మొత్తమ్మీద కెరీర్లో 23 వన్డేలు ఆడిన ప్రతిక 2 సెంచరీలు, 7 అర్ధ సెంచరీల సాయంతో 50.45 సగటున 1110 పరుగులు చేసింది.

చైతన్య రథం సినిమా
శనివారం 25 అక్టోబర్ 2025 20

# సౌండ్ కంట్రోల్లో పెట్టుకో..

'సౌండ్ కంట్రోల్లో పెట్టుకో.. ఏ సౌండుకు నవ్వుతానో.. ఏ సౌండుకు నరుకుతానో నాకే తెలియదు' అంటున్నారు నందమూరి బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. 'బ్లాస్టింగ్ రోర్' అంటూ శుక్రవారం చిత్ర బృందం స్పెషల్ వీడియోను పంచుకుంది. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న ఈ మూవీ డిసెంబరు 5న విడుదలవుతోంది. సంయుక్త కీలక పాత్ర పోషిస్తున్న చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి సమర్పిస్తున్నారు.





## స్ట్రీమింగ్‌కు రెడీ అయిన కొత్తలోక

చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాసింది 'కొత్తలోక: చాప్టర్ 1'. కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిందీ సినిమా.ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా? అన్న అభిమానుల ఎదురుచూపులకు ఫుల్ స్టాప్ పెడుతూ జియో హాట్‌స్టార్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అక్టోబర్ 31 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్టు తెలిపింది. తెలుగు, మలయాళం, తమిళ, హిందీతోపాటు బెంగాలీ, మరాఠీలలోనూ ఇది స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుపుతూ ఓ పోస్టర్ విడుదల చేసింది.

**ఇంతకీ కథేంటంటే..**

చంద్ర అలియాస్ నీలి (కల్యాణి ప్రియదర్శన్) అతీంద్రియ శక్తులు కలిగి ఉంటుంది. ఒక మిషన్‌లో ఆమె త్రుటిలో శత్రువులనుంచి తప్పించుకుంటుంది. దీంతో చంద్ర స్వీడన్‌నుంచి బెంగళూరుకు షిఫ్ట్ అయ్యి తన గురించి ఎవరికీ తెలియకుండా ఒక కేఫ్‌లో పనిచేస్తూ ఉంటుంది. ఆమె పక్కింట్లో ఉండే సన్నీ (నస్లేన్) ఆమెతో స్నేహం పెంచుకుంటాడు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ నాచియప్ప గౌడ (శాండి మాస్టర్), అతడి బాస్ మానవ అవయవాల అక్రమ రవాణా చేస్తుంటారు. అనుకోకుండా తారసపడిన చంద్రపై నాచియప్పకు అనుమానం కలుగుతుంది. మరి ఆ తర్వాత అతడు ఏం చేశాడు? అసలు చంద్ర ఎవరు..? ఆమెను చూసి సన్నీ ఎందుకు అంతగా భయపడ్డాడు? అనేది చిత్ర కథ. ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్లకుపైగా వసూలు చేసింది. అంతేకాదు, అత్యధిక వసూళ్ల రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. మోహన్‌లాల్ కథా నాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ ఏడాది వచ్చిన 'ఎల్2: ఎంపురాన్' ఇప్పటివరకూ మలయాళంలో అత్యధిక వసూళ్లు (రూ.265.5 కోట్లు) రాబట్టిన చిత్రంగా ఉండేది. ఆ రికార్డును 'కొత్తలోక' బద్దలు కొట్టింది. డొమినిక్ అరుణ్ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ కేవలం రూ.30కోట్ల బడ్జెట్‌తో రూపొం దించారు. విడుదలైన 40 రోజుల్లో రూ.300 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్టు ట్రేడ్‌వర్గాల అంచనా.

# ఓటీటీకి ధనుష్ ఇడ్లీకొట్టు!



ధనుష్, నిత్యా మేనన్ జోడీగా నటించిన చిత్రం 'ఇడ్లీ కొట్టు'. ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకొచ్చింది. తన వ్యక్తిత్వం కోసం ఉద్యోగాన్ని వదిలి.. తండ్రి వారసత్వంగా ఇడ్లీ కొట్టు నడిపే సాధారణ వ్యక్తి పాత్రలో ధనుష్ కనిపించారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందడం, విజయవంతమైన 'తిరు' తర్వాత ధనుష్, నిత్యామేనన్ కలిసి నటించడంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, ఆ స్థాయి వినోదాన్ని మాత్రం అందించలేకపోయింది. ఇప్పుడు ఈ మూవీ ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. అక్టోబరు 29నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సదరు ఓటీటీ సంస్థ పోస్టర్ను పంచుకుంది.

**కథేంటంటే..?**

శివ కేశవులు (రాజ్‌కిరణ్) ఇడ్లీ కొట్టు అంటే ఆ ఊళ్లో ఫేమస్. ఎంతో ఇష్టంగా, మనసుపెట్టి చేసే ఆ కొట్లో ఇడ్లీలు ఎంతో రుచికరం. శివ కేశవుల కొడుకే మురళి (ధనుష్). కొత్తతరం కుర్రాడు కదా, తన తండ్రి నడుపుతున్న కొట్టుని కాస్త ఫ్రాంచైజీలా మార్చేసి, అదే పేరుతో ఇతరచోట్ల హోటల్స్ని ఏర్పాటు చేసి డబ్బు సంపాదించాలని ఆశపడతాడు. కానీ, తన చేతులతో చేయని ఇడ్లీలను తన పేరుతో అమ్మడానికి ససేమిరా ఇష్టపడడు శివకేశవులు. దాంతో మురళి ఉన్నతమైన జీవితం అంటూ కన్నవాళ్లని, ఉన్న ఊరుని వదిలి పట్నం బాట పడతాడు. అలా మొదలైన అతని పరుగు బ్యాంకాక్‌కి చేరుతుంది.

పనుల్లో పడి కన్నవాళ్లని కూడా పట్టించుకోడు. బ్యాంకాక్‌లోనే తన బిజినెస్ పార్టనర్ అయిన విష్ణువర్ధన్ (సత్యరాజ్) కూతురు మీరా (షాలిని పాండే)తో పెళ్లి నిశ్చయమవుతుంది. మరికొన్ని రోజుల్లో పెళ్లి అనగా మురళి తండ్రి శివ కేశవులు చనిపోతాడు. తండ్రి చివరి చూపు కోసం వచ్చిన మురళి తిరిగి బ్యాంకాక్ వెళ్లాడా లేదా? శివకేశవులు చనిపోయాక ఆయన ఇడ్లీ కొట్టు ఏమైంది? మురళికీ, కల్యాణి (నిత్య మేనన్)కీ మధ్య సంబంధమేమిటి? మీరాతో అతని పెళ్లి జరిగిందా? అన్నది మిగిలిన ఇతివృత్తం.

# శ్రీలంకకు వెళ్తోన్న పెద్ది

రామ్‌చరణ్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. సినిమాను దర్శకుడు బుచ్చిబాబు సానా డైరెక్ట్ చేస్తుండగా భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు క్రియేట్ చేసింది. ఇక ఈ సినిమాకు సంబంధించిన నెక్స్ట్ షెడ్యూల్ షూటింగ్ కోసం చిత్ర యూనిట్ శ్రీలంకకు పయనమయ్యారు. హీరో రామ్‌చరణ్‌తోపాటు దర్శకుడు బుచ్చిబాబు సానా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి శ్రీలంకకు బయల్దేరిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, శ్రీలంక షెడ్యూల్‌లో ఓ పాటతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు కూడా చిత్రీకరించేందుకు 'పెద్ది' టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ సినిమాలో రామ్‌చరణ్ రగ్డ్ లుక్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. అందాల భామ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా ఏఆర్ రెహమాన్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే



మార్చి 26న విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## వంగా ట్రైనింగ్‌లో స్టార్ల వారసులు!




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న లేటెస్ట్ మూవీ 'స్పిరిట్' కోసం ప్రేక్షకులు ఎంతగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో తెలిసిందే. సినిమాతో ఇండియన్ బాక్సాఫీస్ షేక్ కావడం ఖాయమని రెబల్ ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక నిన్న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన ఆడియో టీజర్‌ను మేకర్స్ వదిలారు. కేవలం ఆడియో టీజర్‌తోనే సినిమాపై హైప్‌ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు. అయితే, ఈ సినిమాను సందీప్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించేందుకు పక్కా ప్లానింగ్‌తో వెళ్తున్నాడు. ఇక ఈ సినిమాలో అందరినీ సర్‌ప్రైజ్ చేస్తూ టాలీవుడ్‌కు చెందిన స్టార్ హీరో రవితేజ, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ వారసులు కూడా వర్క్ చేస్తున్నారు. రవితేజ తనయుడు మహాధన్ భూపతిరాజు, త్రివిక్రమ్ తనయుడు రిషి మనోజ్.. 'స్పిరిట్' చిత్ర డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్స్‌గా వర్క్ చేస్తున్నారు. దీంతో సందీప్ రెడ్డివద్ద టెక్నికల్ మెలకువలు నేర్చుకునేందుకు ఇద్దరు స్టార్ వారసులు 'స్పిరిట్'లో జాయిన్ కావడం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.



## కాంతర.. వసూళ్ల పరుగు

కన్నడ నటుడు కమ్ డైరెక్టర్ రిషబ్‌శెట్టి రూపొందించిన హిట్ చిత్రం 'కాంతార చాప్టర్ 1'. దసరా కానుకగా అక్టోబర్ 2న గ్రాండ్ రిలీజ్ అయింది. సినిమా పాన్ ఇండియా చిత్రంగా ప్రేక్షకులను మెప్పిస్తూ బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఇక సినిమాకు వస్తున్న ట్రెమండస్ రెస్పాన్స్‌తో ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర వసూళ్ల వర్షం కురిపిస్తోంది. తాజాగా ఈ చిత్రం వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.818 కోట్లమేర గ్రాస్ వసూళ్లు రాబట్టినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో సినిమా 2025లో హయ్యెస్ట్ వసూళ్లు రాబట్టిన సినిమాగా రికార్డు క్రియేట్ చేసింది. ఇప్పటివరకు ఈ రికార్డు బాలీవుడ్ చిత్రం 'ఛావా' పేరుపై ఉండగా.. ఇప్పుడు కాంతార చాప్టర్-1 ఆ రికార్డును బద్దలుకొట్టింది. ఇక ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటించగా హొంబలే ఫిల్మ్స్ ఈ సినిమాను నిర్మించింది.